www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 12-1-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 285 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి తె. 5.03 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: మృగశిర ఉ.11.24 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.7.31-9.04; దుర్ముహూర్తం: సా.4.26-5.10; అమృతఘడియలు: రా.12.57-2.30; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం:6.51; సూర్యాస్తమయం: 5.55 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భయభక్తులు ఉన్నాయా?

తిరుపతిలో తొక్కిసలాట తర్వాత జరిగిన సన్నివేశాలు మాత్రం జుగుప్సాకరంగా ఉన్నాయి. కొండ మీద ఏం జరుగుతోంది? అన్న సందేహాలు తలెత్తాయి. ఈ సందర్భంగా రాజకీయాలు, వ్యక్తుల మధ్య వైషమ్యాలు బయటపడటం శోచనీయం. ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలోనే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామల రావు గొడవపడ్డారు. బాధ్యతాయుతమైన స్థానాలలో ఉన్న వారి మధ్య భేషజాలు ఏర్పడి భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయమై సమన్వయం కొరవడినట్టు స్పష్టమవుతోంది. కీలక పదవులలో ఉన్న వారి మధ్య ఆధిపత్య పోరు జరుగుతుండటం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

సాక్షాత్తూ సీఎం సమక్షంలోనే గొడవపడటానికి ఛైర్మన్‌కూ, ఈవోకూ ఎంత ధైర్యం ఉండాలి? జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఆయనకు ఎదురుగా కూర్చోవడానికి కూడా అధికారులు జంకేవారు. తొలిసారి సీఎం పదవిని చేపట్టిన జగన్ వద్దనే అంతగా భయభక్తులు ప్రదర్శించిన అధికారులు పద్నాలుగేళ్లకు పైగా సీఎంగా వ్యవహరించిన చంద్రబాబు వద్ద ఎలా మెలగాలి? అలాంటిది లెక్కలేనట్టుగా వ్యవహరించడమేమిటి?

టీటీడీ ఈవో పదవి కోసం ఐఏఎస్‌లు పోటీపడుతుంటారు. పాలక మండలి ఛైర్మన్ పదవికి ఎంత గిరాకీ ఉంటుందో అందరికీ తెలిసిందే. ఈ పదవులకు ఎందుకంత డిమాండ్? దేవుడిపై భక్తితోనా? లేక... శ్రీవెంకటేశ్వరుడి దర్శనానికి వచ్చే ప్రముఖులతో పరిచయాలు పెంచుకొని తద్వారా తమ పలుకుబడి పెంచుకోవడానికా? అన్నది ఇక్కడ కీలకం. టీటీడీ పాలక మండలి సభ్యుల పోస్టులకు కూడా డిమాండ్ పెరిగింది. ఒక్కో పోస్టు కోసం రూ.10 నుంచి 20 కోట్లు ఖర్చు చేయడానికీ వెనుకాడని వారిని ఎలా అర్థం చేసుకోవాలి?

కారణాలు ఏవైనా ప్రజల్లో భక్తి భావం పెరుగుతుండటం వల్ల ప్రవచనకారుల సంఖ్య కూడా పెరుగుతోంది. డొక్కశుద్ధి, వాక్‌శుద్ధి లేని వారు కూడా ఒళ్లంతా బొట్లు పెట్టుకొని ప్రజల్లో మూఢ భక్తిని ప్రేరేపిస్తున్నారు. అహాన్ని వదులుకోలేని వారికి భక్తులకు బోధించే అర్హత ఉంటుందా? అసూయను ఒళ్లంతా నింపుకొని ఎన్ని సుద్దులు చెబితే మాత్రం ఏమి ప్రయోజనం? ధర్మ నిష్ఠ లేనప్పుడు ఎంత భక్తిని ప్రదర్శించినా ఏమిటి ప్రయోజనం? ప్రజల్లో స్వార్థ కాంక్షను తగ్గించలేని ప్రవచనాల వల్ల ఎవరికి ప్రయోజనం?


కొత్త పలుకు!

జరిగిన విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలు పూర్తి కాకముందే రాజకీయాలు రంగప్రవేశం చేశాయి. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్న మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఛైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యానించడంతో దాని ప్రభావం కూటమి ప్రభుత్వంపై పడింది. నిజానికి పవన్ చేసిన సూచనలో తప్పు లేదు. జరిగిన దానికి నైతిక బాధ్యత వహిస్తూ క్షమాపణలు చెప్పడం హుందాగానే ఉంటుంది.

టీటీడీ పాలక మండలిలో కూడా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన సభ్యులు ఉన్నారు. వారు అవసరానికి, పరిమితికి మించి స్వేచ్ఛను తీసుకుంటున్నారు. ఇతర పార్టీల సభ్యులపై చంద్రబాబుకు కూడా అదుపు ఉండటం లేదు. అధికారులకు దిక్కు తోచడం లేదు. నిర్ణయాలన్నీ తమకు చెప్పిన తర్వాత మాత్రమే తీసుకోవాలని అధికారులపైన బోర్డు ఒత్తిడి తెస్తోంది.

కేంద్రంలో భాగస్వామ్య పక్షాలన్నీ తమ పరిమితులను తెలుసుకొని మోదీ నాయకత్వంలో పనిచేస్తున్నాయి. పీఎంకి పోటీగా ఇతర భాగస్వామ్య పక్ష నాయకులు ప్రకటనలు చేసేందుకు సాహసించడం లేదు. మోదీ ప్రభుత్వం టీడీపీ బలంపైన ఆధారపడి మనుగడ సాగిస్తోంది. అయినా చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే ప్రయత్నం చేయడం లేదు. ప్రధాని అధికారాలను ప్రశ్నించే సాహసం చేయడం లేదు.

4

జనసేన తరఫున స్వతంత్రంగా వ్యవహరించే స్వేచ్ఛ పవన్‌కు ఉంటుంది. అయితే ప్రభుత్వానికి సంబంధించిన విషయాలలో విధాన నిర్ణయాలు తీసుకొనే అధికారం సీఎంకి మాత్రమే ఉంటుంది. సీఎంకి పోటీగా డిప్యూటీ సీఎం ప్రకటనలు చేస్తే దాని ప్రభావం వేరుగా ఉంటుంది. ప్రభుత్వంలో సమన్వయం కొరవడుతుంది. కూటమిలో చిచ్చు పెట్టడానికి జగన్ అండ్ కో కాచుకొని ఉన్నారు. ఏపీ బాగుపడాలన్నా, పెట్టుబడులు పెట్టే వారిలో విశ్వాసం ఏర్పడాలన్నా కూటమిలో ఐక్యత ఉంది-ఉంటుంది అన్న నమ్మకం కూడా కలిగించాలి. తెలుగుదేశం-జనసేన మధ్య, ముఖ్యంగా చంద్రబాబు-పవన్ కల్యాణ్ మధ్య మరింత సమన్వయం అవసరం. తిరుమల కొండపై పరిస్థితిని గాడిలో పెట్టడానికి ఉమ్మడిగా యోచన చేయాలి.

కొత్త కంపెనీలు బీర్లు

ఫిబ్రవరిలో ఎంపిక పూర్తి.. మార్చిలో కొత్త సరుకు


ఎక్సైజ్ శాఖపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి తదితరులు

- దరఖాస్తులకు త్వరలో నోటిఫికేషన్
- సంస్థల ఎంపికలో పారదర్శకత
- నాణ్యత, ప్రమాణాలకు పెద్దపీట
- ధరలపై కమిటీ సిఫార్సుల పరిగణన
- ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో పరిశీలన
- పెంచాలనే బెదిరింపులకు తలొగ్గం
- సర్కారును నియంత్రించాలని చూస్తే సహించేది లేదు: సీఎం రేవంత్
- ఎక్సైజ్ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష
- బీర్ల తయారీ నిలిపివేతపై కంపెనీలకు సీఎం పరోక్ష హెచ్చరికలు
- గతంలోని బకాయిలు క్రమంగా చెల్లింపు

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే కొత్త బ్రాండ్లతో కూడిన బీర్లు రానున్నాయి. ఈ మేరకు బీర్ల ఉత్పత్తి కోసం మద్యం కంపెనీలను ఆహ్వానించాలని.. దరఖాస్తులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరిలోపు కంపెనీలను ఖరారు చేసి, మార్చి నుంచే కొత్త బ్రాండ్లు షాపుల్లోకి వచ్చే విధంగా ముందుకెళ్లాలని నిర్ణయించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదంటూ రాష్ట్రంలోని ప్రముఖ బీర్ల తయారీ కంపెనీ యునైటెడ్ బ్రూవరీస్(యూబీ) బీర్ల ఉత్పత్తిని నిలిపివేసిన విషయం

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్ వ్యవస్థ

- ఉత్తమ విధానంపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వండి
- ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లపై సౌర ప్లాంట్లు: సీఎం
- నెలాఖరులోగా ఉస్మానియా ఆస్పత్రికి శంకుస్థాపన
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మరోసారి టికెట్ లేనట్లే

13


ఆస్పత్రిలో జతిన్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

ఈత.. గుండెకోత

- కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు యువకుల దుర్మరణం
- అంతా హైదరాబాద్ నగర వాసులే..
- మృతుల్లో ఇద్దరు సొంత అన్నదమ్ములు
- 20 నిమిషాలు సాయం కోసం పిలుపు
- 7 గంటల గాలింపు.. మృతదేహాలు లభ్యం

గజ్వేల్/మర్కుక్, ముషీరాబాద్/కవాడిగూడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆ ఏడుగురు యువకులు మధ్యతరగతికి చెందిన బాల్య స్నేహితులు..! అంతా చిన్నచిన్న పనులు చేసుకునే నిరుపేద కుటుంబాలకు చెందినవారే..! సంక్రాంతి సెలవులను సరదాగా గడుపుదామనుకున్నారు. అనుకున్నదే తడవుగా కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ అందాలను తిలకించి, సెల్ఫీలు దిగి.. సాయంత్రానికి

మిగతా 14వ పేజీలో...

నాలుగేళ్లలో 30 మంది మృతి


- కొండపోచమ్మలో గల్లంతులే అధికం
- భద్రత లేక.. సూసైడ్ పాయింట్‌గా!

14

ఆర్ఆర్ఆర్ దక్షిణం నిర్మాణానికి

కేంద్రం ఓకే!

- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి ఆమోదం
- పెరిగిన దూరం.. గతంలో 189 కి.మీ
- ప్రస్తుతం 200 కిలోమీటర్లకు చేరిక
- డీపీఆర్ కోసం మళ్లీ టెండర్ల పిలుపు
- ఫిబ్రవరి 9వ తేదీ వరకు గడువు
- దక్షిణభాగం కేంద్రం చేపడుతుందని గతంలోనే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణభాగం పనులను కూడా కేంద్రమే చేపట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం తన ఆమోదాన్ని సూత్రప్రాయంగా తెలియజేసినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగాన్ని కేంద్రం ఆధ్వర్యంలోనే నిర్మిస్తున్న నేపథ్యంలో దానికి సమాంతరంగా దక్షిణభాగాన్ని కూడా నిర్మించాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి లేఖ రాసింది. రహదారికి అవసరమైన భూ సేకరణతోపాటు, సేకరించిన భూములకు చెల్లించే పరిహారంలో రాష్ట్రం వాటాగా 50 శాతం ఇస్తామని తెలిపింది. రహదారి మార్గాన్ని ఖరారు చేసే అలైన్‌మెంట్‌కు, భూసేకరణకు అనుమతి ఇవ్వాలని కోరింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం తాజాగా ఆర్ఆర్ఆర్ దక్షిణభాగాన్ని నిర్మించేందుకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' (డీపీఆర్)ను రూపొందించేందుకు కన్సల్టెన్సీల ఎంపిక కోసం గతేడాది నవంబర్ 25న రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 16 వరకు గడువు విధించి, 17న టెండర్ బిడ్‌లను తెరుస్తామని ప్రకటించింది. వివిధ కారణాలతో చివరితేదీ వరకు ఒక్క టెండరూ రాలేదు. దీంతో ప్రభుత్వం మళ్లీ టెండర్లను పిలిచి జనవరి 20 వరకు గడువునిచ్చింది. కానీ, ఈలోపే మళ్లీ ఆ టెండర్లను కూడా రద్దు చేసి.. టెండర్ల నోటిఫికేషన్‌లో పలు మార్పులు చేర్పులు చేసింది. ఫిబ్రవరి 9వ తేదీవరకు టెండర్లను వేసేందుకు అవకాశం కల్పించింది. 10న బిడ్‌లను తెరవనున్నారు. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగాన్ని నిర్మించేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలోనే.. డీపీఆర్ కోసం

మిగతా 13వ పేజీలో...


పంచాయతీ అఖాడాలో సాధువులు

మహా కుంభ మేళాకు వేళాయె!

- రేపటి నుంచే అతి పెద్ద హిందూ ఉత్సవం
- 144 ఏళ్లకొకసారి వచ్చే ఆధ్యాత్మిక సమ్మేళనం
- 45 రోజులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు
- 40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- ప్రయాగ్‌రాజ్‌లో అణువణువునా ఆధ్యాత్మిక శోభ

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

మహా కుంభమేళా..! ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ ఉత్సవం! ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే మహోత్తర సమ్మేళనం! ఆహ్వానం లేకుండానే కోట్లాదిమంది హాజరయ్యే వేడుక! భారతీయ ఆధ్యాత్మికతకు, ఆత్మకు ప్రతిరూపంగా భావించే 'మహా కుంభమేళా'కు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమైంది. ఈనెల 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజులపాటు గంగా, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో మహా కుంభమేళా జరగనుంది. జనవరి 13న పుష్య పౌర్ణమి స్నానంతో ప్రారంభమయ్యే ఈ బృహత్తర క్రతువు ఫిబ్రవరి 26 మహా శివరాత్రి నాడు


మిగతా 2వ పేజీలో...

టెంట్ సిటీ.. ప్రయాగ్‌రాజ్

- 2 లక్షల గుడారాల ఏర్పాటు
- సాధారణం నుంచి లగ్జరీ దాకా
- ఉచితం మొదలు రూ.లక్ష అద్దె

2

గ్రామాల్లో 'స్థానిక' సందడి



- సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చ
- వచ్చే నెలలోనే నిర్వహిస్తారని విస్తృతంగా ప్రచారం
- రిజర్వేషన్లలో మార్పు నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ
- పథకాల అమలుతో సర్కారు..
- వైఫల్యాలపై విమర్శలతో విపక్షాలు

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): "సర్పంచ్ ఎన్నికలు ఫిబ్రవరిలో అంటున్నారు నిజమేనా..? బీసీలకు రిజర్వేషన్లను పెంచుతారా? ఈ సారి మన ఊరు సర్పంచ్‌గిరీ ఎవరికి వస్తదో మరి?" ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న చర్చ ఇది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా ఇదే పరిస్థితి. ఏ ప్రాంతంలో చూసినా "ఎన్నికలు"తోనే సంభాషణలు మొదలవుతుండడం గమనార్హం. ఈసారి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పుపై కూడా విస్తృత చర్చ నడుస్తోంది. ఏ సామాజిక వర్గానికి అవకాశం దక్కుతుందనే దానిపై బేరీజు వేస్తున్నారు. మండల, జిల్లా స్థాయికి సంబంధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీల విషయంలోనూ రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయనున్నారోనని మాట్లాడుకుంటున్నారు. సంక్రాంతి సందర్భంగా పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్లిన వారు కూడా ఇదే అంశంపై చర్చిస్తున్నారు. కాగా, అధికార, ప్రతిపక్ష పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం స్థానిక ఎన్నికలపై ప్రత్యేకంగా

మిగతా 3వ పేజీలో...

దారులన్నీ పల్లెలకే..

- సంక్రాంతికి సొంతూళ్లకు పట్నం జనం.. వాహనాలతో కిక్కిరిసిన రోడ్లు
- బారులు తీరిన విజయవాడ రహదారి.. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్
- 32 కిలోమీటర్ల ప్రయాణానికి మూడు గంటలు
- 250కి పైగా ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలపై కేసులు నమోదు

12

ఉపాధికో పందెం కోడి!

- ఏపీలో పందాల కోసం నగరం నుంచి కోళ్లు
- విద్యార్థుల నుంచి టెకీల దాకా ఇదే వ్యాపకం
- గోదావరి జిల్లాల నుంచి వచ్చి కొనుగోలు
- కనీసం రూ.40వేలు.. గరిష్ఠం రూ.లక్ష వరకు


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ


బీఆర్ఎస్ కార్యాలయంపై ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల దాడి

భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంపై

కాంగ్రెస్ శ్రేణుల దాడి

- ఫర్నీచర్ ధ్వంసం చేసిన కార్యకర్తలు
- పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు.. రోడ్డెక్కి ఆందోళన
- ఇందిరమ్మ రాజ్యంలో గూండాయిజమా?: కేటీఆర్
- ప్రశ్నలకు జవాబు చెప్పలేక.. దాడులా: హరీశ్‌రావు
- కాంగ్రెస్ డీఎన్ఏలోనే ద్వేషం, హింస: కవిత

3



ఏఐజీలో రూ.400 కోట్లతో

ప్రోటాన్ బీమ్ థెరపీ

- క్యాన్సర్ రోగులకు అత్యాధునిక చికిత్స
- త్వరలో అందుబాటులోకి
- కణితిని కచ్చితంగా గుర్తించి దానికే చికిత్స
- రోగి త్వరగా కోలుకునేందుకు అవకాశం
- ఆస్పత్రుల ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

3

చంచల్‌గూడ సెంట్రల్ జైలు..

పర్యాటక కేంద్రం

- సమరయోధుల వివరాలతో మ్యూజియం
- రాజకీయ ఖైదీల జీవిత చరిత్ర వివరాలూ
- పెయింటింగ్స్, వస్తువుల ప్రదర్శన
- జైళ్లశాఖపై అవగాహన కల్పించే లక్ష్యం

12

గర్భవతులను చేయండి..

10 లక్షలు తీసుకోండి!

- పిల్లలు లేని మహిళల పేరిట ఎర
- బిహార్‌లో సైబర్ మోసగాళ్ల వల
- రిజిస్ట్రేషన్ పేరిట పాన్, ఆధార్ సేకరణ
- ఆపై డబ్బు గుంజేందుకు పన్నాగం

2



త్రివేణీ సంగమం వద్ద భక్తులు..

టెంట్ సిటీ.. ప్రయాగ్‌రాజ్!

దాదాపు 2 లక్షల వరకూ గుడారాల ఏర్పాటు

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)



హెచ్‌డీపీఈ కంటైనర్లతో తేలియాడే జెట్టి

ప్రయాగ్‌రాజ్.. ఇప్పుడు టెంట్ సిటీ! నదిలో.. నదీ తీరంలో.. ఖాళీ స్థలాల్లో.. త్రివేణీ సంగమం నుంచి దాదాపు పది కిలోమీటర్ల పరిధిలో కనుచూపు మేరలో ఎక్కడ చూసినా టెంట్లే! వీటిలో కనీస సదుపాయాలతో కూడిన మామూలు టెంట్ల నుంచి టీవీలు, సీసీటీవీ కెమెరాలతో కూడిన అత్యంత విలాసవంతమైన టెంట్లు కూడా ఉన్నాయి. గంగా నదిలో దాదాపు లక్ష టెంట్లతో ఏకంగా ఓ టెంట్ సిటీనే ఏర్పాటు చేశారు! ఇందుకు ఏకంగా 68 లక్షల కర్రలు, పైకప్పుల కోసం ఏకంగా 250 టన్నుల సీజీఐ షీట్లు ఉపయోగించారని అంచనా. ప్రయాగ్‌రాజ్‌లో ప్రస్తుతం 2లక్షలకుపైగా టెంట్లను ఏర్పాటు చేశారని అంచనా! వీటిలో ఏకకాలంలో 20 లక్షల మందికి వసతి కల్పించవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. కొన్ని ఉచితంగా ఇచ్చేవి కాగా.. మరికొన్ని అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ రూ.80 వేల నుంచి లక్ష వరకూ వసూలు చేసేవి!

గుడారాలు.. అనేక రకాలు..!

ఉచిత గుడారాలు కొన్ని.. విలాసవంతమైన గుడారాలు కొన్ని! సిబ్బందికి ఒక రకం! అధికారులకు మరో రకం! రాజకీయ నాయకులకు ఇంకో రకం! వీటిలో కొన్ని మామూలు గుడారాలు.. మరికొన్ని అగ్ని ప్రమాదం జరిగినా చెక్కుచెదరని ఫైర్ ప్రూఫ్ గుడారాలు! ఇలా.. వివిధ వర్గాల వారికి ప్రయాగ్‌రాజ్‌లో గుడారాలు ఏర్పాటు చేశారు. ఉదాహరణకు, ప్రయాగ్‌రాజ్‌కు చెందిన సర్వోదయ మండలి రెండు టెంట్లను ఏర్పాటు చేసింది. ఎక్కడా వసతి దొరకని వారికి ఇక్కడ ఉచితంగానే.. ఒక్కో టెంట్‌లో 30 మందికి వసతి కల్పిస్తామని దాని బాధ్యులు చెప్పారు. భక్తులకు ఉచితంగా వసతి కల్పించేందుకు కొందరు సేవాభావంతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, మరికొందరు గుడారాల్లో వసతితోపాటు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం, మాధవుడు, బడే హనుమాన్, అక్షయ్ వట్ దర్శనం తదితరాలతో కూడిన ప్యాకేజీలనూ అందిస్తున్నారు. డిమాండ్, సౌకర్యాలను బట్టి ఈ ప్యాకేజీలు రూ.3 వేల నుంచి లక్ష రూపాయల వరకూ పలుకుతున్నాయి. ఇక, ఐఆర్‌సీటీసీ కూడా వాణిజ్య ప్రాతిపదికన సూపర్ లగ్జరీ టెంట్లు, విల్లాలను ఏర్పాటు చేసింది. వీటికి రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తోంది. అలాగే, ప్రయాగ్‌రాజ్‌లో భద్రతను పర్యవేక్షించే పోలీసులు, ఐబీ, ఇంటెలిజెన్స్, ఇతర అధికారులు కూడా తమ తమ అవసరాల మేరకు ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసుకున్నారు. కొన్నిచోట్ల దాదాపు 80 గజాల స్థలంలో డబుల్ బెడ్‌రూం టెంట్లు ఏర్పాటు చేశారు. వీటిలో ముందు భాగంలో చిన్న సోఫాతో ఆఫీసు రూం.. వెనక బాత్‌రూం మధ్యలో రెండు బెడ్ రూంలు వరుసగా ఏర్పాటు చేశారు. మరికొన్నిచోట్ల 40-50 గజాల చిన్న టెంట్‌లోనే దాదాపు 15-20 మంచాలను ఏర్పాటు చేసి దాదాపు 40 మంది వరకూ ఉండేలా వసతి కల్పిస్తున్నారు.



సర్వోదయ మండలి గుడారాలు



నిఘా వర్గాల సిబ్బందికి డబుల్ బెడ్‌రూం టెంట్లు

మహా కుంభ మేళాకు వేళాయె!



అక్షయ్ వట్

(మొదటి పేజీ తరువాయి)

ముగుస్తుంది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే అరుదైన వేడుక కావడంతో యూపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్‌ను యోగి సర్కార్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. పట్టణంలో అడుగు పెట్టిన చోటు నుంచే ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. దాదాపు ప్రతి కూడలిలో గజ్జెలు, ఢమరుకం వంటి చిహ్నాలను ఉంచింది. గోడలకు పెయింటింగులు వేయించింది! విద్యుత్తు, ఇతర స్తంభాలకు త్రినేత్రం తదితర సొబగులను అద్దింది. నెలన్నరపాటు పుణ్య స్నానాలు ఆచరించేందుకు దాదాపు 40 కోట్ల మంది భక్తులు, యాత్రికులు వస్తారని యూపీ సర్కారు అంచనా వేస్తోంది. త్రివేణి సంగమానికి ఇరువైపులా దాదాపు 4 వేల హెక్టార్లలో సౌకర్యాలు కల్పిస్తోంది.

ఏఐ టెక్నాలజీ సాయంతో నిఘా

కోట్లాదిమంది భక్తులు హాజరయ్యే మహా కుంభమేళా కోసం ప్రభుత్వం అంతే స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టింది. ఇప్పటికే సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 2,750 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. అత్యంత కీలక, సమస్యాత్మక ప్రాంతాల్లో ఏఐ ఆధారిత కెమెరాలను బిగిస్తోంది. భక్తులకు సమాచారాన్ని అందించడానికి 80 వీఎండీ టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తోంది. '1920' పేరిట హెల్ప్‌లైన్‌తోపాటు 50 మందితో కాల్ సెంటర్‌నూ ఏర్పాటు చేస్తోంది. వేలాది సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన నిఘా కోసం డ్రోన్లు, ఏఐ సాయంతో కెమెరాలను వినియోగించనుంది. నీటిలోనూ నిఘా ఉంచే డ్రోన్లు అందుబాటులో ఉంచుతోంది. సైబర్ మోసాలకు తావు లేకుండా 56 మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులను రంగంలోకి దింపుతోంది.

కుంభమేళాలు నాలుగు..

హిందూ పురాణాల ప్రకారం.. దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని మథిస్తారు. అప్పుడు ఒక కుండ (కుంభం)లో అమృతం బయటకు వస్తుంది. దానిని రాక్షసులకు అందకుండా చేయడం కోసం మోహినీ రూపం ధరించిన విష్ణువు ఆ కుండను తీసుకుని వెళుతూ ఉంటాడు. ఆ సమయంలోనే నాలుగు అమృతం చుక్కలు నేలపై పడతాయి. ఆ నాలుగు ప్రాంతాలే ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్. అందుకే, వాటిని పవిత్ర పుణ్య క్షేత్రాలుగా భావిస్తూ కుంభమేళాలు నిర్వహిస్తారు. వీటిలో ఒక్కో కుంభమేళాను ఒక్కో చోట నిర్వహిస్తారు. మాఘ మేళాను ఏటా మాఘ మాసంలో ప్రయాగ్‌రాజ్‌లో; అర్ధ కుంభ మేళాను ప్రతి ఆరేళ్లకు ఒకసారి హరిద్వార్, ప్రయాగ్‌రాజ్‌ల్లో నిర్వహిస్తారు. పూర్ణ కుంభమేళాను ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి మొత్తం నాలుగు క్షేత్రాల్లోనూ అట్టహాసంగా నిర్వహిస్తారు. మహా కుంభ మేళా మాత్రం 144 ఏళ్లకు ఒకసారి వస్తుంది. దీనిని ఒక్క ప్రయాగ్‌రాజ్ లోనే నిర్వహిస్తారు. అందుకే దీనిని అత్యంత అరుదైన, పవిత్ర ఉత్సవంగా భావిస్తారు.

ముఖ్యమైన రోజులు ఇవే..

- జనవరి 13: పుష్య పౌర్ణమి స్నానం (ప్రారంభ రోజు)
- జనవరి 15: మకర సంక్రాంతి స్నానం
- జనవరి 29 మౌని అమావాస్య స్నానం
- ఫిబ్రవరి 3: వసంత పంచమి స్నానం
- ఫిబ్రవరి 12: మాఘ పౌర్ణమి స్నానం
- ఫిబ్రవరి 26: మహా శివరాత్రి స్నానం (ముగిసే రోజు)

అంకెల్లో మహా కుంభమేళా


45 రోజులు కుంభమేళా జరిగే మొత్తం రోజులు	**1250 కిలోమీటర్లు** 50 వేల నీటి కనెక్షన్లకు మంచినీటి పైప్ లైన్లు
12 కిలోమీటర్లు తాత్కాలిక ఘాట్ల నిర్మాణం	**400 కిలోమీటర్లు** ప్రయాగ్‌రాజ్‌లో తాత్కాలిక రోడ్ల నిర్మాణం
40 కోట్లు 45 రోజుల్లో కుంభమేళాకు వస్తారనుకుంటున్న భక్తులు	**1800 హెక్టార్లు** ప్రయాగ్‌రాజ్‌లో పార్కింగ్ స్థలం
దాదాపు 2 లక్షలు ప్రయాగ్‌రాజ్‌లో తాత్కాలిక టెంట్లు	
15 వేలు పారిశుద్ధ్య సిబ్బంది నియామకం	

ఏం చేస్తారంటే..

త్రివేణీ సంగమంలో స్నానం చేసి అక్కడే ఉన్న మాధవుడిని దర్శించుకుని, అక్షయ్ వట్ (మర్రిచెట్టు)ను దర్శించుకోవడాన్ని మహా కుంభమేళాలో భాగంగా భావిస్తారు. ఆ తర్వాత బడే హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తారు. దీపంతోపాటు ఇతర దానాలు చేయడాన్ని పవిత్రంగా భావిస్తారు. సంకీర్తనలు, భజనలు, యోగా, మెడిటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. తొలుత, నాగ సాధువులు వచ్చి పుణ్య స్నానాలు చేయడాన్ని కుంభమేళాకు ఆరంభంగా భావిస్తారు. ఆ తర్వాత అఖాడాలకు నిర్దిష్ట సమయం కేటాయిస్తారు. ఆ తర్వాతే సామాన్య భక్తులు స్నానాలు చేయడానికి అనుమతిస్తారు.

పుణ్య స్నానాలకు ముఖ్యమైన రోజులు

నెలన్నరపాటు జరిగే మహా కుంభమేళా సమయంలో గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని హిందువులు విశ్వసిస్తారు. 'షాహీస్నాన్'గా పిలిచే పుణ్య స్నానాన్ని ఆచరించడం ద్వారా ఆత్మ శుద్ధి అవుతుందని, పాపాల నుంచి విముక్తి చెందుతామని నమ్ముతారు. మొత్తం 45 రోజుల్లో ఆరింటిని అత్యంత పవిత్రమైన రోజులుగా భావిస్తారు. ఆ సమయంలో ఇసుక వేస్తే రాలనంతగా ప్రయాగకు భక్తులు పోటెత్తుతారు.









జెహెనియా

యుద్ధ క్షేత్రం నుంచి శాంతి కోసం!

రష్యా, ఉక్రెయిన్ నుంచి ప్రయాగ్‌కు

సత్యాన్వేషణకు వచ్చామని వెల్లడి

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

పుణ్య స్నానాలు ఆచరించేందుకు కొందరు..! పర్యాటక అనుభూతి కోసం మరికొందరు..! సత్యాన్వేషణలో ఇంకొందరు..! ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళాకు తరలి వచ్చే విదేశీయులు ఎందరో!! ఎప్పట్లాగే, ఈసారి కూడా పెద్ద ఎత్తున విదేశీయులు కుంభ మేళాకు తరలి వస్తున్నారు. ముఖ్యంగా, యుద్ధ క్షేత్రాలైన రష్యా, ఉక్రెయిన్ నుంచి పలువురు ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. వారిలో ఒకరు జెహెనియా! ఆయన రష్యాలో యోగా శిక్షకుడు. మూడేళ్ల కిందట భారత దేశానికి వచ్చేశారు. ప్రస్తుతం ఆయన ప్రయాగ్‌రాజ్‌లో చిన్న టెంట్ వేసుకుని కనిపించారు. ఉక్రెయిన్ నుంచి ఏడాది కిందట వచ్చిన మరో ముగ్గురు కూడా ఆయనతోపాటు ఇక్కడే ఉన్నారు. వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉండడం విశేషం. మీరంతా కుంభమేళాకు ఎందుకు వచ్చారని ప్రశ్నించినప్పుడు 'సత్యాన్వేషణ'కు అని జవాబిచ్చారు. యుద్ధాలతో రష్యా, ఉక్రెయిన్ అల్లకల్లోలంగా మారాయని, శాంతి, ఆధ్యాత్మిక భావాలను అన్వేషించడానికే తాము ఇక్కడికి వచ్చామని వివరించారు. ఇక, క్రియా యోగాను నేర్చుకోవడానికి కొందరు, మానసిక శాంతి కోసం మరికొందరు ప్రయాగ్‌రాజ్‌కు తరలి వస్తున్నారు.

దళిత క్రీడాకారిణిపై 62 మంది అత్యాచారం

» కేరళలో అయిదేళ్లుగా దారుణం.. 15 మంది అరెస్టు



పథనంథిట్ట, జనవరి 11: కేరళకు చెందిన ఓ దళిత క్రీడాకారిణిపై పలువురు అత్యాచారం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. 18 ఏళ్ల ఆ జిల్లా స్థాయి క్రీడాకారిణిపై గత అయిదేళ్లుగా కనీసం 62 మంది ఈ దారుణానికి పాల్పడినట్లు శనివారం పోలీసు వర్గాలు తెలిపాయి. ఇప్పటికే 15 మంది నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్టు పేర్కొన్నాయి. ఇందులో 40 మందిపై పోక్సో చట్టం కింద కేసులు పెట్టారు. ఆ బాలిక 13 ఏళ్ల వయసు ఉన్నప్పుడే ఆమెపై లైంగిక దాడి జరిగింది. పొరుగింటి వ్యక్తి ఒకరు బలవంతంగా ఆమెను కొండ పక్కన ఉన్న ఇంటి తీసుకువెళ్లి బూతు చిత్రాలు చూపించాడు. అనంతరం అతడు, అతని స్నేహితులు అత్యాచారం చేశారు. పోటీల నిమిత్తం వివిధ ప్రదేశాలకు వెళ్లినప్పుడు తోటి ఆటగాళ్లు, కోచ్‌లు కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. అయితే దీనిని ఇంతవరకు ఆమె తల్లిదండ్రులకు చెప్పలేదు. తండ్రి మద్యానికి బానిస కావడంతో పెద్దగా పట్టించుకోలేదు. ఆమె తన తండ్రి సెల్‌ఫోన్‌నే ఉపయోగించుకునేది. ఆ ఫోన్‌లోని కాంటాక్టు లిస్టులో ఉన్న వ్యక్తులే ఈ దారుణానికి పాల్పడినట్టు తేలింది. కేరళ మహిళా సమాఖ్య సొసైటీ వాలంటీర్లు ఇటీవల క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న క్రమంలో ఈ నేరం వెలుగులోకి వచ్చింది. దాంతో వారు పథనంథిట్ట జిల్లా శిశు సంక్షేమ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ కమిటీ చైర్మన్, న్యాయవాది ఎన్.రాజీవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 3రోజుల్లో నివేదిక ఇవ్వాలని మహిళా కమిషన్ రాష్ట్ర అధికారులను ఆదేశించింది.

పిల్లలు లేని మహిళల్ని గర్భవతులను చేయండి రూ.10 లక్షలు తీసుకోండి!

» బిహార్‌లో వినూత్న మోసం.. ముగ్గురి అరెస్టు

పట్నా, జనవరి 11: పిల్లలు లేని మహిళల్ని గర్భవతులను చేయండి... రూ. 10 లక్షలు తీసుకోండి... ఇది బిహార్‌లో సైబర్ మోసగాళ్లు పన్నిన కొత్త వల! ఈ వలలో పడ్డవారిని రిజిస్ట్రేషన్ పేరిట వారి పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫొటో అడిగి అవి ఇచ్చాక... రిజిస్ట్రేషన్, హోటల్ బుకింగ్‌కు డబ్బు ఇవ్వాలని గుంజుతున్నారు. అయితే బిహార్ పోలీసులు దీన్ని గుర్తించి ముగ్గుర్ని అరెస్టు చేయడంతో వారి మోసాలకి అడ్డుకట్ట పడింది. బిహార్‌లోని నవాడా జిల్లా నార్దిగంజ్ సబ్‌డివిజన్ కహూరా గ్రామంలో ఈ మోసం చోటు చేసుకుంది. సైబర్ మోసగాళ్లు "ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్ సర్వీస్" అని పేరు పెట్టి మరీ ఈ మోసానికి తెర తీశారు. ఇందులో చిక్కిన వారిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నారని బిహార్ పోలీసులు వెల్లడించారు. ఒకవేళ మహిళల్ని గర్భిణులను చేయలేకపోయినా రూ. 50,000 నుంచి రూ.5 లక్షల వరకు ఇస్తామని ఎర వేయడం విశేషం. వీరు "ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్ సర్వీస్"తోపాటు "ప్లేబాయ్ సర్వీస్"కూ తెర తీయడం గమనార్హం. ఈ మోసగాళ్లు ఫేస్‌బుక్‌లో ప్రకటనలు ఇవ్వడంతో వాటికి ఆకర్షితులై ఫోన్ చేసిన వారి నుంచి రిజిస్ట్రేషన్, హోటల్ బుకింగ్ పేరిట డబ్బు గుంజుతున్నారని డీఎస్పీ ఇమ్రాన్ పర్వేజ్ తెలిపారు. ఈ కేసులో ప్రిన్స్ రాజ్, భోలా కుమార్, రాహుల్ కుమార్ అనేవారిని అరెస్టు చేశారు. 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో వారు సాగించిన వాట్సాప్ చాట్‌లు, ఖాతాదారుల ఫొటోలు, ఆడియో రికార్డింగులు, బ్యాంకు లావాదేవీల వివరాలు తెలుసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

కమలంతో పొత్తు పొడవొచ్చు

» శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత రౌత్ వ్యాఖ్యలు



పుణె, జనవరి 11: బీజేపీతో భవిష్యత్తులో పొత్తుకు ఉన్న అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) సీనియర్ ఎంపీ సంజయ్ రౌత్ శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఒకనాడు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే ఇద్దరూ మాకు విత్రులే. రాజ్ ఇప్పటికీ మా మిత్రుడే. ఉద్ధవ్ మాత్రం మాకు శత్రువు కాదు" అంటూ శుక్రవారం నాగ్‌పూర్‌లో సీఎం ఫడణవీస్ వ్యాఖ్యానించారు. ఫడణవీస్ వ్యాఖ్యలకు స్పందనగా ఆ మరునాడే రౌత్ పైవిధంగా స్పందించారు. బిహార్ సీఎం నితీశ్‌కుమార్ పేరు ప్రస్తావిస్తూ... బీజేపీకి గట్టి ప్రత్యర్థిగా ఉన్న నితీశ్ ఇప్పుడు అదే పార్టీ కూటమిలో కొనసాగుతున్నారని గుర్తుచేశారు. బీజేపీ, శివసేన మధ్య పాతికేళ్ల మిత్రత్వం ఉన్నదని, తమను బీజేపీయే వద్దనుకున్నదని రౌత్ అన్నారు. తాము భాగస్వామిగా ఉన్న మహా వికాస్ అఘాడీపై వ్యాఖ్యానిస్తూ.. తమ కూటమి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కోసం మాత్రమే ఏర్పడిందని రౌత్ అన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థలకు త్వరలో జరిగే ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన ప్రకటించారు. కాగా, ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు శివసేన (ఉద్ధవ్ వర్గం) మద్దతు ప్రకటించింది.

కాంగ్రెస్ ఏకాకి!

ఢిల్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి.. కీలక పార్టీల మద్దతు కేజ్రీవాల్‌కే

» ఆప్ తరఫున ప్రచారానికీ సిద్ధం

» బీజేపీకి.. కాంగ్రెస్ 'బీపార్టీ': ఆప్

» మాదే విజయం: కమలనాథులు



న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి చెందిన కీలక పార్టీలు కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి మద్దతు ప్రకటించాయి. దీంతో కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఏకాకిగా మారింది. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్‌కు అండగా నిలవాలని నిర్ణయించాయి. ఢిల్లీలో ఆప్ పార్టీ బలంగా ఉందని శివసేన(యూబీటీ) ప్రకటించింది. ఈ పరిణామంతో అసలు ఇండియా కూటమి అస్తిత్వంలో ఉందా? లేదా? అన్న విషయం చర్చగా మారింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ కూటమి భేటీ ఒక్కటి కూడా జరగకపోవడం ఇక్కడ గమనార్హం. అయితే, ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఆప్ ప్రత్యర్థి పార్టీయేనని, ఆ పార్టీతో తమకు ప్రాంతీయ స్థాయిలో అవగాహన లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కేరళలో వామపక్షాల విషయంలో కూడా ఇదే వైఖరి ప్రదర్శిస్తున్నట్టు తెలిపాయి. పార్లమెంటులో ఇండియా కూటమి సభ్యులంతా ఏకతాటిపై నడుస్తున్నారని ఈ వర్గాలు చెప్పాయి. ఇండియా కూటమి సభ్యులు సంఘటితంగా వ్యవహరించినందువల్లే వక్ఫ్ బిల్లు, జమిలి ఎన్నికల బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించాల్సి వచ్చిందని తెలిపాయి.

బీజేపీకి 'బీ పార్టీ': ఆప్

కాంగ్రెస్ వైఖరిపై ఆప్ నేతలు మరో విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. హరియాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విత్రపక్షాలకు సీట్లు కేటాయించేందుకు నిరాకరించడం వల్లే ఆప్ ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోలేదని ఆప్ నేతలు చెబుతున్నారు. ఆప్ ఓట్లను చీల్చేందుకే కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, ఢిల్లీలో కాంగ్రెస్ బీజేపీకి 'బీ పార్టీ'గా వ్యవహరిస్తోందని విమర్శించారు. మరోవైపు, కాంగ్రెస్ నేతలు బలంగా పోటీ పడితే అది బీజేపీకే లాభం కలుగుతుందని, 26 ఏళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వీలు కలుగుతుందని కమలనాథులు చెబుతున్నారు. ముక్కోణపు పోటీలో బీజేపీకే లాభమని అంచనా వేస్తున్నారు. అయితే, ఇండియా కూటమి అనేది అస్తిత్వంలోనే లేదని, ప్రధాన పోటీ ఆప్, బీజేపీల మధ్య మాత్రమేనని మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అసలు కూటమి వివిధ రాష్ట్రాల్లో ఏ విధంగా వ్యవహరించాలన్న విషయం స్పష్టం చేయకపోతే దాన్ని రద్దు చేయడమే మంచిదని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. దీంతో ఢిల్లీ ఎన్నికలు ఇండియా కూటమి మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయి.

చిన్న పార్టీలతో పెద్ద తంటా!

ఢిల్లీలో బీఎస్పీ, ఎంఐఎం సహా మరికొన్ని చిన్న పార్టీలు కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడంతో కీలకమైన ఓటు బ్యాంకు చీలే అవకాశం ఉందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ముస్లిం ప్రభావిత నియోజకవర్గాలపై ఎంఐఎం దృష్టి పెట్టింది. ఇక, 70 నియోజకవర్గాల్లోనూ తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు బీఎస్పీ ప్రయత్నిస్తోంది. అంతే కాదు.. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల ముఖ్య నాయకులు రంగంలోకి దిగుతున్నారు. అదేవిధంగా భారతీయ లిబరల్ పార్టీ(బీఎల్పీ) కూడా 70 స్థానాల్లోనూ తన అభ్యర్థులను బరిలోకి దింపింది. ఆయా పార్టీలు స్థానిక, సామాజిక వర్గ సమస్యలతోపాటు అవినీతి, లంచాలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాయి.

సర్కారుకు రూ.2,026 కోట్ల నష్టం!

» ఢిల్లీ మద్యం విధానానికి లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం పొందలేదు

» మంత్రి మండలి అనుమతి కూడా లేదు

» స్పష్టం చేసిన కాగ్ నివేదిక!

» ఎన్నికల వేళ ఢిల్లీ రాజకీయాల్లో చిచ్చు!



న్యూఢిల్లీ, జనవరి 11: అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఢిల్లీ రాజకీయాల్లో మరోమారు 'మద్యం విధానం' చిచ్చు రేగింది. కేజ్రీవాల్ సర్కారు అమలు చేసిన కొత్త మద్యం విధానం-2021 వల్ల ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నిగ్గుతేల్చింది. వాస్తవానికి కేంద్ర బడ్జెట్‌కు ముందు విడుదలవ్వాల్సిన కాగ్ నివేదికలో.. లిక్కర్ పాలసీ వివరాలు లీకైనట్లు జాతీయ మీడియా కథనాలను ప్రసారం చేసింది. ఈ పాలసీ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సర్కారు విఫలమైనట్లు కాగ్ స్పష్టంచేసింది. ఈ విధానం అమలుకు ముందు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను అప్పటి ఉప ముఖ్య మంత్రి సిసోడియా నేతృత్వంలోని మంత్రుల బృందం విస్మరించిందని ఆక్షేపించింది. కీలక నిర్ణయాల విషయంలో మంత్రి మండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కూడా తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సుల జారీ, నిబంధనల విషయంలో ఉల్లంఘనలు జరిగినట్లు తెలిపింది. పలు ఫిర్యాదులున్నప్పటికీ.. ఆర్థిక స్థితిగతులను అంచనా వేయకుండానే.. అన్ని సంస్థలను వేలానికి అనుమతించినట్లు.. వాటి లైసెన్సులను పునరుద్ధరించినట్లు వివరించింది. కాగా.. ఈ మద్యం విధానం వ్యవహారంలో ఇప్పటికే సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో కేజ్రీవాల్, సిసోడియా తదితరులు అరెస్టు అయి, తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు.

రాజకీయాల్లో వాగ్యుద్ధం

వచ్చేనెల 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో ఇప్పుడు కాగ్ నివేదిక చిచ్చు రాజకీయాల్లో వాగ్యుద్ధానికి తెరతీసింది. అధికార ఆప్‌పై విపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విమర్శలు గుప్పించగా.. వాటిని ఆమ్ ఆద్మీ నేతలు తిప్పికొట్టారు. "కేజ్రీవాల్ విలాసవంతమైన అద్దాల మేడలో ఉంటారు. ప్రజలు మాత్రం మురికివాడల్లో నివసిస్తున్నారు" అని అమిత్‌షా విమర్శించారు. ఆప్ నేతల అవినీతిని కాగ్ నివేదిక బట్టబయలు చేసిందని నడ్డా అన్నారు. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ కూడా ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తూ.. కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారనే విషయం స్పష్టమైందన్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఈ విమర్శలను తిప్పికొట్టారు. కాగ్ ఇంకా నివేదికను సమర్పించలేదని బీజేపీ స్వయంగా అంగీకరించిందని గుర్తుచేశారు. ఒకవేళ నివేదిక నిజమైతే.. అదెక్కడుందో చూపాలని బీజేపీ, కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు.



400 కోట్లతో ఏఐజీలో 'ప్రోటాన్ బీమ్ థెరపీ'

- క్యాన్సర్ రోగులకు అత్యాధునిక విధానంలో చికిత్స
- ఆస్పత్రి నూతన అంకాలజీ విభాగంలో త్వరలో ఏర్పాటు
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రోగులకు ప్రోటాన్ బీమ్ థెరపీ' ద్వారా అత్యాధునిక చికిత్స అందించేందుకు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రి సిద్ధమవుతోంది. ఇందు కోసం రూ.400 కోట్ల వ్యయంతో డైనమిక్ ఏఆర్‌సీ సహా అత్యాధునిక ప్రోటోస్ వన్-ప్రోటాన్ థెరపీ సిస్టమ్‌ను దిగుమతి చేసుకునేందుకు బెల్జియంకు చెందిన ఐబీఏ అనే సంస్థతో ఒప్పందం చేసుకుంది. రూ.800 కోట్ల వ్యయంతో 300 పడకల సామర్థ్యంతో ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న అంకాలజీ విభాగంలో ఈ ప్రోటాన్ బీమ్ థెరపీని అందుబాటులోకి తెస్తామని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ప్రకటించారు. ప్రోటాన్ బీమ్ థెరపీ అందుబాటులోకి వస్తే ఈ విధానంలో చికిత్స అందించే తెలుగు రాష్ట్రాల్లో తొలి ఆస్పత్రిగా, దేశంలోనే మూడో ఆస్పత్రిగా ఏఐజీ నిలుస్తుందని పేర్కొన్నారు. కాగా, ప్రోటాన్ థెరపీ విధానంలో క్యాన్సర్ కణితిని కచ్చితంగా గుర్తించి దానికి మాత్రమే చికిత్స చేయడం సాధ్యమవుతుందని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ విధానంలో కణితి చుట్టుపక్కల ఆరోగ్యంగా ఉన్న ఇతర అవయవాలకు ఎటువంటి నష్టం జరగదని, ఫలితంగా రోగి చాలా త్వరగా కోలుకుంటారని ఆయన వివరించారు. క్యాన్సర్ బారిన పడిన చిన్నారులు, వృద్ధులకు ఈ చికిత్స విధానం ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు.

27న రాష్ట్రానికి రాహుల్: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 27న లేదా ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్ రానున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆయన ఇచ్చే తేదీని బట్టి భారీ ఎత్తున 'సంవిధాన్ బచావో ర్యాలీ' చేపడతామన్నారు. ఈ ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొనే అవకాశం ఉందన్నారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల చివరికల్లా పార్టీలో నాయకులందరి అభిప్రాయాలు తీసుకుని కార్యవర్గం, కమిటీల నియామకం పూర్తి చేస్తామన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారని, త్వరలో భర్తీ చేయనున్నారని తెలిపారు. ఫార్ములా ఈ రేసు, హైడ్రాలకు సంబంధించి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన ఏమన్నాడు.. ఎందుకన్నాడన్నది తెలుసుకుని స్పందిస్తామన్నారు.

గ్రామాల్లో స్థానిక సందడి

(మొదటి పేజీ తరువాయి)

దృష్టిసారించింది. గ్రామ, మండల స్థాయిలో ఎవరి రాజకీయ ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీల వారీగా ఎవరి వర్గాలను బలోపేతం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఓటర్ల వివరాలను తెలుపుతూ ఎన్నికల సంఘం తుది జాబితాను ప్రకటించింది. ఇందులో ఎవరెవరు ఉన్నారు? దీంతో కొత్తగా ఓటు హక్కు ఎంతమందికి వచ్చిందనేది ఆరా తీస్తున్నారు.



పథకాల ప్రారంభంతో..

ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులను ఈ నెల 26 నుంచి అందించాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. మూడు పథకాలు ఏకకాలంలో అమలుతో పాటు, ఇకపై గ్రామ పంచాయతీల్లో పనిచేసే వివిధ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కూడా సీఎం ఆదేశించారు. పంచాయతీల్లోని 92,351 మంది ఉద్యోగులకు ఇప్పటివరకు చెల్లింపులో ఆలస్యం జరుగుతోంది. ఇంత భారీ సంఖ్యలోని ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతం ఇవ్వాలని నిర్ణయించడం మేలు చేయనుంది. ఈ నేపథ్యంలో త్వరలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లబోతున్నదనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

అవకాశం ఎవరికి దక్కుతుందో..?

రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయి 9 నెలలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తయి 7 నెలలవుతోంది. ఈ నెల 26తో కొన్ని మున్సిపాలిటీల పాలకవర్గం గడువు కూడా ముగియనుంది. వాస్తవానికి స్థానిక సంస్థల్లో పాలకవర్గాల పదవీ కాలం ముగిసే నాటికే ఎన్నికలు జరగాలి. కానీ, 2023 ఆఖర్లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం, ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు కూడా రావడంతో వాటి ప్రభావం స్థానిక సంస్థలపై పడింది. తాము అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఇందుకోసం ప్రభుత్వం కుల గణనకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కుల గణన తుది దశకు చేరుకోగా.. సేకరించిన సమాచారాన్ని కంప్యూటరీకరిస్తున్నారు. ఈ వివరాలన్నీ తేలాక స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు నియమించిన ప్రత్యేక కమిషన్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించనుంది. అనంతరం రిజర్వేషన్ల కేటాయింపుపై నిర్ణయం వెలువడనుంది. దీంతో స్థానిక ఎన్నికల్లో ఏ సామాజిక వర్గం వారికి ఎంతమేర అవకాశాలు లభిస్తాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాజకీయ వేడి..

కాళేశ్వరం కమిషన్, విద్యుత్ కమిషన్, ఫార్ములా ఈ రేస్ కేసు, ఔటర్ రింగు రోడ్ లీజు టెండర్ విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు వంటి ప్రభుత్వ నిర్ణయాలతో ప్రస్తుతం రాజకీయం బాగా వేడెక్కింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. క్షేత్ర స్థాయిలోనూ ఇదే కాక నెలకొంది. ప్రభుత్వం అందించనున్న కొత్త పథకాలపైనా బహిరంగంగా, సోషల్ మీడియా వేదికగా విమర్శలు, ప్రతి విమర్శలు నడుస్తున్నాయి. రుణ మాఫీ అందరికీ అందలేదని.. దానిని కప్పి పుచ్చుకునేందుకు, స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల సాయం, కొత్త రేషన్ కార్డులంటూ ఎర వేస్తున్నారంటూ గ్రామాల్లోని పార్టీల శ్రేణుల మధ్య మాటల మంటలు రాజుకుంటున్నాయి. ఈ క్రమంలోనే అన్ని పార్టీలు క్షేత్ర స్థాయిలో బలగాన్ని పెంచుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాయి.


భార్గవికి 30 వేల చెక్కును బహుమతిగా అందజేస్తున్న ఏపీ హోం మంత్రి అనిత

తమిళనాడు మహిళ భార్గవికి ప్రథమ బహుమతి

- కడప, తూర్పు, పశ్చిమగోదావరి మహిళలకు ద్వితీయ స్థానం
- విజయవాడలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

విజయవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి తెలుగు లోగిళ్లలో వాకిళ్ల ముందు తీర్చిదిద్దే ముగ్గులు మహిళల్లోని నైపుణ్యాన్ని, సమర్థతను ప్రతిబింబిస్తాయని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) రాష్ట్రస్థాయి ఫైనల్స్ శనివారం జరిగాయి. విజయవాడలో నారా చంద్రబాబునాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మహిళలు హాజరయ్యారు. కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పోటీలను ప్రారంభించారు. బహుమతి ప్రదానోత్సవానికి హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని తమిళనాడుకు చెందిన కె.భార్గవి గెలుచుకున్నారు. ఆమెకు రూ.30 వేల చెక్కును హోం మంత్రి అనిత అందజేశారు. ద్వితీయ బహుమతిని కడప జిల్లాకు చెందిన పి.రమ్య, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వేణుభార్గవి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.సావిత్రి గెలుచుకున్నారు. విజేతల్లో రమ్యకు అబ్బూరి రత్నలక్ష్మి, వేణుభార్గవికి సూరపనేని ఉషారాణి, సావిత్రికి గద్దె అనురాధ రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్ మాట్లాడుతూ.. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి 18 ఏళ్లుగా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 80 కేంద్రాల్లో పోటీలు నిర్వహించగా 1,798 మంది పాల్గొన్నారని తెలిపారు.

భువనగిరిలో బీఆర్‌ఎస్ ఆఫీసుపై

కాంగ్రెస్ శ్రేణుల దాడి


యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్


దాడికి నిరసన వ్యక్తంచేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

- రేవంత్‌పై బీఆర్‌ఎస్ నేత కంచర్ల దుర్భాషలతో ఆగ్రహం
- ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

భువనగిరి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి రామకృష్ణారెడ్డి శనివారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎంను దూషిస్తూ 'రండ.. రండ' అంటూ పలుమార్లు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇవి తీవ్ర దుమారాన్ని లేపాయి. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ శ్రేణులు ఈ దాడులకు దిగాయి. బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగ ప్రవీణ్, వస్తువుల సాయి, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు మద్దం వాసుదేవరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుర్వంగ చందు తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ పైళ్ల శేఖర్‌రెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ కె సురేష్‌కుమార్ తెలిపారు. కాగా, దాడిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. నిరసన ర్యాలీ నిర్వహించి రహదారిపై బైఠాయించి, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ రాజ్యమంటూ గుండాయిజమా?: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి తెలంగాణలో గుండారాజ్యం చెలాయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలు, కార్యకర్తల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ నాయకులు వేసిన ప్రశ్నలకు జవాబు చెప్పలేని కాంగ్రెస్ నాయకత్వం దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ మాటలతో దాడులు చేస్తుంటే.. ఆ పార్టీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ట్విటర్‌లో ప్రశ్నించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఎమ్మెల్సీ కవిత ఖండించారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే ద్వేషం, హింస, విధ్వంసం ఉందన్నారు.

స్ట్రెచర్ లేక.. సిబ్బంది రాక.. భార్యను భుజాలపై మోసుకెళ్లిన భర్త

- వైద్యం కోసం 10 గంటలు పడిగాపులు
- పనిచేయని సీటీ స్కానింగ్ యంత్రం
- నిజామాబాద్ జిల్లా ఆస్పత్రిలో అవస్థలు
- సూపరింటెండెంట్ జన్మదిన వేడుకల ఏర్పాట్లలో సిబ్బంది తలమునకలు!



సుభాష్‌నగర్ (నిజామాబాద్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం రోగులను ఇబ్బందుల పాల్జేస్తోంది. సిబ్బంది, స్ట్రెచర్ లేకపోవడంతో ఫిట్స్‌తో బాధపడుతున్న మహిళను ఆస్పత్రి ప్రధాన ద్వారం నుంచి లిఫ్ట్ వరకు ఆమె భర్త భుజాలపై మోసుకుంటూ తీసుకెళ్లాల్సి వచ్చింది. అంతేకాదు.. ఆస్పత్రిలో వైద్యం కోసం పది గంటలపాటు నిరీక్షించారు. జిల్లాలోని రెంజల్ మండలం కళ్యాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ ఫిట్స్‌తో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు భర్త బిద్యానాయక్‌తో కలిసి ఆసుపత్రికి వచ్చింది. డ్యూటీ డాక్టర్లు ప్రాథమిక వైద్యమైనా చేయకుండా మొదటగా సీటీ స్కాన్ చేయించుకుని రావాలని సూచించారు. దీంతో ఆమె భర్తతో కలిసి సీటీ స్కానింగ్ విభాగం వద్దకు వెళ్లింది. అక్కడ 2 గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత సిబ్బంది సీటీ స్కానింగ్ యంత్రం పనిచేయడం లేదని, బయట సీటీ స్కానింగ్ చేయించుకోవాలని చెప్పారు. లక్ష్మి దంపతుల వద్ద డబ్బులు లేకపోవడంతో మళ్లీ వైద్యుడి దగ్గరకు వెళ్లి చెప్పారు. సీటీ స్కానింగ్ తప్పనిసరి అనడంతో రాత్రి 11 గంటల వరకు ఆసుపత్రి ఆవరణలోనే కూర్చున్నారు. అప్పటికీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో బిద్యానాయక్ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను ఫోన్‌లో సంప్రదించాడు. ఎమ్మెల్యే తన పీఏ గణపతిని వెంటనే ఆస్పత్రికి పంపించి వైద్య సిబ్బందితో మాట్లాడి చికిత్స అందేలా చూశారు. కాగా, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై లక్ష్మి, బిద్యానాయక్ బంధువులు ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. కాగా, శనివారం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ జన్మదిన వేడుకలు వివాదాస్పదమయ్యాయి. ఆస్పత్రి సిబ్బంది రోగులను పట్టించుకోకుండా పుట్టినరోజు వేడుకల ఏర్పాట్లలో తలమునకలవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయమై ప్రతిమారాజ్ స్పందిస్తూ ఆస్పత్రిలో సిబ్బంది ప్రతి ఏటా తన జన్మదిన వేడుకలు నిర్వహించడం సాధారణమని పేర్కొన్నారు. దీనిపై గిట్టనివారు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

భయ భక్తులు ఉన్నాయా?

తిరుపతిలో రెండు రోజుల క్రితం జరిగింది ఏమిటి? ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఒక పోలీసు అధికారి సదుద్దేశంతో అయినప్పటికీ అనాలోచితంగా గేట్లు తెరవడంతో... వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్ల కోసం భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందారు. కుంభమేళాలు, పుష్కరాల సందర్భంగా తొక్కిసలాటలు జరిగి పలువురు మరణించిన సంఘటనలను గతంలో కూడా చూశాం. కాకపోతే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆరుగురు చనిపోవడం తిరుమల–తిరుపతి చరిత్రలో ఇదే ప్రథమం! దీంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హుటాహుటిన తిరుపతి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఇంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. తొక్కిసలాట సంఘటన తర్వాత జరిగిన సన్నివేశాలు మాత్రం జుగుప్సాకరంగా ఉన్నాయి. కొండ మీద ఏం జరుగుతోంది? అన్న సందేహాలు తలెత్తాయి. ఈ సందర్భంగా రాజకీయాలు, వ్యక్తుల మధ్య వైషమ్యాలు బయటపడటం శోచనీయం. తిరుమలలో ఆ దేవదేవుడికి సేవ చేసుకొనే అవకాశం లభించడాన్ని మహా భాగ్యంగా పరిగణించాలి. అయితే, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని భావించాల్సిన సన్నివేశాలు చోటుచేసుకోవడమే అసలైన విషాదం. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే తిరుమల తిరుపతి పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామలరావు గొడవపడ్డారు. బాధ్యతాయుతమైన స్థానాలలో ఉన్న వారి మధ్య భేషజాలు ఏర్పడి భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయమై సమన్వయం కొరవడినట్టు స్పష్టమవుతోంది. కీలక పదవులలో ఉన్న వారి మధ్య ఆధిపత్య పోరు జరుగుతుండటం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

ఒక సంఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రబలితే దాని ప్రభావం పాలనా యంత్రాంగంపై ఉంటుంది. ఎవరి ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలన్న సందేహం అధికారుల్లో ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని కొంతమంది అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంటుంది. సంకీర్ణ ధర్మానికి అందరూ కట్టుబడి ఉంటే ఏ గొడవా ఉండదు. పవన్ కల్యాణ్ జనసేన అధినేత కనుక ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విధేయుడిగా ఉండాలని భావించలేని పరిస్థితి. ప్రస్తుతం తలెత్తిన ఈ సున్నితమైన సమస్య మున్ముందు కూటమి సఖ్యతపై ప్రభావం చూపకూడదనుకుంటే... ప్రస్తుత దశలోనే పరిష్కారం కనుగొనాలి.

భయం లేదా...

సాక్షాత్తూ ముఖ్యమంత్రి సమక్షంలోనే గొడవపడటానికి చైర్మన్‌కూ, ఈవోకూ ఎంత ధైర్యం ఉండాలి? జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు ఎదురుగా కూర్చోవడానికి కూడా అధికారులు జంకేవారు. తొలిసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన జగన్ వద్దనే అంతగా భయభక్తులు ప్రదర్శించిన అధికారులు పద్నాలుగేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు వద్ద ఎలా మెలగాలి? అలాంటిది ముఖ్యమంత్రి అంటే లెక్కలేనట్టుగా వ్యవహరించడమేమిటి? తిరుమలలో ఉన్నత స్థాయిలో సమన్వయం కొరవడిందని, వైషమ్యాలు పరాకాష్ఠకు చేరాయన్న విషయం ప్రభుత్వానికి ముందుగా తెలియదా? టీటీడీ ఈవో పదవి చేపట్టాలని ఐఏఎస్ అధికారులు పోటీపడుతుంటారు. పాలక మండలి చైర్మన్ పదవికి ఎంత గిరాకీ ఉంటుందో అందరికీ తెలిసిందే. ఈ పదవులకు ఎందుకంత డిమాండ్? దేవుడిపై భక్తితోనా? లేక.. శ్రీవేంకటేశ్వరుడి దర్శనానికి వచ్చే ప్రముఖులతో పరిచయాలు పెంచుకొని తద్వారా తమ పలుకుబడి పెంచుకోవడానికా? అన్నది ఇక్కడ కీలకం. నిజానికి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు మాత్రమే దేవుడిపై భక్తి ఉంటుంది. ఆ దేవుడి పుణ్యమా అని కొండమీద కొలువులు దక్కించుకున్న వారిలో కొందరికి దేవుడిపై అంతగా భక్తి ఉన్న దాఖలాలు లేవు. నిజంగా దేవుడిపై భక్తి ఉన్నా, పాప పుణ్యాలపై నమ్మకం ఉన్నా కొండ మీద చేతి వాటాలు జరగవు కదా? దేవుడిపై నమ్మకంతో భక్తులు సమర్పించే కానుకలపై ఆధారపడి జీతభత్యాలు పొందుతున్న వారిలో ఎంత మందిలో నిజమైన భక్తి ఉంది? అంటే చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల పోస్టులకు కూడా డిమాండ్ పెరిగింది. పాలక మండలి సభ్యుడి పోస్టు కోసం రూ.10 నుంచి 20 కోట్లు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడని వారు ఉన్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి? దేవుడిపై నిజమైన భక్తితో కొందరు ఆ పోస్టును ఆశిస్తుండగా, అత్యధికులు మాత్రం దీన్ని ఒక స్టేటస్ సింబల్‌గా పరిగణిస్తున్నారు. సొంత పలుకుబడి పెంచుకోవడానికి దాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలోనే చైర్మన్, ఈవో, జాయింట్ ఈవో పోస్టులకు భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతుంది. కేవలం ఆ దేవ దేవుడి మీద భక్తితో మాత్రమే అయితే ఆధిపత్య పోరుకు దిగకూడదు కదా? దేవుడి సేవలో తరించాలి కదా! భగవంతుడి సన్నిధిలో పెత్తనం చేయాలను కోవడం ఏమిటి? తామే పెత్తనం చేయాలన్న పట్టుదలలు పెరగడం వల్లనే అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆ దేవుడే లేకపోతే చైర్మన్, ఈవో పోస్టులు ఎక్కడివి అన్న స్పృహ ఉండాలి కదా!


పెద్ద గుళ్లకే డిమాండ్...

ప్రజలలో భక్తి పెరగడం వల్ల తిరుమలలోనే కాదు అన్ని దేవాలయాల వద్దా రద్దీ ఏర్పడుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ పదవుల పోటీ కూడా పెరుగుతోంది. భక్తుల ఆదరణ కొరవడి ధూప దీప నైవేద్యాలకు దిక్కులేని గుళ్లు ఎన్నో ఉన్నాయి. వాటి పదవులకోసం ఎవరూ ఎందుకు పోటీ పడరు? దేవుడిపై నిజంగా భక్తి ఉంటే ఆ గుళ్లను అభివృద్ధి చేయడానికి పోటీ పడవచ్చుకదా! 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది... డ్రైనేజీ స్కీము లేక డేంజరుగా మారుతోంది' అని కవి గజ్జెల మల్లారెడ్డి ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు భక్తిరసం వరదలై పారుతోంది. కారణాలు ఏవైనా ప్రజల్లో భక్తి భావం పెరుగుతుండటం వల్ల ప్రవచనకారుల సంఖ్య కూడా పెరుగుతోంది. డొక్కశుద్ధి, వాక్‌శుద్ధి లేని వారు కూడా ఒళ్లంతా బొట్లు పెట్టుకొని ప్రజల్లో మూఢ భక్తిని ప్రేరేపిస్తున్నారు. ఫలానా నూనెతో దీపం వెలిగించాలి.. అప్పుడే ఇష్టవాంఛ నెరవేరుతుందని చెబుతున్నారు. ఫలానా విధంగా పూజలు చేయాలని ఏ శాస్త్రంలో రాశారు? చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద అన్నట్టుగా పరిస్థితి తయారైంది. పవిత్ర మనసుతో దేవుడికి మనసులో దండం పెట్టుకుంటే ఆ దేవుడు కనికరించడా? భక్తి అనేది ఇప్పుడు ప్రధాన వ్యాపారంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలోనే ప్రవచనకారుల మధ్య కూడా వైషమ్యాలు ఏర్పడుతున్నాయి. అపారమైన విద్వత్ కలిగిన గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితం గురించి జరిగిన ప్రచారం కూడా ఈ కోవలోకే వస్తుంది. అహాన్ని వదులుకోలేని వారికి భక్తులకు బోధించే అర్హత ఉంటుందా? అసూయను వళ్లంతా నింపుకొని ఎన్ని సుద్దులు చెబితే మాత్రం ఏమి ప్రయోజనం? ధర్మ నిష్ఠ లేనప్పుడు ఎంత భక్తిని ప్రదర్శించినా ఏమిటి ప్రయోజనం? ప్రజల్లో స్వార్థ కాంక్షను తగ్గించలేని ప్రవచనాల వల్ల ఎవరికి ప్రయోజనం? ఇప్పుడు అసలు విషయానికి వద్దాం!

మరణ రాజకీయం...

తిరుపతిలో జరిగిన విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలు కూడా పూర్తి కాకముందే రాజకీయాలు రంగ ప్రవేశం చేశాయి. విషాదానికి బాధ్యత మీదంటే మీదంటూ పాలక మండలి – అధికారుల మధ్య వివాదం మొదలైంది. సందట్లో సడేమియా అన్నట్టుగా జగన్‌రెడ్డితో పాటు ఆయన రోత మీడియా యథావిధిగా విషప్రచారం మొదలుపెట్టింది. చనిపోయినవారు చనిపోగా మిగతా భక్తులు ప్రశాంతంగా వైకుంఠ ఏకాదశి రోజున ఆ దేవదేవుడి దర్శనం చేసుకొని తరించారు. కానీ.. ఆధిపత్య పోరు మాత్రం తగ్గలేదు. జరిగిన విషాదానికి నైతిక బాధ్యత తీసుకొని భక్తులకు క్షమాపణలు చెప్పడంలో కూడా వివాదమేనా? ముఖ్యమంత్రి సమక్షంలోనే గొడవపడిన చైర్మన్, ఈవో అంతటితో తగ్గలేదు. శుక్రవారం నాడు జరిగిన పాలక మండలి అత్యవసర సమావేశంలో కూడా విభేదాలు బయటపడ్డాయి. దీనికితోడు తొక్కిసలాటలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్న మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యానించడంతో దాని ప్రభావం కూటమి ప్రభుత్వంపై పడింది. ఎవరో ఏదో అన్నారని క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా చైర్మన్ వ్యాఖ్యానించడంతో జనసైనికులు నొచ్చుకున్నారు. నిజానికి పవన్ కల్యాణ్ చేసిన సూచనలో తప్పు లేదు. జరిగిన దానికి నైతిక బాధ్యత వహిస్తూ క్షమాపణలు చెప్పడం హుందాగానే ఉంటుంది. కారణం తెలియదుగానీ, చైర్మన్ తొలుత క్షమాపణలు చెప్పడానికి నిరాకరించి.. తర్వాత సర్దుకున్నారు. తిరుమలలో చైర్మన్, ఈవో, అదనపు ఈవోల మధ్య సఖ్యత కొరవడిన విషయం ప్రభుత్వానికీ తెలుసు. సంఘటన జరిగిన రోజు తిరుపతి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆద్యంతం సీరియస్‌గానే ఉన్నారు. బాధితులను పరామర్శించిన తర్వాత సమీక్ష సందర్భంగా పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి 'మీ మధ్య మాటలు కూడా ఉండనట్టుగా ఉంది' అని చైర్మన్, ఈవోను ఉద్దేశించి అన్నారు. ఆ తర్వాత కూడా వారిరువురూ తన సమక్షంలోనే వాదులాడుకోవడంతో ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొచ్చింది. పరిస్థితిని చక్కదిద్దకపోతే టీటీడీ ప్రతిష్ఠ దెబ్బ తింటుందని చంద్రబాబు అభిప్రాయపడినట్టు తెలిసింది. తన మంచితనాన్ని అలుసుగా తీసుకుంటున్నారని ఆయన మంత్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పాలక మండలికి, అధికారులకు మధ్య వివాదాలు ఏర్పడటం కొత్త కాదు. అయితే ఇప్పుడు పరిస్థితి చేయిదాటి పోయింది. పాలనా వ్యవహారాలన్నింటినీ చైర్మన్ కార్యాలయం ఆధ్వర్యంలోకి తీసుకోబోతున్నట్టు బీఆర్ నాయుడు ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. దర్శనాలకు సంబంధించిన సిఫారసుల విషయంలోనే అధికారులతో పాలక మండలి సభ్యులకు గొడవలు వస్తుంటాయి. లెక్కకు మించి సిఫారసులు చేయడంపై అధికారులు అభ్యంతరం చెబుతున్నారు. దీంతో కొంత మంది పాలక మండలి సభ్యులు, ముఖ్యంగా ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితోపాటు బీజేపీకి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి ప్రభృతులు చైర్మన్ నాయుడును ప్రభావితం చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నాటి సమావేశంలో భానుప్రకాశ్ రెడ్డి కల్పించుకొని 'ఏమిటి.. తమాషాలు చేస్తున్నారా?' అని ఈవో శ్యామలరావును ఉద్దేశించి పరుషంగా వ్యాఖ్యానించారు. పాలక మండలి సభ్యుల సిఫారసు లేఖలలో కొన్నింటిని అధికారులు తిరస్కరించడం కొత్త కాదు. గతంలో కూడా జరిగింది. ధర్మారెడ్డి ఈవోగా ఉన్నప్పుడు అధికారాలు అన్నీ ఆయన వద్దే కేంద్రీకృతమై ఉన్నప్పటికీ ఎవరూ కిమ్మనలేదు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. పాలక మండలిలో కూడా తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన సభ్యులు ఉన్నారు. ఈ కారణంగా వారు అవసరానికి, పరిమితికి మించి స్వేచ్ఛను తీసుకుంటున్నారు. ఇతర పార్టీల సభ్యులపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా అదుపు ఉండటం లేదు. అధికారులకు కూడా దిక్కుతోచడం లేదు. నిర్ణయాలన్నీ తమకు చెప్పిన తర్వాత మాత్రమే తీసుకోవాలని అధికారులపైన పాలక మండలి ఒత్తిడి తెస్తోంది. సీనియర్ అధికారులమైన తమపై సభ్యుల పెత్తనం పెరిగిపోవడం ఏమిటి? అని అధికారులు గుర్రుగా ఉంటున్నారు. దీంతో అధికారులకు, పాలక మండలికి మధ్య సమన్వయం కొరవడింది. నిజానికి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఈవో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. అయినా తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా యంత్రాంగంతో జరిపిన సమావేశాల గురించి తనకు మాట మాత్రమైనా చెప్పలేదని చైర్మన్ నాయుడు ఆగ్రహంగా ఉన్నారు. టీటీడీ చట్టం ప్రకారం పాలక మండలికి విశేష అధికారాలు ఉన్నాయి. అయితే, ఇప్పటి వరకు పాలక మండలి అనేది విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం వరకే పరిమితం అయింది. ఈ కారణంగానే ఈవోలుగా నియమితులైన సీనియర్ అధికారులు తమ విధులను సజావుగా నిర్వహించగలిగారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫలితమే తాజా వివాదాలు. జరిగిన దానికి అధికారులు బాధ్యత తీసుకోవాలా? పాలక మండలి తీసుకోవాలా? అన్న వివాదం కొత్తగా తలెత్తింది. చట్టంలోని ఒక నిర్దుష్టమైన సెక్షన్ ప్రకారం పాలక మండలికి సర్వాధికారాలు ఉన్నందున ఈవోలుగా సీనియర్ అధికారులను నియమించడం అనవసరం. ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తే సరిపోతుంది. అయితే దీనివల్ల పాలక మండలి సభ్యుల పెత్తనం పెరిగిపోయి దేవస్థానం పాలనా వ్యవహారాలు అదుపు తప్పే ప్రమాదం ఉంది.

కొండ మీద ఆధిపత్య పోరువల్ల సామాన్య భక్తులు బలి కాకూడదు. పదవులలో ఉన్న వారికి దేవుడిపై నిజంగా భక్తి ఉంటే భేషజాలను వెంటనే వదులుకోవాలి. ఆ దేవుడే లేకపోతే మనమూ లేము– మన పదవులూ లేవన్న వాస్తవాన్ని గుర్తించి మెలుగుతారని ఆశిద్దాం!


akbar

నిజానికి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఈవో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. అయినా తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా యంత్రాంగంతో జరిపిన సమావేశాల గురించి తనకు మాట మాత్రమైనా చెప్పలేదని చైర్మన్ నాయుడు ఆగ్రహంగా ఉన్నారు. టీటీడీ చట్టం ప్రకారం పాలక మండలికి విశేష అధికారాలు ఉన్నాయి. అయితే, ఇప్పటి వరకు పాలక మండలి అనేది విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం వరకే పరిమితం అయింది. ఈ కారణంగానే ఈవోలుగా నియమితులైన సీనియర్ అధికారులు తమ విధులను సజావుగా నిర్వహించగలిగారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫలితమే తాజా వివాదాలు. జరిగిన దానికి అధికారులు బాధ్యత తీసుకోవాలా? పాలక మండలి తీసుకోవాలా? అన్న వివాదం కొత్తగా తలెత్తింది. చట్టంలోని ఒక నిర్దుష్టమైన సెక్షన్ ప్రకారం పాలక మండలికి సర్వాధికారాలు ఉన్నందున ఈవోలుగా సీనియర్ అధికారులను నియమించడం అనవసరం. ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తే సరిపోతుంది. అయితే దీనివల్ల పాలక మండలి సభ్యుల పెత్తనం పెరిగిపోయి దేవస్థానం పాలనా వ్యవహారాలు అదుపు తప్పే ప్రమాదం ఉంది.

అదీ మోదీ పవర్...

కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది. అయినా అక్కడ ప్రధాని నరేంద్ర మోదీ అధికారానికి తిరుగులేదు. భాగస్వామ్య పక్షాలన్నీ తమ పరిమితులను తెలుసుకొని నరేంద్ర మోదీ నాయకత్వంలో పనిచేస్తున్నాయి. ప్రధానమంత్రికి పోటీగా ఇతర భాగస్వామ్య పక్ష నాయకులు ప్రకటనలు చేసేందుకు సాహసించడం లేదు. ప్రధాని మోదీ ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ బలంపైన ఆధారపడి మనుగడ సాగిస్తోంది. అయినా చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే ప్రయత్నం చేయడం లేదు. ప్రధాని అధికారాలను ప్రశ్నించే సాహసం చేయడం లేదు. రాష్ట్రంలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. జనసేన, బీజేపీ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయి. తిరుపతిలో తొక్కిసలాట జరిగిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధితులను పరామర్శించడానికి విడిగా వెళ్లారు. ఒకరకంగా ఇందులో తప్పుపట్టాల్సింది ఏమీ లేదు. జనసేన పార్టీకి పవన్ కల్యాణ్ అధినేత కూడా. తన పార్టీ తరఫున స్వతంత్రంగా వ్యవహరించే స్వేచ్ఛ ఆయనకు ఉంటుంది. అయితే ప్రభుత్వానికి సంబంధించిన విషయాలలో విధాన నిర్ణయాలు తీసుకొనే అధికారం ముఖ్యమంత్రికి మాత్రమే ఉంటుంది. ముఖ్యమంత్రికి పోటీగా ఉప ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తే దాని ప్రభావం వేరుగా ఉంటుంది. ఉప ముఖ్యమంత్రి అనేది రాజ్యాంగబద్ధమైన పదవి కాదు. సాంకేతికంగా చూస్తే పవన్ కల్యాణ్ ఇతర మంత్రులతోపాటు మరో మంత్రి మాత్రమే. ఆయన మంత్రిగానే ప్రమాణ స్వీకారం చేశారు. తను స్వతంత్రంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరుకోవడం ఆయన కోణంలో సరైనదే కావచ్చు. ప్రభుత్వపరంగా చూస్తే అది వాంఛనీయమా అన్న సందేహం కలుగుతుంది. ఒక సంఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రబలితే దాని ప్రభావం పాలనా యంత్రాంగంపై ఉంటుంది. ఎవరి ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలన్న సందేహం అధికారుల్లో ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని కొంతమంది అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంటుంది. ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రుల వలె పవన్ కల్యాణ్ కూడా తిరుపతి పర్యటనకు వెళ్లి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. విలేకరుల సమావేశంలో కూడా ఇరువురూ సమష్టిగా తమ అభిప్రాయాలను పంచుకోవచ్చు. అలా కాకుండా విడివిడిగా ప్రకటనలు చేయడం వల్ల ప్రభుత్వంలో సమన్వయం కొరవడుతుంది. సంకీర్ణ ధర్మానికి అందరూ కట్టుబడి ఉంటే ఏ గొడవా ఉండదు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సోషల్ ఇంజనీరింగ్ పేరిట ఐదుగురిని ఉప ముఖ్యమంత్రులుగా నియమించుకున్నారు. అయితే, వారెప్పుడూ తాము మిగతా మంత్రుల కన్నా అధికులమని చెప్పుకొనే పనిచేయలేదు. పవన్ కల్యాణ్ జనసేన అధినేత కనుక ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విధేయుడిగా ఉండాలని భావించలేని పరిస్థితి. ప్రస్తుతం తలెత్తిన ఈ సున్నితమైన సమస్య మున్ముందు కూటమి సఖ్యతపై ప్రభావం చూపకూడదనుకుంటే... ప్రస్తుత దశలోనే పరిష్కారం కనుగొనాలి.

ఎవరు బాధ్యులు?

మృతుల కుటుంబాలకు పాలక మండలి క్షమాపణలు చెప్పాలని పవన్ కల్యాణ్ కోరడం ముమ్మాటికీ సమర్థనీయమే. కింది స్థాయి అధికారులు చేసే తప్పిదాలకు ప్రభుత్వ పెద్దలు బాధ్యత తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే, ఒక డీఎస్పీ స్థాయి అధికారి అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల ఆరు నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయినందున పాలక మండలి నైతిక బాధ్యత తీసుకోవడంలో తప్పు లేదు. నామోషీ అంతకన్నా లేదు. అయితే పవన్ కల్యాణ్ ఈ ప్రకటనను ముఖ్యమంత్రి సమక్షంలో చేసి ఉంటే బాగుండేది. విషయాలు స్వల్పమే అయినప్పటికీ అవి భవిష్యత్తులో ముదిరే ప్రమాదం ఉంటుంది. కూటమిలో చిచ్చు పెట్టడానికి జగన్ అండ్ కో కాచుకొని ఉన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారిలో విశ్వాసం ఏర్పడాలన్నా కూటమిలో ఐక్యత ఉంది–ఉంటుంది అన్న నమ్మకం కూడా కలిగించాలి. తెలుగుదేశం–జనసేన–బీజేపీ మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తితే దాని ప్రభావం ఆ పార్టీలపైనే కాదు– రాష్ట్రంపైనా పడుతుంది. కూటమి విచ్ఛిన్నమైతే 2029లో పరిస్థితి ఏమిటి? అన్న సందేహం పెట్టుబడిదారుల్లో కలగకుండా ఎందుకు ఉంటుంది? ఇప్పటికే జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రారు అన్న భరోసా ఇవ్వగలరా? అని పెట్టుబడులు పెట్టేవారు అడుగుతున్నారని మంత్రి లోకేశ్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం–జనసేన మధ్య, ముఖ్యంగా చంద్రబాబు–పవన్ కల్యాణ్ మధ్య మరింత సమన్వయం అవసరం. అదే సమయంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న తిరుమల కొండపై పరిస్థితిని గాడిలో పెట్టడానికి చంద్రబాబు–పవన్ కల్యాణ్ ఉమ్మడిగా యోచన చేయాలి. ముఖ్యమంత్రి అంటే లెక్కలేకుండా తన సమక్షంలోనే గొడవపడిన చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావును చంద్రబాబు ఆరోజే మందలించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. వైకుంఠ ఏకాదశి రద్దీ ఉన్నందున భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించకుండా బోర్డు ప్రత్యేక సమావేశం నిర్వహించడం సమంజసం కాదన్న ఈవో అభిప్రాయాన్ని బోర్డు సభ్యులు లెక్కచేయలేదు. ఈ సమస్యకు వీలైనంత త్వరగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కారం కనుగొనాలి. లేనిపక్షంలో తిరుమల ప్రతిష్ఠ మంటకలవడమే కాకుండా దాని ప్రభావం చంద్రబాబు ప్రభుత్వ పనితీరుపై కూడా పడుతుంది. కొండ మీద ఆధిపత్య పోరు వల్ల సామాన్య భక్తులు బలి కాకూడదు. పదవులలో ఉన్న వారికి దేవుడిపై నిజంగా భక్తి ఉంటే భేషజాలను వెంటనే వదులుకోవాలి. ఆ దేవుడే లేకపోతే మనమూ లేము– మన పదవులూ లేవన్న వాస్తవాన్ని గుర్తించి మెలుగుతారని ఆశిద్దాం! తిరుమల చరిత్రలో మొదటిసారిగా జరిగిన ఈ దురదృష్టకర సంఘటన చివరిది కావాలని కోరుకుందాం!

ప్రజలలో భక్తి పెరగడం వల్ల తిరుమలలోనే కాదు అన్ని దేవాలయాల వద్దా రద్దీ ఏర్పడుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ పదవుల పోటీ కూడా పెరుగుతోంది. భక్తుల ఆదరణ కొరవడి ధూప దీప నైవేద్యాలకు దిక్కులేని గుళ్లు ఎన్నో ఉన్నాయి. వాటి పదవులకోసం ఎవరూ ఎందుకు పోటీ పడరు? దేవుడిపై నిజంగా భక్తి ఉంటే ఆ గుళ్లను అభివృద్ధి చేయడానికి పోటీ పడవచ్చుకదా! 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది... డ్రైనేజీ స్కీము లేక డేంజరుగా మారుతోంది' అని కవి గజ్జెల మల్లారెడ్డి ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు భక్తిరసం వరదలై పారుతోంది. ఫలానా నూనెతో దీపం వెలిగించాలి.. అప్పుడే ఇష్టవాంఛ నెరవేరుతుందని చెబుతున్నారు. ఫలానా విధంగా పూజలు చేయాలని ఏ శాస్త్రంలో రాశారు? చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద అన్నట్టుగా పరిస్థితి తయారైంది. పవిత్ర మనసుతో దేవుడికి మనసులో దండం పెట్టుకుంటే ఆ దేవుడు కనికరించడా?

శ్రమ జీవన సౌందర్యోత్సవం

శ్రమ ఫలించి గాదెలు, గరిసెలు నిండిన రోజు సంక్రాంతి. ఇది పంటల పండుగ. అందరి జీవితాలలో ఆనందోత్సాహాలను నింపడమే కాక, కొత్త వెలుగుల్ని ఇవ్వమని ప్రకృతిని వేడుకునే పండుగ.



శ్రమైక జీవన సౌందర్యానికి అద్దంపట్టే పండుగ సంక్రాంతి. పంటలు చేతికొచ్చేటప్పుడు జరుపుకునే వేడుక సంక్రాంతి.

ఉన్నత సంప్రదాయల్లో, ఆచార వ్యవహారాల్లో ప్రతి పండుగ వెనుక ఒక చారిత్రక కారణం ఉంది. ఓపిగ్గా పరిశీలిస్తే.. పండుగల వెనుక జాతి చరిత్ర, శ్రమ మూలాలు కనిపిస్తాయి. వాతావరణం, జీవావరణం, పర్యావరణం, భావ చైతన్య మహా సమ్మేళనమే మన పండుగలు అని అనిపిస్తుంది.

పల్లె అందాలతో సరదాగా గడపాలి అంటే సంక్రాంతే సరైన సమయం. అలుకు చల్లిన వాకిళ్లు, నేల నలుచెరుగులా పరుచుకున్న ముగ్గులు, గొబ్బెమ్మలతో నిండిన వీథులు ఉంటాయి. ఆ ముగ్గులను చూసినప్పుడు నింగిలోని చుక్కలు దిగివచ్చి ముగ్గులై మురిశాయా.. హరివిల్లులోని వర్ణాలన్నీ ఆ ముగ్గుల్లో.. కొత్త అందాలు పరిచాయా అన్నట్టుగా.. ఆ రంగవల్లులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. మధ్యలో గొబ్బెమ్మలు, రేగుపళ్లు, చెరుకు గడలతో ముగ్గులు మరింత సింగారించుకుని సంక్రాంతికి ఆహ్వానం పలుకుతాయి.

రంగురంగుల బట్టలు, గంటలు, గజ్జెలతో అలంకరించిన గంగిరెద్దులు, ధాన్యం నిండిన గరిసెలు, నువ్వుల బెల్లంతో చేసిన అరిసెలు, తీరొక్క దినుసులు, పసుపు కుంకుమ, పచ్చటి వాతావరణంలో నువ్వులు తిని నూరేండ్లు బతుకు.. చక్కెర తిని తీయగా మాట్లాడు అంటూ పంచిపెడతారు. సకినాలు, సర్వపిండి, సజ్జ రొట్టెలు, ఆకాశాన్ని తాకే గాలిపటాలతో పిల్లల ఆనందం అంబరమవుతుంది. ఏడాదిలో తొలి పండుగ. తెలుగువారి సొంతమైన పండుగ సంక్రాంతి. సొంత ఊరులో జరుపుకునే పండుగ. ఎక్కడ వున్నా ఈ పండుగకు మాత్రం ఊరికి పోవల్సిందే. అమ్మకోసం, ఊరమ్మ కోసమూ, మట్టివాసన, మధుర స్మృతుల కోసమూ పట్టణాల నుంచి పల్లెకు పరుగెడుతారు.

సంక్రాంతి మూడు రోజుల పండుగ. మొదటినాడు భోగి. భోగం అంటే ప్రకృతికి నివేదించే నైవేద్యం. కొత్త బియ్యంతో వండిన పసుపు అన్నం సమర్పిస్తారు. రైతులు ఆ దినాన పశువులను చక్కగా కడిగి వాటి కొమ్ములకు రంగులు అద్దుతారు. ఆ మూగజీవాలను పూలదండలతోనూ అలంకరిస్తారు. ఎడ్లను గౌరవిస్తారు. వ్యవసాయ పరికరాలు, తమ బతుకులను నిలిపే పనిముట్ల పట్ల కృతజ్ఞతాభావం, అవి దైవ సమానాలనే నమ్మకం ప్రస్ఫుటంగా కనబడుతుంది.

అందరి జీవితాలలో ఆనందోత్సాహాలను అందించడమే కాక కొత్త వెలుగుల్ని ఇవ్వమని ప్రకృతిని వేడుకునే పండుగ. ఇవన్నీ శ్రమ సంస్కృతిలో భాగమైనవి. పండుగలు అన్నీ మతపరమైనవి కావు. మానవుని ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించినవి. అంటే వ్యవసాయం, పశుపోషణ వంటివి. ప్రకృతి శక్తులను వశపరచుకున్నప్పుడు మానవుడు సాధించిన విజయాన్ని పురస్కరించుకొని ఈ పండుగలు జరుగుతుంటాయి. కరువు– కాటకాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రకృతిలోని వశంకాని శక్తులు అన్నింటిని దేవుడుగా, దెయ్యాలుగా కొలిచారు. కొన్ని పండుగలు పూర్తిగా మత నమ్మకాలపై పుక్కిటి పురాణ కథలతో ఆచార సంప్రదాయాలతో ఉన్నాయి. పండుగలు, జాతర్లు, ఉత్సవాలను మూఢనమ్మకాలనే పేరుతో కొట్టేయడం సరికాదు. తెలుగు రాష్ట్రాల్లో 'సంక్రాంతి', తమిళనాడులో 'పొంగల్' కేరళలో 'ఓణం' ..ఇలా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో కళకళలాడే రోజు. బంతీ, చేమంతి పూలు, రేగుపండ్లు సమృద్ధిగా దొరికే కాలం. ఎడ్లను అలంకరించి, ఆటలు, పాటలతో కూడిన గ్రామీణ ఉత్పత్తితో ముడిబడిన వినోదాల సందర్భం. వీటిలో కూడా పెట్టుబడి ప్రవేశించింది. జూదంగా, వ్యసనంగా తాగుడు వంటి అనాచారాలు ప్రవేశించాయి. వినోదం కాస్తా విషాదమైపోయింది. పండుగల్లో ప్రజా దృక్పథం కొరవడింది. ప్రతి దాంట్లో మంచి సంస్కృతి, శ్రమ సంస్కృతిని గౌరవించాలి, ప్రోత్సహించాలి.

మనిషి ఎప్పుడూ ఒంటరిగా లేడు. సమిష్టిగా పోరాడాడు. ప్రకృతిపై విజయాలను సమిష్టిగానే పంచుకున్నారు. నిప్పుపై మానవుని విజయమే, చీకటి నుంచి వెలుగుల ప్రయాణంగా చూశారు. ప్రకృతి ముందు ఓడిపోయినప్పుడు అతీత శక్తుల వైపు, నమ్మకాల వైపు అల్లుకున్నారు. సూర్యుడు, చంద్రుడు, చెట్టు, పుట్ట, పాము దేవుడిగా కొలిచారు. మొదట మానవుడు చెట్టును పుట్టను ప్రసన్నం చేసుకోవడానికి క్రతువులు ఆచరించాడు. వ్యవసాయ సమాజంలో ఋతుచక్రాన్ని తనకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రత్యేక పూజలు చేశాడు. ధాన్యం జీవనాధారం కనుక ధాన్యలక్ష్మీ, ధనం జీవితంలో భాగమయ్యాక ధనలక్ష్మీ పేరుతో కొలిచారు. వ్రతాలు, యాగాలు, దీక్షలు చేశారు. అర్థంకాని ప్రతి సమస్య ఆధ్యాత్మికం వైపు మరలింది.

స్వార్థంతో ఒక జాతిని మరొక జాతి పీడించడం మొదలైనప్పుడే... ఆ పీడన నుండే విముక్తి కోసం పోరాటాలు జరిగాయి. జయాపజయాలు, పర్వదినాలు, దుర్దినాలుగా మారి మన సంస్కృతిలో భాగమయ్యాయి. పరాయి పీడన నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నేలకొరిగిన వీరుల జన్మదినాలు పర్వదినాలైనాయి. పరాయి పాలన నుంచి విముక్తి జరిగిన దినాలు ముఖ్యమైన జాతీయ పండుగలయ్యాయి. 'కప్పం కట్టనుపో..' అన్న ప్రతి వారికి కత్తిలాంటి జ్ఞాపకం సమ్మక్క, సారక్కలు, గిరిజన వీరుడు కొమరం భీం, కేశ్లాపురం జాతర, కేవల్ కిషన్ జాతర, పండుగ సాయన్న, అమరుల శౌర్యాన్ని జాతర రూపంలో ప్రతి ఏడాది స్మరించుకుంటారు. నృత్యం, సంగీతం, ఆట, పాటలతో సంబురపడతారు. ఇదంతా మానవుడు సమిష్టి కృషితో సంపాదించిన భౌతిక సంపద, సాంస్కృతిక వారసత్వం.

శ్రమ ఫలించి గాదెలు, గరిసెలు నిండిన రోజు సంక్రాంతి ఉత్పత్తితో ముడిబడింది. ఇది పూర్తిగా వ్యవసాయదారుల పంటల పండుగ. దేశ జనాభాలో 70 శాతం గ్రామీణ జనాభా. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ వినిమయ సంస్కృతి నుంచి కూడా పండుగలు ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రజా సంస్కృతిని వికృతపరుస్తున్నాయి. ప్రజా కళలను ప్రచార సరుకులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రగతిశీలురు, అభ్యుదయ వాదులు ఈ నీతి బాహ్య వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలి. జాతి జనులు అభివృద్ధి నిరోధక మార్గం పట్టకుండా నిత్యం కనిపెడుతూ వుండాలి.

అభివృద్ధి నిరోధక శక్తులు, మతతత్వ శక్తులు ఆయా సందర్భాల్లో ఆధిపత్యం వహించి తమ భావజాలాన్ని వ్యాపింపజేయకుండా అడ్డుకోవాలి. కార్పొరేట్ సంస్కృతి, వినిమయ సంస్కృతి వికృత మార్గం నుండి కాపాడాలి. మార్పులను అభివృద్ధికర మార్గం వైపు జరిగే విధంగా కృషి చేయాలి. ప్రజా సంస్కృతి, ప్రత్యామ్నాయ సంస్కృతికి అవసరమైన పరిస్థితులు కల్పించాలి. శ్రమకు గౌరవం దక్కాలి. శ్రమ సంస్కృతిని ప్రోత్సహించాలి. శాంతి క్రాంతుల పతంగులను విశ్వవీధిన ఎగరవేద్దాం! అదే నిజమైన సంక్రాంతి.

■ భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, రాష్ట్ర అధ్యక్షుడు



బసవన్నలే నేస్తాలు.. బతుకంతా కష్టాలు!

ఆదరణ కరువై.. బాగుపడని గంగిరెద్దుల వారి జీవితాలు

సంక్రాంతి వేళ కానరాని సందడి..

- ప్రభుత్వాలు మారుతున్నా అందని చేయూత
- సంచార జీవితంతో బతుకులు అగమ్యగోచరం
- ఉండేందుకు ఇళ్లు లేని దీన స్థితిలో కుటుంబాలు

7

గంగిరెద్దుతో విన్యాసాలు చేస్తున్న కళాకారులు (ఫైల్)

సంక్రాంతి వచ్చిందంటే ఒకప్పుడు.. పిండివంటల ఘుమఘుమలు.. పతంగులు, ముగ్గుల సందళ్లు.. డూడూ బసవన్నల విన్యాసాలు కనిపించేవి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా లోగిళ్లన్నీ కళకళలాడేవి. కానీ మారిన కాలమాన పరిస్థితులు.. పెరిగిన సాంకేతికతతో పండుగలు కళతప్పుతున్నాయి. సంక్రాంతి పండుగ అంటే గుర్తొచ్చే గంగిరెద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఏళ్లకేళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. గంగిరెద్దులను ఆడించే వారిని పట్టించుకునే వారు లేక.. ఆ సంచార జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారాలను వదులుకోలేక.. గంగిరెద్దుల ను ఆడించే వృత్తినే జీవనాధారంగా చేసుకుని.. కష్టాలతో సావాసం సాగిస్తూ.. గంగిరెద్దులనే ఆస్తిగా నమ్ముకొని కూటి కోసం కోటి తిప్పలు పడుతూ ఆ కుటుంబాలు బతుకు సమరం సాగిస్తున్నాయి. ఎవరు ఆదరించినా.. ఆదరించకపోయినా.. బసవన్నల ఆటతో పూట గడవకపోయినా.. నమ్ముకున్న వృత్తిని వదిలేది లేదంటున్నాయి.

- రఘునాథపల్లి, ఆంధ్రజ్యోతి

హైదరాబాద్‌కు దీటుగా జూపార్కు అభివృద్ధి

- జంతువులను ఔత్సాహికులు దత్తత తీసుకోవాలి
- త్వరలో జూపార్కుకు సింహం, తెల్లపులి
- జూపార్కులో టైగర్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించిన మంత్రులు సురేఖ, పొన్నం



సమావేశంలో మాట్లాడుతున్న అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పక్కన పొన్నం ప్రభాకర్, నాయిని రాజేందర్‌రెడ్డి, బండా ప్రకాశ్



పులిని పరిశీలిస్తున్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ జూపార్కును హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ జూపార్కుకు దీటుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హంటర్‌రోడ్‌లోని జూపార్కుకు ఇటీవల హైదరాబాద్ జూపార్కు నుంచి తీసుకొచ్చిన రెండు పులులు, అడవి దున్న, హగ్‌డీర్, బార్కింగ్ డీర్‌లను శనివారం మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు పులులను, ఇతర జంతువులను పరిశీలించారు. అనంతరం జూపార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. జూపార్కులో రెండు పులులతో కలిపి నాలుగు రకాల జంతువులను విడుదల చేశామని అన్నారు. త్వరలోనే జూపార్కుకు సింహం, తెల్ల పులిని తీసుకొచ్చే ఆలోచన ఉందన్నారు. జంతువులను ఎవరైనా పెంచుకునే ఆలోచన ఉంటే దత్తత తీసుకుని యేడాదికి కొంత డబ్బులు జూపార్కు అధికారులకు ఇవ్వాలన్నారు. త్వరలోనే సంబంధిత అధికారులతో కలిసి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి జూపార్కు అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం స్థలం ఇచ్చి నిధులు సమకూరిస్తే జూపార్కును దేవనూరు గుట్టల వద్దకు తీసుకెళతామన్నారు. దేవనూరు గుట్టల దగ్గర చాలా స్థలం ఉందని, నిధులు ఇస్తే జూపార్కును మార్చి అభివృద్ధి చేస్తామన్నారు. జూపార్కులో సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగలకుండా చూస్తున్నామని, ప్లాస్టిక్ ఫ్రీ జూగా ఉండటానికి బట్ట సంచులు విడుదల చేశామన్నారు. జూపార్కును మరిన్ని కొత్త హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం జంతువుల దత్తత కార్యక్రమం బ్రోచర్, జూపార్కు బ్రోచర్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు జిల్లా అటవీ శాఖ అధికారి పులి ఫోటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి, ఇతర ప్రజాప్రతినిదులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

జయహో యువత

సామాజిక బాధ్యతగా పలు అంశాల్లో సేవలు

- స్వచ్ఛంద కార్యక్రమాల్లో 'నెహ్రూ యువ కేంద్రం'
- యువత భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు
- యువతకు చేయూత 'మై భారత్'
- పోర్టల్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 60వేల మందికిపైగా పేర్లు నమోదు

7

నేడు జాతీయ యువజన దినోత్సవం

సెపక్‌తక్రాలో ఏఐపీ క్రీడాకారుల హవా

- పురుషులు, మహిళల డబుల్స్‌లో ప్రథమ స్థానం
- జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న చాంపియన్ షిప్ పోటీలు

6



టీం ఈవెంట్ మహిళల విభాగంలో మణిపూర్ క్రీడాకారిణి

బలి తీసుకున్న బెట్టింగ్ భూతం

- ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి యువకుడి ఆత్మహత్య
- పేకాట ఆడి రూ.30 లక్షలకు పైగా పోగొట్టుకున్న వైనం
- అప్పులు చేసి కొడుకు వేదన తీర్చిన తల్లిదండ్రులు
- మరో రూ.4లక్షలు అవసరమవడంతో ఆందోళన
- ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం
- వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘటన

6



లైశెట్టి రాజ్ కుమార్ (ఫైల్)

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్
- ఐఎంఏ హాల్‌లో వరంగల్ వైద్యాధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

పోచమ్మమైదాన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య అధికారులు తోటి ఉద్యోగులను సమన్వయం చేస్తూ పనిచేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్రనాయక్ అన్నారు. వరంగల్ ఐఎంఏ హాల్‌లో శనివారం ఆయన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నారు. సేవా కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ సిబ్బందిని ప్రోత్సహించి తగిన ఫలితాలు రాబట్టాలని సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖలో మాతాశిశు సంరక్షణ, సంక్రమిత వ్యాధులు - అసంక్రమిత వ్యాధులు, ఇమ్యూనైజేషన్, లెప్రసీని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. లెప్రసీ బాధితులకు అందించే సేవల గురించి మిగతా సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఇన్ఫర్మేషన్, ఎడ్యూకేషన్, కమ్యూనికేషన్, బిహేవియరల్ కమ్యూనికేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల్లో గుర్తింపు పొందాలని సూచించారు. గతంలో అందించిన కొవిడ్ -19 సేవలకు దీటుగా ఇప్పుడు రెట్టింపు సేవలు అందించాలన్నారు. అనంతరం ఆయనకు డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు పద్మశ్రీ, రవీందర్, విజయ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మోహన్‌సింగ్, ఫిజియోథెపిస్ట్ నర్సింహారెడ్డి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ డీపీహెచ్ఎన్‌వో జ్ఞానసుందరి, ఎస్‌వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినతి

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 17,514 మంది ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని జాతీయ ఆరోగ్యమిషన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్‌ఖన్నా కోరారు. ఈ మేరకు ఐఎంఏ హాల్‌లో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్‌లు, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల అంజి, వైకుంఠం, శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌కు మంత్రి పొంగులేటి రాక

ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ల కార్యాచరణపై సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, జనవరి11(ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ల కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయిని

హనుమకొండ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రీ సేవలు చిరస్మరణీయమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శాస్త్రీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లాల్ బహదూర్ శాస్త్రీ సేవలు స్మరించారు. ఈ కార్యక్రమంలో ఈవీ శ్రీనివాస్, మొజెస్ ఆనంద్, బంక సరళ, లక్ష్మారెడ్డి, బంక సంపత్, దీపక్‌రెడ్డి, సారంగం, రమణారెడ్డి, రమేశ్, లహరి, ఝాన్సీ పాల్గొన్నారు.

అన్ని వర్గాల మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నా

కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజల మద్దతుతో స్వతంత్ర ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గ్రేటర్ వరంగల్ కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుంద ర్‌రాజ్ యాదవ్ తెలిపారు. శనివారం హనుమ కొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి అశోక కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2015, 2021, 2023లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం బీసీ సంఘాలు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల మద్దతుతో ఇండిపెం డెంట్‌గా ఎమ్మెల్సీ బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు ఏ పార్టీని సంప్రదించలేదని, బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధమైనట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు తనకు తెలుసునని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడు తూ.. బీసీ సంక్షేమ సంఘం నుంచి సుందర్‌రాజ్ యాదవ్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయుల సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాలో క్రిప్టో కరెన్సీ ప్రకంపనలు

- నెల్లుట్ల యువకుడి అరెస్ట్‌పై జోరుగా చర్చలు
- 43 మంది నుంచి రూ.95 కోట్లు వసూళ్లు చేసిన వైనం

లింగాలఘణపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాలో క్రిప్టో కరెన్సీ ప్రకంపనలు అలజడి సృష్టిస్తున్నాయి. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన రమేశ్ అనే యువకుడు హైద్రాబాద్‌లో పలు వ్యాపారాలు నిర్వహిస్తూ క్రిప్టో కరెన్సీ పేరిట పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం జీబీఆర్ పేరిట నకిలీ ఐడీని సృష్టించి వాట్సాప్ గ్రూపుల్లో బల్క్‌గా సర్క్యులేట్ చేయడం ప్రారంభించాడు. జీబీఆర్ వెబ్‌సైట్లో క్రిప్టో కరెన్సీ పెట్టుబడులు పెడితే అతితక్కువ కాలంలో అత్యధికంగా లాభాలను సంపాదించవచ్చని నమ్మించాడు. ఈక్రమంలో 43మంది ద్వారా సుమారు రూ.95కోట్లు వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయమై కరీంనగర్‌కు చెందిన మనోజ్ మోసపోయానని ఆలస్యంగా గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐడీ డీజీ శిఖాగోయల్ హైద్రాబాద్‌లో మీడియాకు వెల్లడించారు. కాగా క్రిప్టో కరెన్సీ పేరిట మోసం చేసిన రమేశ్‌గౌడ్‌ను శుక్రవారం సీఐడీ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం కావడంతో జనగామ జిల్లా కేంద్రంతో పాటుగా లింగాలఘణపురం మండల వ్యాప్తంగా క్రిప్టో ప్రకంపనలు మొదలయ్యాయి. కాగా, నిందితుడు రమేశ్ ఇటీవలే నెల్లుట్లలో నిర్వహించిన నూతన గృహప్రవేశానికి సుమారు వంద లగ్జరీ కార్లలో అతిథితులు వచ్చినట్లు స్థానికులు చర్చించుకుంటుండడం విశేషం.

రేవంత్‌రెడ్డి.. అరాచక పాలన మానుకో

- కాంగ్రెస్ పాలనలో మీడియాపై పెరిగిన అణచివేత
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శ


సబ్‌జైలు ఎదుట మాట్లాడుతున్న దయాకర్‌రావు

జనగామ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా అరాచక పాలనను మానుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రజల అభిప్రాయాలపై తన చానల్‌లో పోస్ట్ చేశాడన్న కారణంగా అరెస్టయి జనగామ సబ్ జైలులో ఉన్న యూట్యూబ్ చానల్ రిపోర్టర్ రాజ్‌కుమార్‌కు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి శనివారం పరామర్శించారు. అనంతరం సబ్ జైలు బయట విలేఖరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మీడియాపై అణిచివేత ఎక్కువైందన్నారు. యూట్యూబ్, చిన్న టీవీలను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. లగచర్లలో గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. తమ లాంటి నాయకులపై కేసులు పెడితే ఎదుర్కొంటామని, కానీ అమాయక ప్రజలపై పెట్టడం సరికాదన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో రేవంత్‌రెడ్డి లాంటి దుర్మార్గ పాలనను చూడలేదన్నారు. రేవంత్‌రెడ్డిలో మార్పు రాలేదని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

పాలకుర్తిలో కాంగ్రెస్ నేతల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పాలన వైఫల్యాలపై ప్రజల అభిప్రాయాలు తీసుకొని తన ఛానల్‌లో పోస్ట్ చేసిన యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ రాజ్‌కుమార్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ పాలనపై ప్రజలంతా బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారని అన్నారు. రాజ్‌కుమార్‌ను వెంటనే విడుదల చేసి గిరిజనులకు క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కలల సౌధానికి క్రెడాయి అద్భుత వేదిక

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- హనుమకొండలో క్రెడాయి ప్రాపర్టీ షో




మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేకు పూలమొక్క అందజేస్తున్న నిర్వాహకులు

హనుమకొండ టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల కలల సౌధానికి క్రెడాయి సంస్థ ఒక అద్భుత వేదిక అని, ఆ సంస్థలో గృహ నిర్మాణంతో పాటు గృహోపకరణాలు అందుబాటులో ఉంచడం గొప్ప విశేషమని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం హనుమకొండలోని వీజీఆర్ గార్డెన్‌లో క్రెడాయి జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రెడాయి ప్రాపర్టీ షో కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి మంత్రి పొన్నం హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. క్రెడాయి సంస్థ 1999లో ఢిల్లీలో ప్రారంభమై అంచలంచెలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా రావడం గొప్ప పరిణామని అన్నారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టడంపై క్రెడాయి సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట త్రినగరాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటీవలే ప్రజాప్రభుత్వ నాయకత్వంలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం గుర్తు చేశారు. రైలు మార్గం, ప్రధాన జాతీయ రహదారులు, విద్యా రంగాల్లో కాకతీయ యూనివర్సిటీ కిట్స్, ఎన్ఐటీ, వైద్య రంగంలో ఎంజీఎం, కాకతీయ మెడికల్ కాలేజీ ఉన్నాయని అన్నారు. అన్ని విధాలుగా అభివృద్ధికి యోగ్యమైన ప్రాంతంగా హనుమకొండ నగరం ఉందని, క్రెడాయి లాంటి సంస్థ ప్రాపర్టీ షోలను నిర్వహించడం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రియల్టర్ కన్‌స్ట్రక్షన్‌లకు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొంత మేర రియల్ ఎస్టేట్ రంగం వెనక్కి తగ్గిందని, రానున్న రోజుల్లో మరింత వేగంగా పెరుగుతుందన్నారు.

అత్యవసర సేవలందించే ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేటు వైద్య సిబ్బంది కొనసాగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జ్ఞప్తి చేశారు. వారికి ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం విడతల వారీగా అందిస్తుందన్నారు. రేషన్ కార్డు లేనివారికి త్వరలోనే రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్, ఇతర సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల వద్ద ప్రైవేటు ట్రావెల్స్‌వారు అధిక చార్జీలు వసూలు చేస్తే అనుమతులను రద్దు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, భూమి లేనివారికి రెండు విడతలుగా రూ.6వేల చొప్పున అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అజయ్‌కుమార్, జగన్, రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి, సీహెచ్.సత్యనారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, ఎస్.అమరేందర్‌రెడ్డి, ఎస్.అమర్‌లింగేశ్వర్‌రావు, ఎం.రవీందర్‌రెడ్డి, జె.మనోహర్, ఎల్.రజినీకాంత్‌రెడ్డి, ఎం.రాజ్‌కుమార్, జి.రాజేందర్‌రెడ్డి, ఎం.వెంకటమల్లారెడ్డి, వరుణ్ కుమార్, అగర్వాల్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులతోపాటు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిల్లులు ఈ కుబేర్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉంటుండటంతో ఉపాధ్యాయులకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యల కోసం పోరాడుతున్న తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు కె.సోమశేఖర్, ఎ.వెంకట్, రంజిత్ కుమార్, సమ్మారావు, కిరణ్‌కుమార్, సదానంద్, విద్యాదేవి, సీతారాం, రవీందర్‌రాజు, పి.రాజు, కుమార్, సుజన్‌ప్రసాదరావు, రాజారాం, దామోదర్, అన్నాదేవి, లింగారావు, చంద్రయ్య, మోజెస్, రవీందర్, శ్రీనివాస్, కరుణాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

బలి తీసుకున్న బెట్టింగ్ భూతం

- ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి యువకుడి ఆత్మహత్య
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘటన


ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న రాజ్‌కుమార్


మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

వర్ధన్నపేట రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ గేమ్ ఆ యువకుడి పాలిట యమపాశమైంది. బెట్టింగుల పేరుతో ఇష్టానుసారంగా అప్పులు చేశాడు. కొడుకు చేసిన అప్పులను ప్లాటు అమ్మి తండ్రి కట్టాడు. అయినా మరో రూ.4లక్షలు కావాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని ఐదు రోజులుగా బెదిరించసాగాడు. అప్పు కోసం తండ్రి బయటకు వెళ్లగానే ఆ యువకుడు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో జరిగిన ఈ ఘటన అందరినీ కలచివేసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికుల తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

వర్ధన్నపేట మండలంలోని ఇల్లందకు చెందిన లైశెట్టి కుమారస్వామి - సోమలక్ష్మి దంపతులు గ్రామంలో కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. దీనికి తోడు పాల ప్యాకెట్లు సైతం ఇంటింటికి వెళ్లి వేస్తుంటారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు లైశెట్టి రఘుమోహన్ ఏడాది కిందట పోలీస్ ఉద్యోగం సాధించి ములుగులో పని చేస్తున్నాడు. రెండో కుమారుడు రంజిత్ అంగవైకల్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. మూడో కుమారుడు లైశెట్టి రాజ్‌కుమార్(28) డిగ్రీ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటున్నాడు. తల్లిదండ్రుల కూరగాయల వ్యాపారానికి చేదోడు వాదోడుగా ఉండడంతో పాటు పాల ప్యాకెట్లను తీసుకెళ్లి ఇంటింటికి వేసి వస్తాడు. గతంలో కొన్ని నెలల పాటు వరంగల్‌లో కోచింగ్ తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించి అతి తక్కువ మార్కులతో నిరాశ చెందాడు. ఇంట్లోనే ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే రాజ్‌కుమార్ ఆన్‌లైన్ గేమ్ బెట్టింగులు పెట్టడం ప్రారంభించాడు. పేకాటపై భారీగా బెట్టింగులు పెడుతూ ఆన్‌లైన్‌లో ఫోన్, ఇతర ఆన్‌లైన్‌ద్వారా డబ్బులను పంపించాడు. ఆన్‌లైన్ గేమ్‌లో ఉండే గుర్తు తెలియని వ్యక్తులు ఆశ చూపుతూ ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పడంతో అప్పులు చేసి మరీ బెట్టింగులు పెట్టాడు. ఇలా దాదాపు రూ.30లక్షల వరకు ఆన్‌లైన్ డబ్బులు పోగొట్టి తండ్రికి చెప్పాడు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో తండ్రి కుమారస్వామి అప్పులు చేసి మరీ డబ్బులు ఇచ్చాడు. ప్లాటును సైతం అమ్మి కొడుకు బాధను తీర్చాడు. అయితే తెచ్చిన అప్పులను తీర్చాలని తలచి రాజ్‌కుమార్ మళ్లీ గేమ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో సదరు గుర్తు తెలియని వ్యక్తులు వేధింపులు పెట్టడం సాగించారు. దీంతో మరో రూ.4 లక్షలు కావాలని తండ్రిని కోరగా ఐదు రోజుల కిందట ససేమిరా అన్నాడు. దీంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు.

అయితే శనివారం ఉదయం మళ్లీ రాజ్‌కుమార్ తండ్రిని డబ్బులు అడిగాడు. దీంతో ఎవరినైనా అడిగి వస్తానని చెప్పి అప్పు కోసం తండ్రి బయటకు పోయాడు. తండ్రి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని హాల్‌లో ఫ్యాన్‌కు డోర్ కర్టన్‌తో ఉరివేసుకుని రాజ్‌కుమార్ వేలాడుతున్నాడు. అది చూసిన తండ్రి కుమారస్వామి కుప్పకూలిపోయాడు. ఏడుస్తూ గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వ్యక్తులు వచ్చి చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వర్ధన్నపేట ఎస్ఐ చందన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాజ్‌కుమార్ తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఎస్ఐ చందన్ ప్రకటించారు. శవపంచనామా చేసి, మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు స్పష్టం చేశారు.

సంక్రాంతికి సొంతూళ్లకు..

- ప్రయాణికులతో హనుమకొండ, వరంగల్ బస్టాండ్లు కిటకిట
- మరింత రద్దీగా రైళ్లు



హనుమకొండ బస్టాండ్, వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

హనుమకొండ టౌన్/గిర్మాజీపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో హనుమకొండ, వరంగల్ ఆర్టీసీ బస్టాండ్లు, వరంగల్ రైల్వేస్టేషన్ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడాయి. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నాయి. శనివారం నుంచి పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో ప్రయాణికులు ఒక్కసారిగా హనుమకొండ, వరంగల్ బస్టాండ్లకు రావడంతో ఉన్న బస్సులు చాలక బస్సుల కోసం గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చింది.

సరిపడా బస్సులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు మండిపడ్డారు. రద్దీ నేపథ్యంలో దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉన్నందున పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని, ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆంధ్రా వెళ్లే రైళ్లన్నీ రద్దీగానే..

ఆంధ్రా ప్రాంతం వైపు వెళ్లే రైళ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. రోజువారీ రైళ్లతో పాటుగా సంక్రాంతి కోసం వేసిన ప్రత్యేక రైళ్లలోని రిజర్వేషన్ బోగీల్లో సీట్లు ఖాళీగా లేవు. ఇక జనరల్ బోగీలు మరింత కిక్కిరిసాయి. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ వారు కూడా ఎక్కువగానే ఉండగా.. వారంతా శనివారం వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి తమ స్వస్థలాలకు బయలుదేరారు. అయితే రద్దీ కారణంగా పలురైళ్లు ఎక్కే సమయంలో తోపులాటలు జరిగాయి.

కేయూకు 15 వరకు పండగ సెలవులు

కేయూ క్యాంపస్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ వర్సిటీ పరిధిలో భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినం సందర్భంగా జనవరి 13, 14, 15 తేదీల్లో వరుసగా సెలవులు ప్రకటిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 15న కనుమ సెలవు దినానికి బదులుగా ఫిబ్రవరి 8న రెండో శనివారం వర్కింగ్ డేగా ఉంటుందని పేర్కొన్నారు. కాలేజీలు, విభాగాలు, విశ్వవిద్యాలయాల కార్యాలయాలకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

వడ్డెర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళి

వడ్డెపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హనుమకొండ పట్టణానికి చెందిన బొంత మురళిని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరిపాటి జైపాల్, తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య తదితరులకు బొంత మురళి కృతజ్ఞతలు తెలిపారు.

'సెపక్‌తక్రా'లో ఏఐపీ క్రీడాకారుల హవా

- పురుషుల, మహిళల డబుల్స్‌లో ప్రథమ స్థానం
- జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న చాంపియన్‌షిప్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ బండా ప్రకాష్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో డబుల్స్ పురుషుల, మహిళల విభాగంలో ఆలిండియా పోలీస్ (ఏఐపీ) క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండింటిలోనూ విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించారు. శనివారం హనుమకొండ జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో సెపక్‌తక్రా పురుషుల డబుల్స్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో బిహార్‌పై ఏఐపీ క్రీడాకారులు విజయ ఢంకా మోగించి ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో బిహార్, తృతీయ స్థానంలో తెలంగాణ, హరియానా క్రీడాకారులు నిలిచారు.

అదేవిధంగా మహిళల విభాగంలో ఏఐపీ వర్సెస్ తెలంగాణ జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో తెలంగాణపై ఏఐపీ విజయదుందుభి మోగించగా తృతీయ స్థానంలో ఢిల్లీ, కేరళ రాష్ట్రాల జట్లు నిలిచాయి. టీమ్ ఈవెంట్ పురుషుల విభాగంలో ఢిల్లీపై మణిపూర్ జట్టు గెలుపొందగా ఎస్ఎస్‌బీ, అస్సాం జట్లు తృతీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో నాగాలాండ్‌పై ఎస్ఎస్‌బీ జట్టు గెలుపొందగా తృతీయ స్థానంలో ఉత్తరప్రదేశ్, మణిపూర్ జట్లు విజయకేతనం ఎగురవేశాయి.

ఈ క్రీడాపోటీలను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీల్లో విజయం సాధించాలని సూచించారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయి సెపక్‌తక్రా పురుషులు, మహిళలకు టీమ్ ఈవెంట్, డబుల్స్‌లలో జరిగిన ఫైనల్స్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీతత్వాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా రెగో, కాడ్ విభాగాల్లో పోటీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్ఆర్.ప్రేమ్ రాజ్, ప్రధానకార్యదర్శి వీరాగౌడ్, కోశాధికారి నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచి 11 మంది

- ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగే పరేడ్‌కు ఎంపిక
- వివిధ రంగాలకు చెందిన వారికి చోటు

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం రోజున దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి పలు రంగాలకు చెందిన 11 మందికి అవకాశం దక్కింది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ రాష్ట్రం నుంచి మొత్తం 72మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేయగా.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 11 మంది ఉన్నారు. పరేడ్‌కు ఎంపికైన వారిలో పీఎం యశస్వి పథకం లబ్ధిదారులైన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన జె.ప్రశాంత్, దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన బి గీతిక, వరంగల్ జిల్లా నర్సంపేట బీసీ బాలికల హాస్టల్‌కు చెందిన బీమగాని శాలిని, హ్యాండీక్రాఫ్ట్ విభాగంలో ములుగు జిల్లా మంగపేట మండలం దొమెడ గ్రామానికి చెందిన కొమురం ఆదిలక్ష్మి, గ్రామీణాభివృద్ధి విభాగంలో హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన దాసరి కల్పన, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బండారి మంజుల, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందకు చెందిన ఎడ్ల అరుణ, ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన మేక ప్రశాంతి కుమారి ఉన్నారు.

ఇక పీఎం మత్స్య సంపద యోజన లబ్ధిదారైన వరంగల్ జిల్లా కుమ్మరివాడ ఉర్సుకు చెందిన భైరిశెట్టి పట్టాభితో పాటు ప్రధాని మన్‌కీబాత్‌లో పాల్గొన్నవారి నుంచి జనగామ జిల్లా వీవర్స్‌కాలనీకి చెందిన చక్రాల సంతోష్ కుమార్, వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామానికి చెందిన గోనే మల్లయ్య ఉన్నారు.

బసవన్నలే నేస్తాలు బతుకంతా కష్టాలు!

సండే స్పెషల్ SUNDAY SPECIAL


గంగిరెద్దుతో కళాకారులు

- ఆదరణ కరువై బాగుపడని గంగిరెద్దుల వారి బతుకులు
- సంక్రాంతి వేళ కానరాని సందడి
- ప్రభుత్వాలు మారుతున్నా అందని కనీస సాయం
- సంచార జీవితంతో బతుకులు అగమ్యగోచరం

రఘునాథపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే ఒకప్పుడు పల్లెలు, పట్టణాల్లో ముగ్గుల లోగిళ్లు.. పతంగుల రెపరెపలు.. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటపాటలతో పల్లెలు, పట్టణాలలో సందడి కనిపించేది. కానీ రానురాను సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. ఉరుకులపరుగుల జీవితంలో పూర్వరోజుల్లోలా పండుగలను జరుపుకొనేవారే కనిపించడం లేదు. ఇక సంక్రాంతి పండుగలో కీలకమైన బసవన్నలుగా పిలుచుకునే గంగిరెద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఫలితంగా తరతరాలుగా వాటినే వృత్తిగా నమ్ముకున్న కుటుంబాలు దీనావస్థలో బతుకులీడుస్తున్నాయి. తాత ముత్తాతల నుంచి వస్తున్న గంగిరెద్దులను ఆడించే వృత్తినే జీవనాధారంగా ఎంచుకుని గంగిరెద్దులనే ఆస్తిగా నమ్ముకొని కూటి కోసం కోటి తిప్పలు పడుతున్నారు. సంచార జీవితం కావడంతో ప్రభుత్వాల నుంచి సరైన ఆదరణ లేక, కనీసం ఉండటానికి ఇళ్లు కూడా దీన స్థితిలో ఆయా కుటుంబాలున్నాయి. సంప్రదాయ కళను వృత్తిగా ఎంచుకుని బతుకుతున్న తమను పట్టించుకోవాలని గంగిరెద్దుల వారి కుటుంబాలు విన్నవిస్తున్నాయి.

అనాదిగా వస్తున్న ఆచారం..

దేవతల కాలంలో శివుడిని ఆరాధిస్తూ గంగిరెద్దుల ఆటతో దేవతలను మెప్పించిన వారిగా తమ తాత ముత్తాతల నుంచి ఇదే వృత్తిని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో నివాసముంటున్న బత్తుల శ్రీను, ఆవుదొడ్డి మహేష్, ఆవుదొడ్డి రాజు చెబుతున్నారు. గంగిరెద్దుల ఆట కోసం పది నెలల నుంచి నాలుగేళ్ల వయస్సు వరకు ఉన్న ఎద్దులను కొనుగోలు చేసి వాటికి నిత్యం పచ్చగడ్డి వేస్తు ఆకు పసర్లతో తమ మాటలను వినేలా తర్ఫీదునిస్తూ తమ కనుగుణంగా గంగిరెద్దులను మలుచుకుంటామంటున్నారు. గుంటూరు, నవాబుపేట, కోదాడ, ఒంగోలు నుంచి రూ.40వేల నుంచి రూ.90 వేల వరకు వెచ్చించి ఎద్దులను కొనుగోలు చేసి మూడు నెలల పాటు వాటికి ప్రత్యేక శిక్షణనిచ్చి ఆటకు సిద్ధం చేస్తామని బత్తుల శ్రీను తెలిపారు.

ఇప్పటికీ దుర్భర జీవితం

సంక్రాంతి వచ్చిందంటే తెల్లవారు జామునే ఇంటింటికి తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తూ ప్రజల నుంచి ధాన్యం, డబ్బులు స్వీకరించే వీరు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ దుర్భర జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా వీరి సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారు. బతుకు దెరువు కష్టమై కూలీ పనులు చేసుకుంటూ జీవితాలు వెళ్లదీస్తున్నారు. బసవన్నల ఆటలతో అందరిని అలరించే వారి ఇళ్లల్లో సంక్రాంతి సంబరాలు కనుచూపుమేరలో కనిపించడం లేదంటే వారి జీవన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. బాధలను దిగమింగుతూ బసవన్నల ఆటలతో గ్రామాలలో సంక్రాంతి సంబరాల సందడి చేస్తు పెద్దలు, చిన్నలను అలరింపజేస్తున్న గంగిరెద్దుల కళాకారులు వారికి వారే సాటి అని నిరూపించుకుంటు అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆదరించే వారు లేక కష్టాలతో సావాసం చేస్తున్నారు.

ఆకట్టుకునేలా అలంకరణ

ఆటకు వెళ్లే ముందు బసవన్నలను అందంగా అలంకరిస్తారు. రంగురంగుల జాకెట్టు ముక్కలు, చీరలతో బొంతను తయారు చేసి బసవన్నలపై కప్పుతారు. అలాగే ఈత చెట్టు కమ్మలతో చాపలు అల్లి వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్ది కొమ్ములకు తొడుగుతారు. మెడకు గజ్జెల పట్టి, కాళ్లకు గజ్జెలు కడతారు. ఒక్కో గంగిరెద్దును అలంకరించేందుకు సుమారు రూ.15 వేల వరకు ఖర్చు వస్తుందట. బసవన్నలకు శిక్షణ ఇచ్చేటప్పుడు వాటికి 'అలగడం' కూడా నేర్పిస్తామని, ఆటలు ఆడే సమయాల్లో ఎక్కువ డబ్బుల కోసం అలిగేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని శ్రీను తెలిపారు. గంగిరెద్దు మనిషి ఛాతిపై ఆడడం, గంగిరెద్దు నోట్లో మెడ పెట్టడం, మోకాళ్లపై కూర్చుని నడవడం వంటి ఆటలను కూడా నేర్పిస్తామని చెప్పారు. ఎవరైనా చనిపోతే సమాచారం తెలుసుకుని గంగిరెద్దు విన్యాసాలు చేసి చూపించి డబ్బులు వసూలు చేసుకుంటామని తెలిపారు.

తాతల నుంచి ఇదే పని : బత్తుల శ్రీను



నా చిన్నప్పటి నుంచి గంగిరెద్దులను ఆడిస్తూనే బతుకుతున్న. తాత ముత్తాతల నుంచి మాకు ఇదే వృత్తి ఆచారంగా వత్తాంది. సావు..బతుకులే మాకు బుక్కెడు బువ్వ కల్పిస్తయి. సంక్రాంతి పండుగప్పుడే మా చేతిలో చాలా పైసలు కనిపిస్తయి. పొట్ట కూటి కోసం గంగిరెద్దుతో ఊరూరు తిరుగుతున్నం.

పుట్టెడు కష్టాలు పడుతూ కళను బతికిస్తున్నాం : ఆవుదొడ్డి మహేష్



గంగిరెద్దులను ఆడించే కళను బతికించడానికి పుట్టెడు కష్టాలు పడుతున్నాం. గంగిరెద్దులతో సంచార జీవనం సాగిస్తూ పొట్ట పోసుకుంటున్నాం. ఉండటానికి సొంత ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి దుస్తులు కూడా కరువయ్యాయి. ఆదరణ కోల్పోతున్న కళకు జీవం పోయడానికి బతుకు భారమవుతున్నా.. కష్టాలకు ఎదురీదుతూ బతుకు పోరు సాగిస్తున్నాం. గంగిరెద్దులు ఆడిస్తే వచ్చే ఆదాయం కుటుంబం పోషించడానికి సరి పోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

బసవన్నల ఆటను బతికిస్తున్నాం : ఆవుదొడ్డి రాజు



బసవన్నల ఆటను బతికించడానికి ఎన్నో కష్టనష్టాలు పడాల్సి వస్తోంది. బసవన్నల ఆటకు ప్రజల ఆదరణ తగ్గడంతో బుక్కెడు బువ్వ కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణ రాష్ట్రం సాకారమైనంక కూడా మా బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నాయి. ఎవ్వరు మమ్ములను పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణ యాస, బసవన్నల ఆటను బతికిస్తున్న మాకు సర్కారు సరైన ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలి.

ఇంటింటా సంక్రాంతి సందడి


బట్టల బజార్‌లో సంక్రాంతి నోముల సామగ్రి అమ్మకాలు

- నోములతో మహిళలకు సౌభాగ్యం
- పూజా సామగ్రి కొనుగోలులో మహిళలు బిజీ

వరంగల్ చౌరస్తా, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలతో ధనధాన్యాలతో ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండుగ సంక్రాంతి. సోమవారం భోగి పండుగ, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను జరుపుకోనున్న నేపథ్యంలో ఇంటింటా సందడి మొదలైంది. మూడు రోజుల పాటుసాగే పర్వదిన వేడుకల్లో భాగంగా మహిళలు సంక్రాంతి రోజున ప్రత్యేక నోములు ఆచరిస్తారు. కలకాలం తాము ముత్తైదువుగా ఉండాలని, పిల్లాపాపలు, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. మరునాడు బంధు మిత్రులను, ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి నోమును వాయినంగా ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు.

పూజా సామగ్రికి పెరిగిన గిరాకీ

సంక్రాంతి పర్వదినం వస్తుందంటే మహిళలు నోములు నోచుకోవడానికి ఉపయోగించే పూజా సామగ్రి దుకాణాలు కళకళలాడుతాయి. వరంగల్ బట్టల బజార్, చౌరస్తా, స్టేషన్‌రోడ్డు, పాపయ్యపేట చమన్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తారు. ఈసారి పది రోజుల క్రితమే ప్రారంభించారు.

నోముకునే విధానం

తాము కలకాలం ముత్తైదువుగా ఉండాలని వేడుకుంటూ మహిళలు 13 రకాల వస్తువులతో నోముకుంటారు. ప్రధానంగా టిఫిన్ బాక్స్‌ల నుంచి బకెట్లు చిన్నచిన్న స్టీల్ సామానులాంటి 13 రకాల గృహోపకరణాలను కొని వాటిలో పసుపు కుంకుమ, రేగుపండ్లు, నువ్వుల ముద్దలు, పోకలు, గాజులు, చేబియ్యం, కంకణం, రవికబట్టలు అమ్మవారి ముందు పెట్టి మంగళహారతులు పలుకుతారు. మరునాడు 13 మందిని ఇంటికి పిలిచి తల ఒక నోము అందజేసి ఆశీర్వచనం పొందుతారు.

చైనా మాంజాతో పైలం

- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు, వన్య ప్రాణులు
- పోలీసులు చర్యలు చేపట్టినా.. ఆగని విక్రయాలు


పతంగుల దుకాణంలో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న మాంజా దారాలు

జనగామ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వచ్చిందంటే.. గాలిపటాల రెపరెపలు కనిపిస్తుంటాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొడతుంటారు. అంతేకాదు ఎదుటి వారి గాలిపటాలను తెగ్గొట్టాలన్న తాపత్రయం.. వారిని మించి ఎగురవేయాలన్న పట్టుదలతో ప్రమాదకర చైనా మాంజాను వాడుతున్నారు. దాంతో సంతోషాన్ని నింపాల్సిన పతంగులు విషాదాన్ని విగుల్చుతున్నాయి. అత్యంత పదునుగా, బలంగా ఉండే చైనా మాంజా మనుషులకే కాదు, జంతువులు, పక్షులకు కూడా ముప్పు తెస్తోంది. చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్నాయని 2016లో ప్రభుత్వం విక్రయాలను నిషేధించింది. అయినా గుట్టుచప్పుడు కాకుండా మాంజా విక్రయిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు రంగంలోకి దిగి చర్యలు చేపడుతున్నా పరిస్థితి మారడం లేదు. కొంత మంది వ్యాపారులు కాసుల కోసం కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధిక ధరలకు చైనా మాంజా విక్రయిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. గాలిపటాల పోటీలో తెగిపడిన దారాలు చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు, భవనాలపై పడుతున్నాయి. వాహనాలపై వేగంగా వెళ్తున్న వారికి మాంజా తగిలి గాయపడుతున్నారు. సన్నగా, దృఢంగా ఉండే ఈ దారాన్ని చేతులతో, పళ్లతో తెంచే ప్రయత్నం చేస్తే ప్రమాదమే.

ఉమ్మడి జిల్లాలో పలు సంఘటనలు

చైనా మాంజాలో ప్రమాదకర గాజు పొడి, అల్యూమినియం ఆక్సైడ్‌తో పాటు గట్టితనం కోసం సింథటిక్ ఫైబర్ కలుపుతారు. దీంతో ఈ మాంజా తగిలితే చర్మం కోసుకుపోతుంది. వారం రోజుల క్రితం జనగామ పట్టణంలో చైనా మాంజా తగిలి కొందరు పిల్లలు, యువకులు గాయపడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయి. జనగామ జిల్లాలోని బచ్చన్నపేటకు చెందిన ఎస్.సనత్‌కుమార్, సాయిరాం, సాయికుమార్ జనగామలోని సిద్దిపేట రోడ్డు వైపు వంతెనపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గాలిపటానికి చెందిన మాంజా దారం తగలడంతో సనత్‌కుమార్ గొంతుకు తీవ్ర గాయమైంది. సాయిరాం, సాయికుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో ద్విచక్రవాహనం పై తల్లిదండ్రులతో కలిసి ప్రయాణిస్తున్న పదేళ్ల బాలుడు వీక్షిత్‌కు గొంతు భాగంలో దారం తగలడంతో తీవ్ర గాయమైంది. నిషేధిత మాంజా దారాల విక్రయాలపై అటవీ, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

జైలు శిక్ష, జరిమానా

చైనా మాంజాతో పొంచి ఉన్న ముప్పును గ్రహించే రాష్ట్ర ప్రభుత్వం 2016లో వీటి విక్రయాలపై నిషేధం విధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం చైనా మాంజాను కొనుగోలు చేసినా, విక్రయించినా నేరంగా పరిగణిస్తారు. దీనిని ఉల్లంఘించిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. జంతువులు, పక్షులకు హాని కలిగిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 3 నుంచి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలతో పోలీసులు మాంజా విక్రయాలపై కన్నేసారు. పతంగుల దుకాణాలపై విస్తృతంగా మూకుమ్మడి దాడులు చేపట్టారు. చైనా మాంజాను విక్రయిస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. అయినా చాటుమాటుగా చైనా మాంజా విక్రయాలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.


ప్రమాదానికి గురైన సనత్‌కుమార్ (ఫైల్)


గాయపడిన వీక్షిత్ (ఫైల్)

మాంజా విక్రయాలు చేపడితే చర్యలు

దామోదర్‌రెడ్డి, సీఐ, జనగామ



సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో పతంగులు విక్రయాలు చేసేవారు నిబంధనలు పాటించాలి. చైనా మాంజా విక్రయాల నేపథ్యంలో ఇప్పటికే పలు షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. అత్యంత ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను విక్రయించొద్దు. ఎవరైనా విక్రయిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

జయహో 'యువత'

సామాజిక బాధ్యతగా పలు అంశాల్లో సేవలు

భవితకు దిక్సూచిగా ఎన్‌వైకే

- యువత భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు
- నేడు ఇండోర్ స్టేడియంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం



ఎన్‌వైకే ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం (ఫైల్)

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయడానికి ఉద్దేశించిన నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకే).. ఆ దిశగా పలు కార్యక్రమాలను చేపడుతోంది. హనుమకొండ బాలసముద్రంలోని ఈ కేంద్రం యేడాదిగా నిర్వహించిన అనేక సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువతీ, యువకులు, యువజన సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు, నేడు వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో ఎన్‌వైకే కార్యకలాపాలపై కథనం

ట్రాఫిక్

పర్వదినాల రోజు పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని నెహ్రూయువ కేంద్ర సరిగ్గా దీపావళి పండుగ రోజు ట్రాఫిక్ అవగాహన ట్రాఫిక్ పోలీసులకు సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఎన్‌వైకే ఆధ్వర్యంలో పలువురు యువతీ యువకులు దీపావళి రోజు ఉదయం 8 గంటలకే రోడ్లమీదికి వచ్చి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులకు స్వచ్ఛందంగా సాయపడ్డారు. పనిలో పనిగా ట్రాఫిక్ రూల్స్ రాసిన, వాహనాలను నడిపేప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు రాసిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ వాహనదారులకు, సామాన్య ప్రజలకు అవగాహన కలిగించారు.

ఆస్పత్రుల్లో స్వచ్ఛత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బయోవ్యర్థాలు, మరుగుదొడ్ల నుంచి వెలువడే దుర్వాసనను దృష్టిలో పట్టుకొని ఎన్‌వైకే పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఆస్పత్రులను ఊడ్చి శుభ్రం చేశారు. రోగలకు ఆహారం, మందులు అందించడం, వైద్య పరీక్షల కోసం వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై రోగులకు ల్యాబ్‌ల వద్దకు తీసుకువెళ్లడం వంటి పనులు చేశారు.

మార్కెట్లు శుభ్రం

నగరంలోని కూరగాయాల మార్కెట్‌లలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పారపోసిన కుళ్లిపోయిన, పుచ్చులున్న కూరగాయాలను, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యువతీ యువకులు శుభ్రం చేశారు. మార్కెట్లను ఊడ్చి చెత్తను తొలగించి వాటిని శుభ్రం చేశారు. మార్కెట్లతో పాటు వేయిస్తంభాల గుడి, ఇతర ప్రార్థనా స్థలాలను సైతం పరిశుభ్రం చేశారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

మాదక ద్రవ్యాలపై ఎన్‌వైకే అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. పోలీసు అధికారులతో కౌన్సెలింగ్ ఇప్పిచ్చింది. ఇందులో భాగంగా ఇటీవల బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజీలో డ్రగ్స్‌వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన సదస్సులో ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో పాటు పోలీసు ఉన్నతాధికారుల పాల్గొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఎన్‌కేవై ఆధ్వర్యంలో యువతీ యువకులతో పెద్ద ఎత్తున ర్యాలీలను నిర్వహించారు.

క్రీడా పోటీలు

నెహ్రూ యువ కేంద్ర బ్లాక్ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యికిపైగా యువజన సంఘాలు ఉన్నాయి. ఈ ఆటల పోటీల నిర్వహణ బాధ్యతను వాటికే అప్పగించడం ద్వారా వాటిని క్రియాశీలం చేస్తోంది. గ్రామస్థాయిలో సామాజిక రుగ్మతలపై యువతతో సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తోంది.

మై భారత్‌తో అనుసంధానం

వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, యువత సాధికారతను ప్రోత్సహించే వర్క్‌షాపుల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మైభారత్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు. పోర్టల్ భాగస్వా మ్యంతోనూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మైభారత్‌లో యువత క్రియాశీల భూమిక పోషించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం యూత్ క్లబ్‌ల ఏర్పాటు, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంక్లిష్టంగా మార డంతో యూత్ క్లబ్‌లూ వలంటీర్లను ప్రోత్సహిస్తున్నారు.

నేడు యువజనోత్సవం

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు నెహ్రూయువ కేంద్ర కోఆర్డినేటర్ అన్వేష్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీన జేఎన్‌ఎస్ స్టేడియంకు ఎదురుగా గల ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో యూత్ అవార్డులు పొందినవారిని సత్కరించనున్నామన్నారు. అంతేకాకుండా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి ఇవ్వనున్న సందేశాన్ని డిజిటల్ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అంశాలపై యువజనోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

చేయూతనిచ్చే మై భారత్

- నాలుగు అంశాలతో అనుసంధానం
- విభిన్న రంగాల్లో రాణించేలా ప్రోత్సాహం

నేడు జాతీయ యువజన దినోత్సవం

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే యువత అన్ని రంగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ మన భారత్ (మైభారత్) పేరిట పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. తమ పరిధులను విస్తృతం చేసుకోవాలని, తమ జీవితంలో మార్పు తీసుకురావాలని, తమ కలలవైపు నడిచేలా అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని కాంక్షించే యువతకు మై భారత్ ఒక ప్లాట్‌ఫారమ్. యువతకు వివిధ స్వయం సేవకంగా, అనుభపూర్వకంగా నేర్చుకోవడానికి, నైపుణ్యాన్ని ఏర్పరచుకోవడానికి, కమ్యూనిటీలలో సానుకూల ప్రభావాన్ని సృష్టించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని మై భారత్ పోర్టల్ కల్పిస్తుంది. నేడు స్వామివివేకానంద జయంతి. ఈ రోజును జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని యువతీ యువకుల అవగాహన కోసం మైభారత్ పోర్టల్‌పై కథనం.

యువతకు భాగస్వామ్యం

మైభారత్ పోర్టల్‌లో 15 ఏళ్ల నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకులకు కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించింది. ఈ పోర్టల్‌లో చేరిన యువతను అభివృద్ధివైపు మళ్లించడం, సాధికారత సాధించేలా చేయూతనివ్వడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంచేందుకు గత ఏడాది అక్టోబరు 31న ప్రధాని నరేంద్ర మోదీ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ-లర్నింగ్ పోర్టల్ ద్వారా వివిధ రకాల అంశాలకు సంబంధించి తర్ఫీదు ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగ అవకాశాలు, పలు రకాల కోర్సులు, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా నైపుణ్య సమాచారం ఈ పోర్టల్ ద్వారా లభ్యమవుతుంది.

లక్ష్యాలు

డిగ్రీలు చేతపట్టుకున్న యువత ఉద్యోగవేటలో అలసిపోతున్నారు. నైపుణ్యం ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరువైంది. ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నా పొందలేకపోతున్నారు. ఆర్థిక స్తోమత లేక పరిశ్రమలు స్థాపించడంలో ఔత్సాహికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాదు.. ప్రైవేటులో నిలదొక్కుకునేందుకు మై భారత్ పోర్టల్ వేదిక అవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్య చదువుతున్న వారి ప్రతిభ ఆధారంగా ఉపాధి పొందేందుకు మార్గనిర్దేశనం చేయనున్నారు.

అనుసంధానం

మై భారత్ పోర్టల్‌ను నాలుగు అంశాలతో అనుసంధానం చేశారు. ఒకటి - ప్రభుత్వ పరంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన. వీటిని వినియోగించుకునేందుకు అర్హతలను ఈ పోర్టల్ ద్వారా వివరిస్తారు. రెండోది - ఎంచుకున్న రంగంలో ప్రతిభా నైపుణ్యాలు పెంపొందించుకునే అవకాశాలు, నైపుణ్య సాధనకు అందుబాటులో ఉన్నవాటిపై అవగాహన కల్పించడం. మూడోది - సామాజిక బాధ్యతను చేర్చి యువత ఉజ్వల భవితకు బాటలు వేసే సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలు అమలు చేయడం. నాలుగోది - వ్యాపారంలో రాణించేలా యువతను ప్రొత్సహించడం. వ్యాపారాన్ని ప్రారంభించేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ)లో రాయితీ, ఎలా రుణం పొందాలో ఈ పోర్టల్‌లో ఉంటుంది. వ్యాపార, పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడే అవకాశం కల్పించి సందేహాలను నివృత్తి చేయడం.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

యువతీ, యువకులు స్వయం ఉపాధికి సంబంధించిన సమాచారం పొందాలంటే ప్లే స్టోర్‌లోకి వెళ్లి మైభారత్ పోర్ట ల్‌లో చేరేందుకు లాగిన్ కావాలి. పుట్టినరోజు, నెల, సంవత్సరం, రాష్ట్రం, జల్లా, గ్రామం, పట్టణం ఇలా సమాచారం నమోదు చేయాలి. తర్వాత ఈ-మెయిల్ ఐడీతో పాటు ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఎన్‌వైకే, ఇతరులు ఇలా ఏ కేటగిరిలో ఉన్నారో దాన్ని క్లిక్ చేయాలి. 15-29 ఏళ్ల లోపు యువత దీనిలో సభ్యత్వం తీసుకునే వెసులుబాటు కల్పించారు.

నమోదు వివరాలు

మై పోర్టల్‌లో విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఈ పోర్టల్‌లో భాగస్వామ్యం కావడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 68,042 మంది యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో హనుమకొండ జిల్లాలో 15,959 మంది, వరంగల్ జిల్లాలో 13,669, జనగామ జిల్లాలో 11,066, మహబూబాబాద్ జిల్లాలో 9,599, ములుగు జిల్లాలో 8,150, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,599 మంది నమోదయ్యారు.

వైష్ణవ ఆలయాల్లో వైభవంగా కూదారై వేడుకలు

హనుమకొండ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక ఓరుగల్లు నగరం ధనుర్మాస వేడుకల పర్వంతో ఆధ్యాత్మికతను సంతరింపజేసుకుంది. ఈ క్రమంలో భాగంగా ధనుర్మాస గోదాదేవి శ్రీ వ్రత పర్వంలో భాగంగా 27వ రోజు శనివారం నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో కూదారై వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొని గోదాదేవికి ప్రణమిల్లారు. 108 గంగాళాలలో పాయసాన్ని గోదాదేవికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని శ్రీరంగనాథస్వామి ఆలయ పెద్ద కోవెలలో ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవచార్య, నర్సింహాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన కూదారై వేడుకల్లో రేబల్లి వెంకటేశ్వరస్వామి, లీలాదేవి దంపతుల సౌజన్యంతో 108 గంగాళాలను భక్తులకు పంపిణీ చేశారు. అదే విధంగా రెవెన్యూ రామాలయం, ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వరాలయం, అదాలత్ సమీపంలోని శ్రీభూనీలాసమేత వెంకటేశ్వర ఆలయాల్లో కూడా పరిమళద్రవ్య పాయసాన్ని గంగాళాలలో ఉంచి భక్తులకు పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లో అన్ని ఆలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వేయిస్తంభాల ఆలయ ఈవోగా ప్రసాద్

హనుమకొండ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయ ఈవోగా ఎస్.ప్రసాద్‌ను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నియామకం చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం వరంగల్ గిర్మాజీపేట లో దుర్గేశ్వరస్వామి ఆలయ గ్రేడ్-2 ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న క్రమంలో వేయిస్తంభాల రుద్రేశ్వరాలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కె.వెంకటయ్యను సిద్ధేశ్వరాలయ ఈవోతోపాటు పరకాలలోని కుంకుమేశ్వర స్వామి ఆలయ ఈవోగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్ల పంపిణీ



దివ్యాంగులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచిన కృత్రిమ కాళ్లు

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ హనుమకొండ, రోటరీ క్లబ్ ఖమ్మం సంయుక్తాధ్వర్యంలో శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో కాళ్లు లేని 110 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. జంధ్యం సుధాకర్, కోట సుమన్‌రెడ్డి (యుఎస్‌ఏ) అందించిన ఆర్థిక సహకారంతో వీటిని అందచేశారు. యేటా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కాళ్లు లేకుండా ఇబ్బంది పడుతున్నవారిని గుర్తించి ఇలా కృత్రిమ పాదాలను ఉచితంగా అందచేస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు శారు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి విజయ్‌కుమార్, క్లబ్ సభ్యులు, రోటరీ క్లబ్ ఖమ్మం సభ్యులు సాంబశివరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కలో వైభవంగా అయ్యప్ప పూజలు

కాజీపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శనివారం అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వామి గొలనకొండ శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం, పంచవర్ణాభిషేకం నిర్వహించారు. పడిపూజ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. అంతకుముందు వెంకటేశ్వర స్వామికి కుకడారై ప్రసాదాన్ని 108 గంగాలలో స్వామివారికి నివేదన చేశారు. చొక్కారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో దేవాలయ కార్యకర్తలు జయమ్మ, ఉమాదేవి, మంజుల నాగమణి, తుమ్మ శ్రీనివాస్, తోపాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కిట్స్‌లో ఘనంగా రంగోలి వేడుకలు

హసన్‌పర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రంగోలి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్స్ స్టాఫ్ క్లబ్, అధ్యాపక బృందం, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు స్టాఫ్ క్లబ్ ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన తెలుగు రాష్ట్రాలో సంక్రాంతికి అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ లూయిస్ బ్రెయిలి జయంతి

బాలసముద్రం, జనవరి 11(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, లక్ష్మి- నారాయణ అంధుల, అనాథల సంక్షేమ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ లూయిస్ బ్రెయిల్ జయంతి వేడుకలు హనుమకొండలోని తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డేపల్లిలోని ఒయాసిస్ అనాథ ఆశ్రమం, పోలీసు కాలనీలోని శ్రీసాయి అనాథ ఆశ్రమాలకు నిత్యావసర వస్తువులను, నిరుద్యోగ అంధులకు శబ్ద ఉపకరణాలను అక్కల రవి - మౌనిక దంపతులు ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం

కాజీపేట, జనవరి 11 : మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి 59వ వర్ధంతిని శనివారం కాజీపేట ఈఎల్‌ఎస్ కాలనీలో నిర్వహించారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావులు శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గుర్రపు సుధాకర్, పి.రమేశ్, ఎబ్నైజర్, జి.భాస్కర్, డి.రవీందర్, సాయిరాజ్, మాధవరావు, టి.ప్రవీన్, నవీన్, కరుణాకర్ పాల్గొన్నారు.

పద్మాక్షి కాలనీలో కార్డెన్ సెర్చ్

వరంగల్ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షికాలనీలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాలనీల్లోని ఇళ్లతోపాటు రోడ్లపై వెళ్లే వాహనాదారులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కాలనీలో అనుమానితులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 18 వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్, కేయూ సీఐ రవికుమార్, సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్‌మ్యాన్డ్ వర్కర్ల వేతనాల పెంపు ఐఎన్‌టీయూసీ ఘనత



మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

రాంనగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లోని అన్‌మ్యాన్డ్ వర్కర్స్‌కు కంపెనీ వేతనాలు పెంచడం వెనుక 327 (ఐఎన్‌టీయూసీ) కృషి ఉందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. శనివారం హనుమకొండ పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో అన్‌మాన్డ్ వర్కర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ.. అన్‌మాన్డ్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆన్‌మాన్డ్ సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సెక్రెటరీ శ్రీనువాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి తులసి రెడ్డి, ఆన్‌మాన్డ్ నాయ కులు వెంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి ధన్యవాదాలు

సీఐటీయూ దశలవారీగా చేసిన పోరాటాల ఫలితంగా అన్‌మాన్డ్ వర్కర్స్‌కు సీఎండీ వరుణ్‌రెడ్డి స్కిల్డ్ వేతనాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నందుకు సీఎండీకి యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి ధన్యవాదాలు తెలిపారు. శనివారం కంపెనీ అధ్యక్షుడు అంజనేయులు అధ్యక్షతన ఆన్‌మాన్డ్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. కంపెనీలో 12 ఏళ్ల నుంచి అన్‌మాన్డ్ వర్కర్స్ పని చేస్తున్నప్పటికీ ఏ ఒక్క యూనియన్ పట్టించుకోలేదన్నారు. భవిష్యత్‌లో కంపెనీ ఉద్యోగులుగా గుర్తించడానికి మరిన్న పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కంపెనీ గౌరవధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కంపెనీ కార్యదర్శి వెంకట్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు జాతరలో కట్టుదిట్టమైన భద్రత

▸▸ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ రవీందర్



జాతర పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ రవీందర్, సీఐ రాజగోపాల్, ఈవో నాగేశ్వర్‌రావు, తదితరులు

ఐనవోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు కట్టుదిట్టమైన భద్రతకల్పించి మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఐనవోలు జాతరలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై శనివారం ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఫెస్టివల్ ఆఫీసర్ గౌరిశంకర్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీ, భద్రత, పోలీస్ చెక్‌పోస్టుల ఏర్పాటు, భక్తుల క్యూలైన్లు నిర్మాణం, పార్కింగ్, వీఐపీ పార్కింగ్, రహదారులపై ట్రాఫిక్ క్లియరెన్స్, భక్తుల వాహనాల పార్కింగ్ స్థలాల ఎంపికను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఈనెల 12 నుంచి 14వరకు జరిగే జాతర ప్రధాన ఘట్టానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నందున వారిని ఇబ్బందులు కలుగకుండా పోలీసులు సేవలందిస్తారని పేర్కొన్నారు. ఐనవోలుకు వచ్చే నాలుగు రహదారాలతోపాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో మొత్తం 12 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. జాతర ప్రాంగణమంత దేవస్థానం, పోలీస్‌శాఖ ద్వారా 170సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఇద్దరు ఏసీపీలు, 14 మంది సీఐలు, 27 మంది ఎస్సైలు 349 మంది పోలీసు సిబ్బంది, నిఘా బృందాలు విధులు నిర్వహిస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, నాయకులు, భక్తుల సమన్వయంతో కలిసి జాతరను విజయవంతం చేద్దామని డీసీపీ పిలుపునిచ్చారు.

నేడు ఆలయంలో ధ్వజారోహణం

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు ముస్తాబయ్యాడు. ఈనెల 12న ఆదివారం ధ్వజారోహణం కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 13న భోగి, 14న మకర సంక్రాంతి రోజున రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

కేయూకు ఇన్ఫోసిస్ సంస్థ సేవలు గొప్పవి



హైదరాబాద్ ఇన్ఫోసిస్ ప్రతినిధులతో మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి కార్పొరేట్ సామాజిక బాధ్యతలతో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ నేతృత్వంలో దాతృత్వంలో 300 డెస్క్‌టప్ కంప్యూటర్లకు మొదటి విడతగా 60 అందించడం గొప్పవని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు తమ సంస్థ తరుపున గత అక్టోబరులో అందించిన 60 డెస్క్‌టప్ కంప్యూటర్లు పనితీరు, వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వర్సిటీలోని బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, లైబ్రరీ, పరిపాలన భవనంలో పనిచేస్తున్న డెస్క్‌టాప్ కంప్యూటర్లను పరిశీలించారు. అనంతరం కేయూ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు వంశీ ముత్యాపు, లావణ్య కింతాడ, సమంత్ వల్లాలకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి మెమొంటో, పుష్పగుచ్ఛం, శాలువా అందచేసి సన్మానించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేయూకు దాతలు, సంస్థలు దాతృత్వ సేవలందించాలని కోరారు. వర్సిటీ పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ, దాత పులి రవికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డీవో, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, డాక్టర్ సీజే శ్రీలత, ఏఆర్‌లు డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, డాక్టర్ కోలా శంకర్, వర్సిటీ లైబ్రరీ అధికారులు టి.జావేద్, ఇజాక్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయకోణంలో వైద్య సేవలు అందించాలి

వరంగల్ మెడికల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యం పేదలకు మానవీయ కోణంలో వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ సూచించారు. శనివారం హనుమకొండలోని రోహిణి, ఏకశిల హాస్పిటల్స్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, ఐసీయూ, వార్డులను సందర్శించి అందుతున్న సేవలతోపాటు చికిత్స తీసుకుంటున్న వారిని, సహాయకులను సేవలపై అడిగి తెలుసుకున్నారు. లేబరోటరీలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను ఆయన పరిశీలించారు. ప్రతీ ఒక్కరు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రతీ హాస్పిటల్‌లో వారు అందిస్తున్న సేవలు, వాటికి సంబంధించిన ఫీజు, డాక్టర్ల వివరాలను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, డెమో అశోక్‌రెడ్డి, విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డిలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హసన్‌పర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతసాగర్ సుమతి రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన అధ్యాపకులకు పూర్వ విద్యార్థులు జ్ఞాపికలను అందజేశారు. ఇతర దేశాలలో ఉన్న పూర్వ విద్యార్థులు ఆన్‌లైన్‌వేదికగా తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.రంజిత్‌కుమార్, విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ కె.మహేందర్, డాక్టర్ ఎస్.శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గోసంగి కులస్థులను ప్రభుత్వమే ఆదుకోవాలి

వడ్డెపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిపోయిన గోసంగి కులస్థులను ప్రభుత్వమే ఆదుకోవాలని గోసంగి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రొఫెసర్ చింత సమ్మయ్య అన్నారు. శనివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించిన గోసంగి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా సమావేశానికి చింతు మల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్యతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద మల్లేశం మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక గోసంగి కులస్థులు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాల, మాదిగ కులస్థులు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకుంటున్నారని అన్నారు. తరతరాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో మగ్గుతున్న గోసంగి కులస్థుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలను, ప్యాకేజీని ఏర్పాటు చేసి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొల్లంపల్లి సారయ్య, గోసంగి కుల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు మంద యాకనారాయణ, చింపు శంకర్, చింపు వెంకటేష్, కొయ్యడ సురేష్, తెడ్డు ఐలయ్య, మూడెడ్డుల విజయ్, గద్వాల శ్రీనివాస్, అలువాల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సదస్సును జయప్రదం చేయండి

బాలసముద్రం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న జరిగే మత్స్యకారు ల జిల్లా సదస్సును జయప్రదం చేయాల్సిందిగా అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యురాలు కొప్పు పద్మ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. మత్స్యకారులు సమాజానికి శ్రేష్ఠమైన పౌష్టికాహారం అందిస్తూ వారు మాత్రం ఆర్థిక ఇబ్బందులతో, అర్థాకలితో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. ఇతర వృత్తిదారులకు మాదిరిగా మత్స్యకారులకు పింఛన్ ఇచ్చి ప్రభుత్వం అండగా నిలవాలని ఆమె కోరారు.

హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ మాట్లాడుతూ.. హైడ్రా లాంటి చట్టాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి భూ కబ్జాదారుల నుంచి చెరువులను రక్షించాలని కోరారు. మత్స్య మహిళా సొసైటీలకు చేపల వంటకాలు, పచ్చళ్లు ఇతర అనుబంధ ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనకు ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇంకా జిల్లా సంఘం అధ్యక్షుడు నిమ్మల విజేందర్, సహాయ కార్యదర్శి మోరె కుమార్, ఉపాధ్యక్షురాలు దువ్వ సమ్మక్క, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

▸▸ హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ ఆఫీసర్లు సమన్వయంతో పని చేయాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య సూచించారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ-ఔషధిపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. 330 రకాల మందులు పీహెచ్‌సీలకు వినియోగించుకోవచ్చన్నారు. మొత్తం సీఎంఎస్‌ల‌ద్వారా డీఎంఈ, టీవీవీపీ, పీహెచ్‌సీలకు 568 మందులను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు భవిష్యత్‌లో వార్షిక ఇండెంట్లు పంపేటప్పుడు పారదర్శకంగా, అవసరమైన మందులను ఇండెంట్ చేయాల్సిన బాధ్యత వైద్యులు, ఫార్మసిస్టులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఫార్మసిస్టు ఉప్పు భాస్కర్‌రావు, టీవీవీపీ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతం చౌహాన్, జీఎంహెచ్ ఆర్ఎం డాక్టర్ అంబరీష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, ఫార్మసిస్టులు బత్తిని సుదర్శన్‌గౌడ్, కందకట్ల శరత్‌బాబు, నళిని, జిల్లా అధికారులు అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్, మాధవరెడ్డి, సిబ్బంది రజనీకాంత్, క్రాంతి పాల్గొన్నారు.

ఓయూకు తరలిన మాదిగ ఉద్యోగులు, మేధావులు

కేయూ క్యాంపస్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో శనివారం జరిగిన మాదిగ ఉద్యోగులు, మేధావుల సదస్సుకు కేయూ ఉద్యోగులు, మేధావుల సంఘాల నేతలు తరలివెళ్లారు. కేయూ మొదటి గేటు వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు మంద కుమార్, కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోడేటి శ్రీనివాస్ బస్సుకు జెండా ఊపారు. ఉద్యోగులు ర్యాలీ చేపట్టిన ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నేతలు కుమార్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతులు - లక్ష డప్పుల మండే మాదిగల గుండెచప్పుడు దండోరా సాంస్కృతిక మహాప్రదర్శన విజయవంతం కోసం మేధావులు, ఉద్యోగుల సదస్సు జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, బొక్క మొగిలి, మంద శ్యాంసన్, ఈ శోభన్ కుమార్, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ సత్య జూల, మహర్షి, దాసు, డాక్టర్ ఎ.రవీందర్ డాక్టర్ వడ్డెపల్లి మధు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, మంద భాస్కర్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యం

చైతన్య మోడల్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

పరకాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పరకాల పట్టణంలోని చైతన్య మోడల్ హైస్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ నేతాని శ్రీనివాస్‌రెడ్డి సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేత, సంధ్యారాణి, ఉషాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిట్‌లో అందుబాటులో మైక్రోస్కోపీ సౌకర్యం

▸▸ విద్యార్థులు ఉచితంగా వాడుకునే వెసులుబాటు



నిట్‌లో జరిగిన వర్క్‌షాపునకు హాజరైన ప్రొఫెసర్లు

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో సెంటర్ ఫర్ ఇన్-సిటు అండ్ కోరిలేటివ్ మైక్రోస్కోపీ సౌకర్యంపై శనివారం వర్క్‌షాపు జరిగింది. ఐఐటీ హైదరాబాద్ క్లస్టర్‌కు శాస్త్ర, సాంకేతిక విభాగం ద్వారా సోఫిస్టికేటెడ్ అనలిటికల్ అండ్ టెక్నికల్ హెల్ప్ ఇన్‌స్టిట్యూట్(సాథి) పథకం కింద రూ.60కోట్ల గ్రాంట్ మంజూరైంది. ఐఐటీ హైదరాబాద్ క్లస్టర్‌లో భాగస్వామిగా ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లలో వరంగల్ నిట్ కూడా ఒకటి. వరంగల్ నిట్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్), శాస్త్ర సాంకేతిక విభాగం(డీఎస్‌టీ) ద్వారా సాథి పథకం కింద స్థాపించిన సాథి-సిస్‌కోమ్ సౌకర్యంపై ఈ వర్క్‌షాపును నిర్వహించారు. సాథి-సిస్‌కోమ్ కో ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ శైర్యదత్తా ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన కోసం రూపొందించిన రూ.1కోటి నుంచి రూ.30 కోట్ల విలువైన ఆధునాతన మైక్రోస్కోపీ సాధనాల గురించి వివరించారు. ఇప్పుడు వరంగల్ నిట్ ఈ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. సాథి భాగస్వామ్యంలో వరంగల్ నిట్ విద్యార్థులు, పరిశోధకులు ఈ మైక్రోస్కోపీ పరికరాలను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. సాథి వరంగల్ నిట్ నోడల్ అధికారి హరీష్ మాట్లాడుతూ.. సాథి మార్గదర్శకాల పరిధిలో ప్రయోగాత్మక శిక్షణ, మెరుగైన పరిశోధన సామర్థ్యాల కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి తమ పేర్లను నమోదు చేసుకోవలసిందిగా విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో వరంగల్ నిట్ ఫ్యాకల్టీ, టెక్నికల్‌సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మడికొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు తరాలపల్లి వద్ద ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ కనిపించింది. ఐనవోలు మండలం గరిమిల్లపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గబ్బెట సమ్మయ్య పోలీసులను చూసినపారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూవివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు

హసన్‌పర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి పోలీసు స్టేషన్ పరిధి దేవన్నపేట శివారు సర్వే నెంబర్ 79లో గల భూవివాదంలో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు తెలిపిన వివరాల ప్రకారం... దేవన్నపేట రెవెన్యూ శివారు సర్వే నెం.79లో చుంచు సుందరయ్యతో పాటు ఇదే గ్రామానికి చెందిన శ్రీపతి కొమురయ్యల మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోంది. ఈ నెల 10న ఇరువర్గాల మధ్య భూవివాదం తారా స్థాయికి చేరుకోవడంతో భూ సమస్య పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

తాటిచెట్టుపై గీత కార్మికుడు మృతి



తాటిచెట్టుపై గుండెపోటుతో మృతి చెందిన గీతకార్మికుడు యాదగిరి

హసన్‌పర్తి/వడ్డెపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన గీత కార్మికుడు బైరగోని యాదగిరి పరిమళకాలనీలో తాడి చెట్టుపై మృతి చెందాడు. కేయూ ఎస్సై మాధవ్ తెలిపిన ప్రకారం.. వడ్డెపల్లి ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన బైరగోని యాదగగిరికి గీత వృత్తితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం రోజూ మదిరి గానే పరిమళకాలనీలో తాటి చెట్టు ఎక్కి కల్లు గీసి దిగుతుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో యాదగిరి చెట్టుపైనే మృతి చెందాడు. స్థానికులు గమనించి కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవిందర్‌కు సమాచారం అందించారు. సంబంధిత ఎస్సై మాధవ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతుని కుటుంబానికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. యాదగిరికి భార్య యశోద, ముగ్గురు సంతానం కాగా, అందరికీ వివాహాలు అయ్యాయి.

పేకాట స్థావరంపై దాడులు

వరంగల్ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీర్తినగర్‌లో ఏడుగురు పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని రూ.29,130 స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పట్టుబడ్డ వారిలో కాశిబుగ్గకు చెందిన వారున్నారన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంజేపీ విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో గెలుపొందిన ఉర్సుగుట్ట ఎంజేపీ పాఠశాల విద్యార్థిని తనూష్క జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఈనెల నుంచి 11 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికైన తనూష్కను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి అభినందించారు.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా వి డుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
బ్యాక్ ఇన్ యాక్షన్	హాలీవుడ్ మూవీ	జనవరి 17
ది రోషన్స్	హిందీ డాక్యు సిరీస్	జనవరి 17
అమెజాన్ ప్రైమ్		
పాతాళ్ లోక్ 2	హిందీ సిరీస్	జనవరి 17
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
పవర్ ఆఫ్ పాంచ్	హిందీ సిరీస్	జనవరి 17
సోనీ లివ్		
పని	తెలుగు చిత్రం	జనవరి 16
ఎంఎక్స్ ప్లేయర్		
చిడియా ఉడ్	హిందీ సిరీస్	జనవరి 15
ఎపిక్ ఆన్		
గృహ లక్ష్మి	హిందీ సిరీస్	జనవరి 16
మనోరమా మ్యాక్స్		
ఐ యామ్ కథలాన్	మలయాళ చిత్రం	జనవరి 17

మూడు తరాల కథ

ప్రస్తుతం ఓటీటీల్లో సినీ సెలబ్రిటీల డాక్యుమెంటరీల ట్రెండ్ నడుస్తోంది. ఈ కోవలో వస్తున్న మరో డాక్యుమెంటరీ 'ది రోషన్స్'. బాలీవుడ్‌లో ప్రముఖ కుటుంబాల్లో ఒకటైన రోషన్స్ ఫ్యామిలీకి సంబంధించిన ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ నెల 17 నుంచి స్ట్రీమింగ్‌కు రానుంది. అగ్రహీరో హృతిక్ రోషన్ సినీ కెరీర్‌తో పాటు వ్యక్తిగత, కుటుంబ విశేషాలను ఇందులో ప్రముఖంగా చూపించనున్నారు. అలాగే వారి కుటుంబంలోని మూడు తరాల గురించి ఇందులో చూపించబోతున్నారు. హృతిక్‌రోషన్ తండ్రి రాకేశ్ రోషన్, తాతయ్య రోషన్‌లాల్ నగ్రత్ సినీ పరిశ్రమకు అందించిన సేవలను ఆవిష్కరించనున్నారు. అనిల్ కపూర్, షారూఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా లాంటి సన్నిహితులు రోషన్స్ కుటుంబం గురించి చెప్పిన ఆసక్తికర విషయాలు అభిమానులు అలరించనున్నాయి. ఈ డాక్యుమెంటరీకి శశిరంజన్ దర్శకుడు.







సంక్రాంతి పండగకు తెలుగు చిత్రసీమకు మధ్య ఓ బలమైన సెంటిమెంటు ఉంటుంది. ఈ పండగకు విడుదలైన వాటిలో ఎక్కువ చిత్రాలు బాక్సాఫీసును బద్ధలు కొట్టిన సందర్భాలు అనేకం. అందుకే సంక్రాంతి అంటేనే దర్శకనిర్మాతలకు కలిసొచ్చే పండగ. చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకూ పోటీ పడుతుంటాయి. కానీ ఈసారి స్టార్ హీరోల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. సంక్రాంతి బరిలో కేవలం మూడు సినిమాలు తలబడుతున్నాయి.

సంక్రాంతి పందెం కోళ్లు




ఈ సంక్రాంతికి విడుదలైన తొలి చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఆ తర్వాత నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందిన 'డాకు మహారాజ్'ని ఈనెల 12న విడుదల చేస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్మించారు. చివరగా దిల్ రాజు ప్రొడక్షన్స్‌లోనే తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాన్ని 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

సినిమా విడుదలైన తరవాత రామ్‌చరణ్ అభిమానులు, ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. అయితే సినీ విమర్శకులు మాత్రం యావరేజ్ అనే అంటున్నారు. 'నానా హైరానా' పాటకి సినిమాలో చోటు లేకపోవడం ప్రేక్షకులను నిరాశకు గురిచేసింది. అయితే ఈ పాటను ఈనెల 14న జోడించనున్నట్లు నిర్మాతలు ప్రకటించడం కొంత వరకు రామ్‌చరణ్ అభిమానులకు ఊరట.

బాలకృష్ణ 'డాకు మహారాజ్' చిత్ర ట్రైలర్ కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఆయన అభిమానులు కోరుకునే అంశాలు అన్నీ ఈ చిత్రంలో ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ ట్రైలర్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. బాలయ్య, సంక్రాంతి కాంబినేషన్‌కు మంచి ట్రాక్ రికార్డే ఉంది. ఈ చిత్రం రిలీజ్‌తో మళ్లీ ఓ మ్యాజిక్ క్రియేట్ అయ్యేలా ఉంది అని అంటున్నారు బాలయ్య అభిమానులు. 'భగవంత్ సింగ్ కేసరి'లో తండ్రీ కూతుళ్ల సంబంధం ఉన్నట్లే ఈ చిత్రంలోనూ ఓ చిన్న పాప

అంటే ఫ్యామిలీస్ కలుసుకోవడం. సినిమాకు వెళ్లడం ఒక సంప్రదాయం. ఈసారి ఆ ప్రత్యేకతను 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం సొంతం చేసుకుంది. పైగా దిల్‌రాజు, వెంకటేశ్, అనిల్ రావిపూడి... ఈ ముగ్గురి కాంబినేషన్ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్. ఇది వరకే వచ్చిన ఎఫ్2, ఎఫ్3తో ఇది రుజువైంది. కాబట్టి ప్రేక్షకులు ఈ పండగకు ఏ చిత్రం చూసినా చూడకపోయినా... దీన్ని మాత్రం చూడకుండా వదల్లేరు అనే టాక్ వస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అదిరిపోయింది. పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. స్వయంగా వెంకటేశ్ ఓ పాటను ఆలపించడం ఈ చిత్రానికే హైలైట్. కనుక ఫ్యామిలీ ఆడియెన్స్ ఎక్కువగా చూసే అవకాశాలున్నాయి.



ప్రచారంలో కొత్త ఒరవడి...

కొవిడ్ తరవాత సినిమా తీరు మారిపోయింది. మంచి కథను ఎంచుకుని ఎంత గొప్పగా తీసినా థియేటర్లకు ప్రేక్షకులు రాకపోతే ఆ సినిమాకు రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. ప్రేక్షకుల అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే నిర్మాతలు మంచి ఓపెనింగ్స్ సాధించుకుంటారు. అయితే ఈ విషయంలో 'సంక్రాంతికి వస్తున్నాం' దర్శకుడు అనిల్ రావిపూడి అందరికంటే ముందున్నారు. ఒక రకంగా చెప్పాలంటే సినిమా ప్రమోషన్‌ని మొత్తం తన భుజస్కంధాలపైనే వేసుకున్నారు. సోషల్ మీడియాపై ఎక్కువ ఫోకస్ చేశారు. హీరో, హీరోయిన్లు, ఇతర కీలక నటీనటులతో పలు రీల్స్ చేయడమే కాకుండా తానూ అందులో నటించారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం ద్వారా తన సినిమాపై అందరికంటే ఎక్కువగా బజ్‌ని క్రియేట్ చేయగలిగారు. మిగతా రెండు చిత్రాలతో పోల్చితే 'సంక్రాంతికి వస్తున్నాం' సోషల్ మీడియాలో దూసుకెళ్తోందనే చెప్పొచ్చు.

వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఎఫ్2, ఎఫ్3 తరవాత వస్తున్న సినిమా అయినందున ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

అంచనాలు పెంచిన ట్రైలర్స్...

సినిమాలను విడుదల చేసే క్రమంలో మూడు చిత్రాల ట్రైలర్లు విడుదలయ్యాయి. దీంతో ప్రేక్షకుల్లో ఈ మూడు సినిమాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ట్రైలర్లు కూడా వరుస క్రమంలోనే విడుదలవడం గమనార్హం. ముందుగా వచ్చిన 'గేమ్ ఛేంజర్' మంచి హైప్‌ని క్రియేట్ చేసింది. ట్రైలర్‌లో రామ్‌చరణ్ మాస్ లుక్‌తో పాటు, కాస్ట్లీ విజువలైజేషన్స్ ఆకట్టుకున్నాయి. అయితే ఈ చిత్రం గురించి నిర్మాత దిల్‌రాజు ఓ ప్రమోషన్‌లో మాట్లాడుతూ 'శంకర్ గారు ఏం చేస్తారండీ! ఇప్పుడు ఈ సినిమా ఎలా ఉంటుందో అని అందరూ అంటున్నారు. ఇది నా కమ్‌బ్యాక్ ఫిల్మ్. ప్రేక్షకులు విజిల్ వేసే సన్నివేశాలు ఇందులో ఎన్నో ఉన్నాయి' అని అన్నారు. ఆయన అన్నట్టుగానే



సెంటిమెంట్‌ని చేర్చారు. బాలయ్య అంటే యాక్షన్ ఉండటమే కాదు... బలమైన ఫ్యామిలీ సెంటిమెంట్ కూడా ఉండాలి. ఆ కోణంలోనే ఈ చిత్రం రూపుదిద్దుకున్నట్లు ట్రైలర్ తెలియజేస్తోంది. అటు నిర్మాతలు కూడా చిత్రానికి కుటుంబ ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారని బలంగా నమ్ముతున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలోని పాటలు హిట్ అయ్యాయి. ముఖ్యంగా 'దబిడి దిబిడి' పాట బాగా ట్రెండ్ అవుతోంది. ఈ పాటపై కొంత వివాదం రేగినప్పటికీ టార్గెట్ ఆడియెన్స్‌కి బాగానే రీచ్ అయ్యిందని చెప్పొచ్చు.

ఇక మూడో చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' 14న విడుదలవుతోంది. ఇది ఒక కుటుంబ కథా చిత్రంగా ఉండబోతోందని తెలుస్తోంది. సంక్రాంతి సందడి మొత్తం ట్రెయిలర్‌లో కనిపిస్తుంది. పండక్కి ఎన్ని సినిమాలు వచ్చినా అందులో కుటుంబ సభ్యులందరూ కలసి సరదాగా చూడగలిగే లైట్ హార్టెడ్ సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకత ఉంటుంది. ఎందుకంటే పండగ

పాటల ప్రత్యేకత...

- 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలోని 'గోదారి గట్టు' పాట అత్యధిక వ్యూస్‌ని సొంతం చేసుకుంది. ఇప్పటి వరకూ 85 వేల మిలియన్ల మంది చూశారు. ఈ పాటను రమణ గోగుల మధు ప్రియతో కలసి పాడారు. 18 ఏళ్ల బ్రేక్ తరవాత రమణ గోగుల తిరిగి ఆలపించిన పాట ఇదే. సంగీతం... భీమ్స్ సిసిరోలియో.
- 'గేమ్ ఛేంజర్'లోని 'జరగండి' పాట 55 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇదే చిత్రంలోని 'నానా హైరానా' (52 మిలియన్లు), 'రా రా మచ్చా' (42 మిలియన్లు) వ్యూస్ దక్కించుకున్నాయి. 'ధూప్' సాంగ్ 30 మిలియన్లతో కొనసాగుతోంది. కాగా, 'హైరానా' పాటని న్యూజిలాండ్‌లో ఆరు రోజుల పాటు ఎవరూ చిత్రీకరించని విధంగా రెడ్ ఇన్‌ఫ్రా కెమెరాతో తీశారు. ఒక్కో సన్నివేశాన్ని ఒక్కో పెయింటింగ్‌లా విజువల్ బ్యూటీగా మలిచారు. బాస్కో మార్టీస్ కొరియోగ్రఫీని అందించారు. ఒక్క ఈ పాట చిత్రీకరణకే రూ.10 కోట్లు ఖర్చు పెట్టినట్లు వినికిడి.
- 'డాకు మహారాజ్' చిత్ర గీతాలు కూడా అభిమానులను అలరిస్తున్నాయి. ఈ చిత్రంలోని 'డబిడి దిబిడి' 13 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కించుకుంది. 'రేజ్ ఆఫ్ డాకు' (5 మిలియన్లకు పైగా), 'చిన్ని' పాట(4 మిలియన్లకు పైగా) వ్యూస్ పొందాయి.

భోగ భాగ్యాలనిచ్చే బొమ్మల కొలువు

సంక్రాంతి అనగానే గుర్తొచ్చే ప్రధాన వేడుక బొమ్మల కొలువు. దీనిని భోగి నాడు ప్రారంభించి కనుమ పండుగ రోజు వరకు కొనసాగిస్తారు. బొమ్మల కొలువుని మూడు, అయిదు, తొమ్మిది మెట్ల వారీగా పేర్చడం తెలుగువారి సంప్రదాయం. ఓ పద్ధతి ప్రకారం మెట్ల మీద బొమ్మలను అందంగా అమరుస్తారు.

- మొదటి మెట్టు మీద చిన్న ఇళ్లు, గుడులు, గోపురాలు, పొలాలు, రకరకాల చెట్లు, పూల తీగలు లాంటి ప్రకృతి సంబంధిత బొమ్మలు పేరుస్తారు.
- రెండో మెట్టు మీద శంఖం, చేప, తాబేలు, నత్త, పీత, ఇతర జలచరాల బొమ్మలు పెడతారు.
- మూడు, నాలుగు మెట్ల మీద చిన్న క్రిమి కీటకాల బొమ్మలు, చీమలు, తుమ్మెదలు, తేనెటీగల బొమ్మలు అమరుస్తారు.
- అయిదో మెట్టు మీద రకరకాల పక్షులు, జంతువుల బొమ్మలను కనువిందుగా పెడతారు.
- ఆరో మెట్టు మీద మనుషుల బొమ్మలు, ఏడో మెట్టుమీద మహనీయుల బొమ్మలు పెడతారు
- ఎనిమిదో మెట్టుమీద అష్ట దిక్పాలకులు, నవ గ్రహాల నాయకులు, పంచభూతాల బొమ్మలు పేరుస్తారు.
- తొమ్మిదో మెట్టు మీద త్రిమూర్తులు అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల బొమ్మలతోపాటు సరస్వతి, లక్ష్మి, పార్వతి బొమ్మలను పెడతారు.
- వినాయకుడు, కుమారస్వామితో ఉన్న శివ పార్వతుల బొమ్మ.... చిన్న బాబుని ఎత్తుకున్న తల్లి, ఆవు దూడ, పంచాంగం చదువుతున్న బ్రాహ్మణుడు, పెద్ద ముత్తైదువ, పచారీ కొట్టు కోమటి బొమ్మలను తప్పనిసరిగా బొమ్మల కొలువులో ఉంచుతారు. కాల క్రమంలో మట్టి బొమ్మలు, స్వాతంత్ర్య సమరయోధుల బొమ్మలు, వాహనాల బొమ్మలు, బార్బీ బొమ్మలు, పింగాణీ బొమ్మలు కూడా ఈ కొలువులో చోటు సంపాదించుకున్నాయి. ఏటా ఓ కొత్త బొమ్మను తప్పనిసరిగా కొని కొలువులో పెడతారు.
- బొమ్మల కొలువు పెట్టిన తరవాత చుట్టు పక్కల ఉండే మహిళలందరిని పేరంటానికి పిలుస్తారు. బొమ్మలకు ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తారు. బొమ్మల కొలువు చూడడానికి వచ్చిన ముత్తైదువలను పసుపు, కుంకుమ, తాంబూలంతో సత్కరించి గోదాదేవి బొమ్మనిచ్చి పంపుతారు. బొమ్మల కొలువు పెట్టిన ఇల్లు భోగభాగ్యాలతో వర్ధిల్లుతుందని ఒక నమ్మకం.
- కొన్ని ప్రాంతాల్లో రాజు, రాణి, పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు, మేళతాళాలు, పెళ్లితంతు బొమ్మలు పెట్టి బొమ్మల పెళ్లి చేసే వేడుక కూడా ఉంది.



బొమ్మల పెట్టె

- బొమ్మల కొలువులో పెట్టే బొమ్మలను జాగ్రత్తగా దాచడానికి ఓ చెక్క పెట్టె ఉంటుంది. బొమ్మలన్నింటినీ కాగితాలు లేదా సన్నని బట్టలో చుట్టి ఈ పెట్టెలో పెడతారు. దీనిని ఎవరూ ముట్టుకోకుండా ఇంట్లో అటక మీద భద్ర పరుస్తారు.
- బొమ్మల కొలువు పెట్టే రోజున ఈ పెట్టెను జాగ్రత్తగా కింది దించుతారు. ఇంట్లోని పురుషులు అంటే తాత, తండ్రి, పినతండ్రి కలిసి పెట్టెకు పూజ చేసి హారతి ఇస్తారు. పిల్లల చేత చప్పట్లు కొట్టిస్తూ ఆనందోత్సాహాల మధ్య పెట్టె తెరుస్తారు. ఇది భోగినాడు జరిగే అద్భుతమైన వేడుక.

ముత్యాల ముగ్గు



యం.రెడ్డి రాణి
చిత్తూరు

15 చుక్కలు
8 వచ్చేవరకు
సందుచుక్క





పసుపులేటి మానస
రేపల్లె, గుంటూరు జిల్లా

11-6
మధ్యచుక్క



శాంతి నర్వ
హైదరాబాద్

15 చుక్కలు
8 వరకు
మధ్యచుక్కలు

పిల్లల ఎదుగుదలకు...

పిల్లల శారీరక ఎదుగుదలకు, మానసిక వికాసానికి పోషకాహారం తప్పనిసరి. పిల్లలు ఆరోగ్యంగా పెరగాలంటే ఏం తినిపించాలో తెలుసుకుందాం!

పాలు: ప్రతిరోజూ పిల్లలకు కనీసం రెండు గ్లాసుల పాలు తాగించాలి. పాలతో తయారయ్యే పెరుగు, జున్ను లాంటివి కూడా తినిపించాలి. వీటిలో కాల్షియం, ప్రోటీన్లు, మంచి కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవన్నీ పిల్లల్లో దంతాలు,



ఎముకలు, కండరాల పెరుగుదలకు తోడ్పడతాయి. పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చేస్తాయి. రక్తపోటు, గుండె పనితీరు నియంత్రణలో ఉండేలా సహకరిస్తాయి.

ప్రొటీన్ పదార్థాలు: ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను పిల్లలకు పెట్టాలి. గుడ్లు, మాంసం, చేపలు, నట్ బటర్, బాదం, బీన్స్, బఠానీలు, సోయా పన్నీర్‌లను అల్పాహారంలో చేర్చి తినిపించాలి. దీనివల్ల పిల్లలకు అవసరమైన ప్రోటీన్లు, పీచుపదార్థాలు అంది మెదడు, కణజాలం వృద్ధి చెందుతాయి.

పండ్లు: పిల్లలకు తరచూ పండ్లను తినిపించడం వల్ల వారి ఎదుగుదలకు కావాల్సిన విటమిన్లు, ఖనిజ లవణాలు, ఇతర పోషకాలు అందుతాయి. నారింజ, స్ట్రాబెరీ లాంటి సిట్రస్ జాతి పండ్లను తినిపిస్తే పిల్లలకు సి విటమిన్ లభిస్తుంది. ఇది వారిలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాపిల్స్ అరటి పండ్లు తినిపించడం వల్ల యాంటీఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు, పొటాషియం లభిస్తాయి. ఇవి పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

తృణ ధాన్యాలు: బ్రౌన్ బ్రెడ్, టోర్టిల్లా, ఫ్లాట్ బ్రెడ్, పాస్తా, నూడుల్స్‌ను పిల్లలకు తినిపించాలి. బియ్యం, మొక్క జొన్న, క్వినోవా, ఓట్స్, బార్లీ లాంటి ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను పిల్లలకు పెట్టాలి. దీనివల్ల వారికి శక్తి లభిస్తుంది. జీవక్రియలు వేగవంతమై పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు.

కూరగాయలు: టమాటా, కేరెట్, చిలగడదుంప, గుమ్మడికాయ, బీట్‌రూట్ లాంటి తాజా కూరగాయలను పిల్లలకు తప్పకుండా తినిపించాలి. వీటిలో ఎ విటమిన్, ఖనిజాలు, పీచుపదార్థం, ఫైటోకెమికల్స్, బీటా కెరోటిన్లు, కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవి పిల్లల శారీరక నిర్మాణానికి సహకరిస్తాయి. కళ్లు, చర్మం, తల వెంట్రుకలు, గోళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

గ్రీన్ టీ తాగుతున్నారా..!

బ్లాక్ టీ కంటే గ్రీన్ టీ తాగడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఒక కప్పు వేడినీళ్లలో ఓ గ్రీన్ టీ బ్యాగ్ లేదా కొన్ని గ్రీన్ టీ ఆకులు, రెండు పుదీనా లేదా తులసి ఆకులు వేసి మూతపెట్టి రెండు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా తేనె కలిపితే గ్రీన్ టీ తయారవుతుంది. దీనిని తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- పని ఒత్తిడితో అలసిపోయినపుడు ఓ కప్పు గ్రీన్ టీ తాగితే దానిలోని థయమిన్ సమ్మేళనం ప్రభావవంతంగా పనిచేసి ఆందోళనను తగ్గిస్తుంది. మధుమేహం, రక్తపోటు సమస్యలను నివారిస్తుంది.
- తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. న్యూరోడీజెనరేటివ్ సమస్యలు రావు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రతలను పెంచి అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను అరికడుతుంది.
- ప్రతిరోజూ ఉదయాన్నే గ్రీన్ టీ తాగుతూ



ఉంటే ఎముకలు, కీళ్లు బలోపేతమవుతాయి. ఆస్టియోపొరాసిస్ వ్యాధి రాదు.

- గ్రీన్ టీలోని పాలి ఫెనాల్స్ యాంటీ ఆక్సిడెంట్లు... చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. కళ్ల కింద, చర్మం మీద ముడతలు రాకుండా చేస్తాయి. శిరోజాల కుదుళ్లు గట్టిపడేలా సహకరిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించి గుండె జబ్బుల నుంచి రక్షిస్తాయి.
- రోజుకు రెండుసార్లు గ్రీన్ టీ తాగుతూ ఉంటే దానిలోని కెటాచిన్లు... శరీరంలోని అదనపు కేలరీలను వేగంగా కరిగిస్తాయి. దీంతో శరీర బరువు క్రమంగా తగ్గుతుంది.
- తేనె, పంచదార కలుపుకోకుండా గ్రీన్ టీ తాగితే అందులోని యాంటీ బ్యాక్టీరియల్స్... దంతక్షయం, చిగుళ్ల వ్యాధులు, నోటి దుర్వాసన, నోటి క్యాన్సర్ లాంటి సమస్యలను నివారిస్తాయి.





‘నా కెరీర్‌కి ఇది మరో సంక్రాంతి. ఒక క్లీన్ ఎంటర్‌టైనింగ్ చిత్రంతో వస్తున్నందుకు ఆనందంగా ఉంది. లిటిల్ క్రైమ్ ఎలిమెంట్‌తో కూడిన కొత్త జానర్ మూవీ ఇది. సినిమా జర్నీని చాలా ఎంజాయ్ చేశాను. అంతా పాజిటివ్‌గా ఉంది. నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన చాలా సినిమాలు విజయం సాధించాయి. ఈ సినిమా కూడా అద్భుతంగా ఆడుతుంది.

అందరూ ఎంజాయ్ చేస్తారు

వెంకటేశ్

అందరూ ఎంజాయ్ చేస్తారు. క్లయిమాక్స్ చాలా ఉత్కంఠకు గురిచేస్తుంది’ అని అన్నారు హీరో దగ్గుబాటి వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా రూపొందిన సినిమా ‘సంక్రాంతికి వస్తున్నాం’. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వెంకటేశ్ మీడియాతో మాట్లాడుతూ ‘ చిత్ర కథ విషయానికొస్తే..ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్..ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించింది. మినిమమ్ గ్యారెంటీ అని అక్కడే తెలిసిపోయింది. అనిల్, నాది సూపర్‌హిట్ కాంబినేషన్. ఈ చిత్రంలో కామెడీ స్టయిల్ కొంచెం డిఫరెంట్‌గా ఉంటుంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ చాలా మంచి క్యారెక్టర్స్ చేశారు. క్లయిమాక్స్‌లో చెప్పే డైలాగ్స్ చాలా క్రేజీగా ఉంటాయి. ఆడియన్స్ చాలా ఎంటర్‌టైన్ అవుతారు. భీమ్స్ చాలా హార్డ్ వర్క్ చేసి బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాడు. గోదారి గట్టు పాట 85 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది. ప్రతి సినిమా నా సొంత సినిమాగా చేస్తాను. ప్రతి ఒక్కరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటాను. సిన్సియర్‌గా పని చేస్తాను. దిల్ రాజు ప్రొడక్షన్స్‌లో ‘సీతమ్మ వాకిట్లో’ నుంచి ట్రావెల్ అవుతున్నాను. మేము చేసిన అన్ని సినిమాలు బాగా ఆడాయి. వారికి మరిన్ని విజయాలు రావాలని కోరుకుంటున్నాను. ‘రానా నాయుడు-2’ డబ్బింగ్ పూర్తయింది. మార్చిలో రావొచ్చు’ అని అన్నారు.


కొత్త బాలకృష్ణని చూస్తారు

- బాబీ కొల్లి



నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ‘డాకు మహారాజ్’. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నేడు విడుదలవుతున్న ఈ సినిమాలో బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. ఈ నేపథ్యంలో బాబీ కొల్లి మీడియాతో మాట్లాడుతూ ‘బాలకృష్ణ ఇమేజ్‌ని, ప్రేక్షకుల్లో ఆయన సినిమాపై ఉండే అంచనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. బాలకృష్ణ గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా చూపించడానికి ప్రయత్నించాం. బాలయ్య సెటిల్డ్‌గా డైలాగ్‌లు చెప్తే చాలా బాగుంటుంది. ‘నరసింహనాయుడు’, ‘సమరసింహారెడ్డి’ తర్వాత ‘సింహా’ ఎలా అయితే గర్తుండిపోయిందో...‘డాకు మహారాజ్’ కూడా అలాంటి పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది. బాలకృష్ణపై అభిమానంతో నాగవంశీ ఈ సినిమా వైవిధ్యంగా ఉండాలని భావించారు. హీరోకి ఆయుధం అనేది కీలకం. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో గొడ్డలి వంటి పవర్ ఫుల్ ఆయుధం బాగా ఫేమస్. ఈ సినిమాలో అలాంటి శక్తిమంతమైన ఆయుధాలను డిజైన్ చేయించాం. నా గత సినిమాలతో బాబీ కథకథనాలు బాగా రాస్తాడు అనే పేరు తెచ్చుకోగలిగాను. అయితే హాలీవుడ్ స్థాయిలో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని మాట్లాడుకునేలా చేయలేకపోయాను. ఇప్పుడు ‘డాకు మహారాజ్’తో విజువల్స్ పరంగా గొప్ప పేరు వస్తుంది. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ వారి పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. రెగ్యులర్ విలన్ పాత్రలా కాకుండా బాబీ డియోల్ పాత్ర కొత్తగా ఉంటుంది’ అని వివరించారు.







బిజినెస్

నయా ఫండ్స్

● **యూటీఐ క్వాంట్ ఫండ్**

యూటీఐ మ్యూచువల్ ఫండ్.. యూటీఐ క్వాంట్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ పరిస్థితులు, ఆటుపోట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిలకడైన వ్యూహంతో పెట్టుబడులు పెట్టడం ఈ ఫండ్ ప్రత్యేకత. క్వాంటిటేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ థీమ్‌తో దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్‌కు బీఎస్ఈ 200 టీఆర్ఐ బెంచ్ మార్క్ ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 25.

● **మిరే అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్**

మిరే అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్.. మిరే అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ).. ఈ ఫండ్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ జనవరి 24.

● **బంధన్ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్**

బంధన్ మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ ఆల్ఫా లో వొలాటిలిటీ 30 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. అనిశ్చితితో కూడిన మార్కెట్లలో కూడా నిలకడైన రాబడులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బహుళ వ్యూహంతో పెట్టుబడులు పెట్టడం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 20. కనీస పెట్టుబడి రూ.1,000.

భారత్ బంగారు కొండ!

మనోళ్ల దగ్గర 22,000 టన్నుల పసిడి నిల్వలు



గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చండి..

ప్రభుత్వానికి బులియన్ వర్తక సంఘాల వినతి

భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువే. భారత కుటుంబాల వద్ద ఆభరణాలు, ఇతర రూపాల్లో 22,000 టన్నులకు పైగా బంగారం ఉండవచ్చని అంచనా. స్వర్ణాభరణాలు, నాణేలు, కడ్డీల తయారీ కోసం గడిచిన 26 ఏళ్లలో మన దేశం దిగుమతి చేసుకున్న బంగారానికి సమానమిది.పసిడి దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు దేశీయ కుటుంబాల వద్ద నిరుపయోగంగా పడి ఉన్న బంగారాన్ని పునర్వినియోగంలోకి తెచ్చేందుకు ఈసారి బడ్జెట్‌లో గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని (జీఎంఎస్) మరింత ఆకర్షణీయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి బులియన్ వర్తక సంఘాలు లేఖ రాశాయి. ఇందుకోసం గోల్డ్ డిపాజిట్ల కాలపరిమితిపై మరింత వెసులుబాటుతో పాటు అధిక వడ్డీని ఆఫర్ చేయడం సహా 500 గ్రాముల వరకు బంగారం డిపాజిట్‌పై ఎలాంటి పన్ను దర్యాప్తు ఉండదన్న హామీ ఇవ్వాలని వర్తక సంఘాలు సూచించాయి. అలాగే, దీర్ఘకాలిక జీఎంఎస్ డిపాజిట్లపై పసిడి రుణాలందించేందుకు బ్యాంకులకు అనుమతివ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ, గుర్తింపు కలిగిన జువెలర్లు సైతం జీఎంఎస్‌లో పాల్గొనేందుకు వీలుగా పథకంలో మార్పులు చేయాలన్నారు. ఆభరణ విక్రయ కంపెనీలైతే నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని నగదీకరించుకునేలా కస్టమర్లకు నచ్చజెప్పగలవన్నారు.

ఏటా 800-850 టన్నుల దిగుమతులు

ఏటా దేశంలోకి 800-850 టన్నుల వరకు బంగారం దిగుమతి అవుతోంది. విలువ పరంగా చూస్తే, 2023లో భారత్ 4,260 కోట్ల డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకోగా.. 2024 నవంబరుతో ముగిసిన 11 నెలల్లోనే 4,700 కోట్ల పసిడి దేశంలోకి దిగుమతైంది. గత ఏడాదిలో పసిడి ధరలు భారీగా పెరగడం ఇందుకు కారణమైంది. విదేశాల నుంచి పసిడి ప్రవాహం పెరిగితే దిగుమతుల వ్యయం కూడా పెరిగి కరెంట్ ఖాతా లోటు నియంత్రణ లక్ష్యాలను మించిపోయే ప్రమాదం ఉంది. కాగా ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం రూ.80,550కి చేరింది.

జీఎంఎస్ గురించి..

కుటుంబాలు, సంస్థలు, దేవాలయాల వద్ద నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని సమీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నవంబరు 5న గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్)ను ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కస్టమర్లు ముడి బంగారం (నాణేలు, కడ్డీలు, రాళ్లు లేదా ఇతరాలు లేని ఆభరణాలు) బ్యాంకుల వద్ద డిపాజిట్ చేయవచ్చు. కనీసం 10 గ్రాములు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ పరిమితి లేదు. ఈ స్కీమ్ మూడు కాలపరిమితుల (స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక)తో కూడిన డిపాజిట్లను ఆఫర్ చేస్తోంది. మధ్యకాలిక (5-7 ఏళ్లు) డిపాజిట్‌పై 2.25 శాతం, దీర్ఘకాలిక (12-15 ఏళ్లు) డిపాజిట్‌పై 2.5 శాతం వార్షిక వడ్డీ లభిస్తుంది. కాగా, స్వల్పకాలిక (1-3 ఏళ్లు) డిపాజిట్‌పై వడ్డీని నిర్ణయించేందుకు సంబంధిత బ్యాంకుకే అధికారం కల్పించారు. అయితే, విధానపరమైన సమస్యలతో పాటు నమ్మకం లోపించడం కారణంగా కస్టమర్ల నుంచి ఈ పథకానికి ఆశించిన స్పందన లభించలేదు. 2024 మార్చి నాటికి జీఎంఎస్ పథకం కింద కేవలం 30.15 టన్నుల బంగారం మాత్రమే డిపాజిట్ అయింది.

కాగ్నిజెంట్‌లో 60 ఏళ్లకు రిటైర్మెంట్

పదవీవిరమణ గడువు రెండేళ్లు పెంపు

cognizant

బెంగళూరు: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ కంపెనీ తన ఉద్యోగుల పదవీవిరమణ గడువును 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచింది. భారత్‌లోని కంపెనీ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి, పే-రోల్‌లో మార్పు లేకుండా ఆన్‌సైట్‌లో పనిచేసే వారికీ ఇది వర్తిస్తుందని కాగ్నిజెంట్ స్పష్టం చేసింది. ఇండస్ట్రీ ప్రమాణాలకు అనుగుణంగా ఈ మార్పు చేపడుతున్నట్లు కంపెనీ తెలిపింది. అనుభవజ్ఞులైన నిపుణులను ఆకర్షించడంతో పాటు వారిని నిలుపుకునేందుకు కట్టుబడి ఉన్నామంది. అయితే, ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోని పక్షంలో ఉద్యోగి పెన్షన్ ఫండ్ మాత్రం 58 ఏళ్లకు నిలిపివేయబడుతుందని కంపెనీ తెలిపింది. కాగ్నిజెంట్ భారత కార్యాలయాల్లో 2.50 లక్షల మంది పనిచేస్తున్నారు.

డీమార్ట్ లాభం రూ.723 కోట్లు

న్యూఢిల్లీ: రిటైల్ చెయిన్ డీమార్ట్‌ను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్ట్స్ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.723.54 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.690.41 కోట్లు)తో పోల్చితే లాభం స్వల్పంగా 4.8 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ కూడా 17.68 శాతం వృద్ధితో రూ.13,572.47 కోట్ల నుంచి రూ.15,972.55 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా 18.52 శాతం పెరిగి రూ.15,001.64 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ పేర్కొంది.

ఈ ఏడాది భారత ఆర్థికం బలహీనపడొచ్చు..

ఐఎంఎఫ్

వాషింగ్టన్: ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ కాస్త బలహీనపడవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. అమెరికా వాణిజ్య విధానాలపై అంతర్జాతీయంగా అనిశ్చితి పెరిగిందని శుక్రవారం జరిగిన వార్షిక మీడియా రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె అన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి నిలకడగా కొనసాగనున్నప్పటికీ, ప్రాంతాలవారీగా వృద్ధిలో తేడాలుండవచ్చన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,640 ▲	73,000 ▲	1,01,000 ▲
విజయవాడ	80,700 ▲	76,000 ▲	93,000 ▲
విశాఖపట్నం	78,670 ▼	72,110 ▼	92,580 ▲
రాజమండ్రి	79,800 ▲	73,150 ▲	92,700 ▲
ప్రొద్దుటూరు	79,700 ▲	73,800 ▲	93,100 ▲
ముంబై	78,018 ▲	71,465 ▲	90,268 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	111
వరంగల్	104	గుంటూరు	110
కరీంనగర్	104	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	95
కర్నూలు	104	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	111		

గిఫ్ట్ కార్డుల మీద జీఎస్‌టీ ఎంతంటే..

ఇదీ GST



రాంబాబు గొండాల

ఏదైనా శుభకార్యానికి వెళ్లినప్పుడు గిఫ్ట్ తీసుకుని వెళ్లటం పరిపాటి. అయితే చాలా సందర్భాల్లో ఎలాంటి గిఫ్ట్ ఇవ్వాలో అర్థం కాదు. ఇలాంటి సందర్భాల్లో చాలా మంది గిఫ్ట్ కార్డ్స్ లేదా గిఫ్ట్ కూపన్స్ కొని ఇస్తుంటారు. అంటే, ఉదాహరణకు షాపర్స్ స్టాప్‌కి సంబంధించి రూ.1,000 గిఫ్ట్ కూపన్ లేదా గిఫ్ట్ కార్డు కొని అవతలి వ్యక్తికి ఇస్తే.. సదరు వ్యక్తి ఈ గిఫ్ట్ కార్డు తీసుకుని ఆ షాప్‌కు వెళ్లి రూ.1,000కి సరిపోను వస్తువులు లేదా బట్టలు తీసుకోవచ్చు. ఇలాంటి గిఫ్ట్ కార్డులను ఆన్‌లైన్‌లో కూడా అమ్ముతుంటారు. వీటిని గిఫ్ట్‌గా ఇవ్వటం సులభం. ఈ గిఫ్ట్ కార్డు పొందిన వ్యక్తి కూడా తనకు కావాల్సిన వస్తువులను తన అభిరుచి మేరకు కొనుగోలు చేయవచ్చు.

ఈ గిఫ్ట్ కార్డులనే వోచర్స్‌గా వ్యవహరిస్తారు. నిజానికి ఈ వోచర్స్ బిజినెస్ చాలా పెద్దది. అంటే ఇందులో వివిధ కంపెనీల వోచర్స్.. వివిధ విలువలకు సంబంధించినవి అమ్ముతుంటారు. వీటిని అమ్మటం కోసం డిస్ట్రిబ్యూటర్స్, హోల్‌సేలర్స్, రిటైలర్స్‌తో కూడిన నెట్‌వర్క్ ఉంటుంది. ఈ వోచర్ అమ్మకాలకు సంబంధించి జీఎస్‌టీలో కొంత గందరగోళం ఉండేది. ఉదాహరణకి రూ.1,000 విలువ ఉన్న వోచర్స్‌ను హోల్‌సేలర్ రూ.900కి కొని రిటైలర్‌కు రూ.950కి అమ్మాడనుకుందాం. సదరు రిటైలర్ తిరిగి కస్టమర్‌కు రూ.980కి విక్రయించాడనుకుందాం. అంటే హోల్‌సేలర్‌కి వచ్చిన రూ.50 లాభం మీద, అలాగే రిటైలర్ పొందిన రూ.30 మీద లాభం మీద పన్ను చెల్లించాలా? అసలు దీన్ని గూడ్స్ కింద పరిగణించాలా లేదా సర్వీస్ కిందకు వస్తుందా? అనే సందేహాలు కూడా చాలా మందికి ఉండేవి. ఎందుకంటే జీఎస్‌టీ అనేది గూడ్స్ లేదా సర్వీసెస్ మీద అమలవుతుంది. ఏదైనా ఒక లావాదేవీ ఈ రెండు విభాగాల్లో ఏదో ఒక దాంట్లో చేపడితేనే జీఎస్‌టీ వర్తిస్తుంది.

ఈ గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇటీవల దీని మీద వివరణ ఇచ్చింది. దీని ప్రకారం గిఫ్ట్ కార్డ్స్ లేదా గిఫ్ట్ కూపన్స్ అనేవి 'ప్రీ పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్' కిందకు వస్తాయి. అంటే, ఆ విలువకు సరిపోను డబ్బును ఆ కార్డులో ముందే నింపుతారని అర్థం. కాబట్టి దీన్ని కూడా 'డబ్బు' కిందనే భావించవచ్చు. జీఎస్‌టీ నియామవళి ప్రకారం డబ్బు అనేది 'గూడ్స్' కిందకు గానీ, 'సర్వీస్' కిందకు గానీ రాదు. ఎప్పుడైతే, ఈ రెండు విభాగాల కిందకు రాదో అప్పుడు జీఎస్‌టీ వర్తించదు. అంటే గిఫ్ట్ కార్డు అమ్మినప్పుడు ఎలాంటి జీఎస్‌టీ వర్తించదు. దీని ప్రకారం గిఫ్ట్ కార్డ్స్ అమ్మకందారులు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. కానీ, ఇలా గిఫ్ట్ కార్డు అమ్మకం, కొనుగోలు కాకుండా మధ్యవర్తిగా ఉంటూ అంటే.. ఏజెంట్ లేదా బ్రోకర్‌లా ఉంటూ కమీషన్ తీసుకుంటే మాత్రం.. పొందిన కమీషన్ మీద జీఎస్‌టీ వర్తిస్తుంది. అలాగే దీనికి సంబంధించిన ఇతర సర్వీసులు లేదా సేల్స్ ప్రమోషన్స్ మొదలైన వాటికి సంబంధించి జీఎస్‌టీ వర్తిస్తుంది.

ఇకపోతే, ఈ గిఫ్ట్ కార్డు అనేది డబ్బుల కిందనే భావిస్తారు. కాబట్టి ఈ కార్డు ఇచ్చి వస్తువులు లేదా సేవలు పొందేటప్పుడు మొత్తం విలువ మీద ఆయా వస్తువులను బట్టి జీఎస్‌టీ చెల్లించాలి. ఉదాహరణకు , ఒక వ్యక్తి రూ.1,000 గిఫ్ట్ కార్డు తీసుకుని షోరూమ్‌కి వెళ్లి రూ.1,000 విలువైన వస్తువు తీసుకున్నాడు అనుకుందాం. ఇప్పుడు ఈ వ్యక్తి.. డబ్బు చెల్లించే బదులు గిఫ్ట్ కార్డు ఇస్తాడు. కానీ గిఫ్ట్ కార్డు కూడా డబ్బు లాగానే భావించాం కాబట్టి ఈ రూ.1,000 వస్తువును డబ్బు చెల్లించే తీసుకున్నట్లు భావించి తగిన జీఎస్‌టీ చెల్లించాలి. ఇంకా చెప్పాలంటే ఈ రోజుల్లో ఫిజికల్ కరెన్సీ వాడకుండా వివిధ రకాల కార్డుల ద్వారా, ఫోన్ ద్వారా చెల్లింపులు ఎలా జరుపుతుంటారో.. ఈ గిఫ్ట్ కార్డు ఇవ్వటం కూడా ఇలాంటి చెల్లింపు కిందనే భావించాలి. కాబట్టి ఆయా వస్తువులకు ఎంత శాతం జీఎస్‌టీ వర్తిస్తుందో.. అదే జీఎస్‌టీ గిఫ్ట్ కార్డుతో కొన్నా వర్తిస్తుంది.

తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఈ వివరణతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

మహిళల రెండో వన్డే నేడు

భారత్ x ఐర్లాండ్

ఉ. 11 గం. నుంచి స్పోర్ట్స్-18లో..

సెమీస్‌లో మహారాష్ట్ర, కర్ణాటక

వడోదర: నాలుగుసార్లు చాంపియన్ కర్ణాటక, మహారాష్ట్ర జట్లు విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ సెమీఫైనల్‌కు దూసుకుపోయాయి. శనివారం ఉత్కంఠగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో కర్ణాటక 5 పరుగులతో బరోడాపై నెగ్గింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో 281/8 స్కోరు చేసింది. పడిక్కళ్ (102) శతకంతో చెలరేగాడు. ఛేదనలో బరోడా 49.5 ఓవర్లలో 276 రన్స్‌కు ఆలౌటైంది. రావత్ (104) శ్రమ వృథా అయింది. మరో క్వార్టర్స్‌లో మొదట మహారాష్ట్ర 275/6 స్కోరు చేసింది. అర్షిన్ కులకర్ణి (107) మెరిశాడు. అనంతరం పంజాబ్ 44.4 ఓవర్లలో 205 రన్స్‌కు ఆలౌటైంది.





తిలక్



నితీశ్

షమి వచ్చేశాడు

14 నెలల తర్వాత జట్టులోకి స్టార్ పేసర్

నితీశ్, తిలక్‌కు చోటు

వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు భారత టీ20 జట్టు

న్యూఢిల్లీ: భారత వెటరన్ పేసర్ మహ్మద్ షమి పునరాగమనంపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెర పడింది. 14 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఎట్టకేలకు తను టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌తో ఈనెల 22 నుంచి జరుగబోయే ఐదు టీ20ల సిరీస్ కోసం సెలెక్టర్లు 15 మందితో కూడిన భారత జట్టును ప్రకటించారు. అయితే చాంపియన్స్ ట్రోఫీకి ఆదివారమే తుది గడువు అయినా ప్రాథమిక జట్టు (వన్డే)ను ప్రకటించకపోవడం గమనార్హం. టీ20 జట్టుకు సూర్యకుమార్ నేతృత్వం వహిస్తుండగా, వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్‌ను ఎంపిక చేశారు. ఇక 34 ఏళ్ల షమి చివరిసారిగా భారత్ తరఫున 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఆడాడు. మోకాలి గాయంతో జట్టుకు దూరమైన షమి జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) పునరావాస శిబిరంలో చేరి కోలుకున్నాడు. ఆ తర్వాత బెంగాల్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తొమ్మిది మ్యాచుల్లో 11 వికెట్లు, విజయ్ హజారేలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీసి రాణించాడు. అయితే ఈ రెండు టోర్నీల మధ్యలో మోకాలి వాపునకు గురి కావడంతో ఆసీస్ టూర్‌కు వెళ్లలేకపోయాడు. ప్రస్తుతం ఎన్‌సీఏ నుంచి షమి ఫిట్‌నెస్‌కు సంబంధించి అనుమతి రావడంతో సెలెక్టర్లు ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. వచ్చే నెలలో జరిగే చాంపియన్స్ ట్రోఫీలోనూ షమి ఆడే అవకాశం ఉండడంతో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌ల ద్వారా షమిని అంచనా వేసే అవకాశం ఉంది. అయితే అతడిపై ఒత్తిడి పడకుండా చూసేందుకు అన్ని మ్యాచ్‌లను ఆడించకపోవచ్చని సమాచారం. అటు ప్రధాన వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్‌నే కొనసాగించారు. మరోవైపు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆడిన నలుగురు ఆటగాళ్లు నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్ టీ20 జట్టులో చేరారు. దీంతో గత నవంబరులో దక్షిణాఫ్రికాతో ఆడిన రమణ్‌దీప్ సింగ్, యశ్ దయాళ్, అవేశ్, జితేశ్ శర్మ స్థానాలను కోల్పోయారు. ప్రస్తుత జట్టులో అక్షర్, బిష్ణోయ్, వరుణ్, సుందర్‌ల రూపంలో నలుగురు స్పిన్నర్లు ఉండడం విశేషం. గాయం కారణంగా రియాన్ పరాగ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. కీపర్ రిషభ్ పంత్, ఓపెనర్ జైస్వాల్, గిల్‌లకు విశ్రాంతినిచ్చారు.

ఇదీ జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), శాంసన్, అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, రింకూ సింగ్, నితీశ్ కుమార్, అక్షర్, హర్షిత్, అర్ష్‌దీప్, షమి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, సుందర్, ధ్రువ్ జురెల్.



అల్కారజ్

ఆ ఇద్దరిపై..



సిన్నర్

● సిన్నర్, అల్కారజ్‌పై భారీ అంచనాలు
● అండర్ డాగ్‌గా జొకోవిచ్
● మహిళల ఫేవరెట్ సబలెంక

ఉదయం 5.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్



సబలెంక



జొకోవిచ్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నవతరం స్టార్ల హవా కొనసాగే అవకాశం ఉంది. ఆదివారం నుంచి జరిగే ఈ మేజర్ టోర్నీలో డిఫెండింగ్ చాంప్, ఇటలీ ఆటగాడు జానిక్ సిన్నర్ (23), మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ (21) పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. ఏళ్ల తరబడి బిగ్-3 రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్ టెన్నిస్‌ను ఏలారు. ఫెడెక్స్, నడాల్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించగా.. జొకోవిచ్ ఒక్కడే ప్రస్తుతం పోటీలో ఉన్నాడు. అయితే, 24 గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గి చరిత్ర సృష్టించిన జొకో గతేడాది ఒకే ఒక గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌లో మాత్రమే ఫైనల్ చేరగలిగాడు. ఈమధ్య జొకో.. సిన్నర్, అల్కారజ్‌ల నుంచి దీటైన ప్రతిఘటన ఎదుర్కొంటున్నాడు. కుర్రాళ్ల హవా సాగుతున్న ఈ పరిస్థితుల్లో 37 ఏళ్ల జొకోను మెల్‌బోర్న్‌లో అండర్ డాగ్‌గా టెన్నిస్ పండితులు విశ్లేషిస్తున్నారు. కానీ, ఇక్కడ 11వ టైటిల్ వేటలో ఉన్న ఏడో సీడ్ జొకో ఈసారి నెగ్గి తనలో సత్తా తగ్గలేదని నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నాడు. టాప్ సీడ్ సిన్నర్, అల్కారజ్‌లు గత సీజన్‌లో చెరో రెండు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గి నువ్వానేనా? అన్నట్టుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో డోపింగ్ ఆరోపణలతో ఒత్తిడికి గురైనా.. జానిక్ మాత్రం ఆటలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకొన్నాడు. కాగా, సీజన్ చివర్లో అల్కారజ్ ఫామ్ తగ్గింది. తొలి రౌండ్‌లో నికోలస్ జెర్రీ (చిలీ)తో సిన్నర్ తలపడనున్నాడు. మరోవైపు టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా ఉన్న అల్కారజ్ తన సర్వీస్‌లో మార్పులు చేసుకొని బరిలోకి దిగుతున్నాడు. సిన్నరే తనకు ప్రత్యర్థి అని ప్రకటించాడు కూడా. దీంతో ఈసారి టైటిల్ ఫైట్ వీరిద్దరి మధ్యనే జరుగుతుందన్నది విశ్లేషకుల అంచనా. గతేడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ (జర్మనీ), యూఎస్ ఓపెన్ రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) ఈసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉన్నారు. జొకోవిచ్ ఆరంభ రౌండ్లో తెలుగు మూలాలున్న అమెరికా కుర్రాడు నిషేష్ బసవారెడ్డితో తలపడనున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో గతేడాది విజేత అర్యానా సబలెంక టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతోంది. గతవారం బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టైటిల్ నెగ్గి జోరుమీదున్న సబలెంకకు మాజీ చాంప్, పోలెండ్ భామ ఇగా స్వియటెక్, ఇటలీ సంచలనం జాస్మిన్ పొలినీ గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.. 2024లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీలో పొలినీ ఫైనల్ చేరినా.. రెండుసార్లూ నిరాశే ఎదురైంది. ఇక, తొలి రౌండ్‌లో స్లోన్ స్టీఫెన్స్‌తో సబలెంక, సినికొవాతో రెండో సీడ్ స్వియటెక్, చైనా ప్లేయర్ వీ యూతో పొలినీ అమీతుమీ తేల్చుకోనున్నారు.



'వైడ్ బాల్'ను మారుస్తాం

షాన్ పొలాక్


డర్బన్: క్రికెట్‌లో సాధారణంగా బ్యాటర్లదే హవా కనిపిస్తుంటుంది. బౌలర్లకు మైదానంలో కఠిన పరిస్థితులు ఎదురవుతుంటాయి. అందుకే వీరికి కూడా అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడు షాన్ పొలాక్ అభిప్రాయపడుతున్నాడు. ముఖ్యంగా వైడ్ బంతుల విషయంలో ప్రస్తుత నిబంధనల కారణంగా బౌలర్లు నష్టపోతున్నారని, దీంట్లో మార్పులు చేసే అవకాశం ఉందన్నాడు. 'పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బ్యాటర్లు ముందుకు వచ్చి ఆడాలని చూస్తుంటారు. దీంతో బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్ గతి తప్పుతోంది. వారిని కట్టడి చేసే ప్రయత్నంలో ఎక్కువగా బంతులను వైడ్‌గా వేస్తున్నారు. అందుకే ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడిగా ఇదే అంశంపై పనిచేస్తున్నా. వైడ్ విషయంలో బౌలర్లకు ప్రయోజనం ఉండేలా రూల్‌ను మారుస్తాం. ఎందుకంటే రనప్ సమయంలోనే ఓ బౌలర్‌కు ఎక్కడ బంతిని వేయాలనేది తెలిసుండాలి. కానీ చివరి నిమిషంలో బ్యాటర్ కదిలి అతడి ఏకాగ్రతను దెబ్బతీస్తున్నాడు. అందుకే ఒకవేళ బ్యాటర్ కదిలినప్పుడు బంతి అతడికి దూరంగా పడిందే అనుకుందాం. ఆ సమయంలో బ్యాటర్ ఎక్కడైతే ఉన్నాడో, అక్కడి నుంచే బంతి పడిన దూరాన్ని పరిశీలించాలి. అప్పుడే వైడ్‌పై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుంది' అని పొలాక్ వివరించాడు.

సాత్విక్ జోడీ పరాజయం

కౌలాలంపూర్: తెలుగు షట్లర్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీకి మలేసియా సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. గతేడాది ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన భారత ద్వయం ఈసారి ఫైనల్ చేరకుండానే నిష్క్రమించింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 10-21, 15-21తో కొరియాకు చెందిన కిమ్ వోన్ హో-సియో సియంగ్ ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

శ్రీలంకకు ఓదార్పు విజయం

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో శ్రీలంక 140 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పటికే రెండు వన్డేలు గెలిచిన కివీస్ 2-1తో సిరీస్ దక్కించుకుంది. శనివారం జరిగిన ఈ చివరి మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 8 వికెట్లకు 290 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (66), కుశాల్ మెండిస్ (54), లియనగె (53), కమిందు మెండిస్ (46) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' మ్యాట్ హెన్రీ 4, శాంట్నర్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో కివీస్ 29.4 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. చాప్‌మన్ (81) మాత్రమే పోరాడగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అసిత ఫెర్నాండో, తీక్షణ, ఎషాన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.



'మెల్‌బోర్న్'తోనే గుడ్‌బై చెబుదామనుకున్నాడా!

ముంబై: ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడే విషయంలో పెద్ద చర్చ జరిగింది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగోది, బాక్సింగ్ డే టెస్ట్‌లో ఓపెనర్‌గా పునరాగమనం చేసినా రోహిత్ ఆట గాడిలో పడలేదు. ఈ నేపథ్యంలో సిడ్నీ టెస్ట్ తుది జట్టు నుంచి అతడిని తప్పిస్తారని, దాంతో టెస్ట్‌లకు భారత కెప్టెన్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ఊహాగానాలు వినిపించాయి. మొత్తంగా.. ఫామ్‌లో లేని కారణంగా తానే ఆఖరి టెస్ట్‌కు దూరంగా ఉన్నానని రోహిత్ ప్రకటించి చర్చోపచర్చలకు తెరదించాడు. అయితే బాక్సింగ్ డే టెస్ట్‌లోనూ రాణించకపోవడంతో సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాలనే నిర్ణయానికి హిట్‌మ్యాన్ వచ్చేశాడట. 'మెల్‌బోర్న్‌లోనూ విఫలమవడంతో వీడ్కోలు పలకాలని రోహిత్ నిర్ణయించుకున్నాడు. కానీ శ్రేయోభిలాషులు నచ్చజెప్పడంతో మనసు మార్చుకున్నాడు' అని రోహిత్ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

ప్రొఫెషనల్ బాక్సర్‌గా నిషాంత్

న్యూఢిల్లీ: యువ బాక్సర్ నిషాంత్ దేవ్ త్వరలో ప్రొఫెషనల్ బాక్సింగ్ సర్క్యూట్‌లో కెరీర్‌ను ప్రారంభించనున్నాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లోనూ పోటీపడ్డ 24 ఏళ్ల నిషాంత్.. ఈనెల 25న అమెరికాలోని లాస్ వేగాస్ తన తొలి ప్రొఫెషనల్ బౌట్ ఆడనున్నాడు.



డబుల్స్ బరిలో రిత్విక్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈమారు ఐదుగురు భారత ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరిలో తెలుగు కుర్రాడు, హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ చౌదరి బొల్లిపల్లి ఉండడం విశేషం. అమెరికాకు చెందిన ర్యాగ్ సెగర్‌మ్యాన్ జతగా రిత్విక్ డబుల్స్‌లో పోటీపడుతున్నాడు. వెటరన్ స్టార్ రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ డబుల్స్‌లో వేర్వేరు భాగస్వాములతో కలిసి బరిలోకి దిగుతుండగా.. సుమిత్ నగాల్ సింగిల్స్‌లో తలపడుతున్నాడు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నో టికెట్

- నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సిటింగ్ స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తున్న కాంగ్రెస్ పార్టీ
- పరిశీలనలో నలుగురి పేర్లు.. ఈ వారంలోనే నిర్ణయం
- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు!

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఈసారి టికెట్ దక్కట్లేదా? ఆ సీటుకు కాంగ్రెస్ పార్టీ, మరో అభ్యర్థిని నిలబెట్టనుందా? ఈ ప్రశ్నలకు గాంధీభవన్ వర్గాలు అవుననే అంటున్నాయి. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 2019లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన జీవన్‌రెడ్డి.. ప్రస్తుతం మండలిలో కాంగ్రెస్ సభా పక్ష నేతగా కొనసాగుతున్నారు. ఆయన పదవి కాలం మార్చి 29తో ముగియనుంది. ఇటీవల జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలోనూ ఈ సీటుకు జీవన్‌రెడ్డినే అభ్యర్థిగా అధిష్ఠానానికి ప్రతిపాదించాలన్న నిర్ణయం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ సీటును గెలుచుకునేందుకు అభ్యర్థి పెద్ద ఎత్తున ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. జీవన్‌రెడ్డి ఆర్థిక స్థోమతను బట్టి పెద్ద మొత్తంలో వెచ్చించలేరనే భావనతో ఇతరుల పేర్లు పరిశీలిస్తున్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, పార్టీ నేతలు ప్రసన్న హరికృష్ణ, వెల్చాల రాజేందర్‌రావు, మాజీ డీఎస్పీ గంగాధర్ పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నాయి. నాలుగు ఉమ్మడి జిల్లాల స్థానిక నాయకత్వాలను సంప్రదించిన తర్వాత అధిష్ఠానానికి టీపీసీసీ ప్రతిపాదన పంపనుంది. వారం రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి కానుందని, అధిష్ఠానం.. అభ్యర్థిని ఖరారు చేసి ప్రకటించనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. టీచర్ ఎమ్మెల్సీల ఎన్నికలకు సంబంధించి మిత్రపక్ష పార్టీలకు చెందిన టీచర్ యూనియన్‌ల అభ్యర్థులకు మద్దతివ్వాలన్న యోచన చేస్తున్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలన్నదానిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల అభిప్రాయాలు తీసుకుని నిర్ణయం చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు.

ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నారు

- ప్రభుత్వ భూములను ప్రైవేటుపరం చేశారు
- కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపాలి.. బుల్డోజర్లు దించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



సిరిసిల్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'గత బీఆర్ఎస్ పాలకులు, కేసీఆర్ కుటుంబ సభ్యులు ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నారు. ప్రభుత్వ భూములన్నీ ప్రైవేటు పరం చేశారు. అలాంటి వారిని ఉపేక్షించవద్దు' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం రా జన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల భూములను కబ్జా చేసిన వారిపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కలెక్టర్‌ను కోరుతున్నానన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలు నిర్మించాలన్నా, మంచి పనులు చేయాలన్నా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకుండా పోయాయని చెప్పారు. ప్రభుత్వ భూములన్నీ ప్రైవేటుపరం చేశారని, ఇకపై అలా జరగడానికి వీల్లేదని, బుల్డోజర్లు దించాలన్నారు. రాబోయే రోజుల్లో రాజకీయాలకు అతీతంగా కలిసి ముందుకు పోవాలని భావిస్తున్నానని, దారి తప్పుతున్నోళ్లను దారికి తెచ్చేందుకు యత్నిస్తానని చెప్పా రు. బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జా చేసిన స్థలాలు, భవనాలు అన్ని స్వాధీన పర్చుకోవాలని కలెక్టర్, ఎమ్మెల్యేలను కోరారు. ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నారని, ఒక కుటుంబమే లాభపడిందని చెప్పారు. గత పాలకులు ప్రశ్నించే గొంతును నొక్కారని, మధ్యతరగతి వ్యక్తులకు అధికారం వస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సుంకిశాల' నివేదికను దేశభద్రతతో ముడిపెడతారా?: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టం కింద సుంకిశాల విజిలెన్స్ నివేదికను కోరితే దేశభద్రతతో ముడిపెట్టి నిరాకరించడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కూలి 80కోట్ల ప్రజాధనానికి నష్టం వాటిల్లిందని, హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలన్న సంకల్పానికి గండిపడిందని పేర్కొన్నారు. నిర్మాణలోపం బయట పడుతుందనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ విజిలెన్స్ నివేదికను వెల్లడించడానికి జంకుతోందని శనివారం ఓ ప్రకటనలో కేటీఆర్ విమర్శించారు. సమాచారాన్ని దాచడం అంటే జరిగిన తప్పును ఒప్పుకున్నట్లేనని ఇప్పటికైనా ప్రభుత్వం సుంకిశాల విజిలెన్స్ నివేదికను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆ నలుగురు రాజకీయ ఖైదీలకు జీవించే హక్కు కల్పించాలి

- సీఏఎస్ఆర్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారనే ఆరోపణలపై వేర్వేరు కేసుల్లో వివిధ ప్రాంతాల నుంచి అరెస్టు చేసిన సంజయ్ దీపక్ రావు, అమితాబ్ బాగ్చీ, దేవేందర్‌రెడ్డి, కర్తం జోగా అనే రాజకీయ ఖైదీలకు జైలులో గౌరవంగా జీవించే హక్కును కల్పించాలని పలు పౌర హక్కుల సంఘాలు, పత్రికలతో కూడిన రాష్ట్ర అణచివేత వ్యతిరేక ప్రచారోద్యమం (సీఏఎస్ఆర్) డిమాండ్ చేసింది. హైదరాబాద్ చర్లపల్లి జైలులో ఉన్న సంజయ్ దీపక్‌రావు(60), అమితాబ్ బాగ్చీ(72), చంచల్‌గూడ సెంట్రల్ జైలులో ఉన్న కర్తం జోగా(57), జగదల్పూర్ సెంట్రల్ జైలులో ఉన్న దేవేందర్‌రెడ్డి(66) పట్ల జైలు అధికారులు నిర్లక్ష్య వైఖరితో వహిస్తున్నారని, వారి ప్రాథమిక అవసరాలను తిరస్కరిస్తున్నారని సీఏఎస్ఆర్ ఆరోపించింది. వీరి పట్ల జైలు అధికారులు, రాజ్యం దుర్మార్గంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొంది. ఈ నలుగురికి అవసరమైన వైద్య సేవలు, ప్రాథమిక సౌకర్యాలు అందించాలని... జైలు నియమాలు పాటించాలని, దేవేందర్‌రెడ్డికి మానవతా దృక్పథంతో బెయిల్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. విచారణలో ఉన్న రాజకీయ ఖైదీలపై వేధింపులను ఖండించడానికి, రాజకీయ ఖైదీలందరి విడుదల కోసం పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు అన్ని ప్రగతిశీల, ప్రజాస్వామిక సంస్థలు, వ్యక్తులు కలిసి రావాలని విజ్ఞప్తి చేసింది.

వసతి కోసం ఆన్‌లైన్ బుకింగ్ చేస్తున్నారా..?

- మహాకుంభమేళాకు వెళ్లే తెలంగాణ భక్తులు భద్రంగా ఉండాలంటూ సైబర్ అధికారుల సూచన

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాకు వెళ్లే తెలంగాణ భక్తులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు పలు సూచనలు చేశారు. కొన్ని కోట్ల మంది పాల్గొనే ఇలాంటి ఉత్సవాల్లో సైబర్ నేరగాళ్లు పంజా విసిరే అవకాశాలు ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, లింకులను రూపొందించి నెట్‌లో పెడతారని, ఎక్కువ డిస్కౌంట్లను ఆశ చూపి అడ్వాన్స్ నగదు తీసుకున్న తర్వాత మళ్లీ ఫోన్లు ఎత్తరని అన్నారు. అలాంటి వాటితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వసతికి సంబంధించి 'ధర్మశాల' పేరిట నకిలీ లింకులను ఇంటర్నెట్‌లో పెట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే వసతి కోసం ప్రయత్నాలు చేయాలని సూచించారు. మహాకుంభ మేళాకు వెళ్తున్న భక్తులు ఆన్‌లైన్‌లో వసతి కోసం చేస్తున్న ప్రయత్నాల్లో అనుమానాస్పదంగా ఎదుటి వారి ప్రవర్తన కనిపిస్తే, వెంటనే లావాదేవీని నిలిపివేసి సైబర్ సెక్యూరిటీ బ్యూరో నెంబరు 1930 ద్వారా ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్ కోరారు.

పర్యాటక, విజ్ఞాన కేంద్రంగా చంచల్‌గూడ!

కేంద్ర కారాగారం సమీపంలో జైలు మ్యూజియం.. సమరయోధుల వివరాల ప్రదర్శన

హైదరాబాద్, జనవరి11(ఆంధ్రజ్యోతి): జైలు అంటే తప్పు చేసిన వారిని చట్టపరిధిలో సంస్కరించి వారికి కొత్త జీవితం అందించే సంస్కరణ కేంద్రాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ సిద్ధమైంది. అందులో భాగంగా చంచల్‌గూడ కేంద్ర కారాగారం సమీపంలో మ్యూజియం ఏర్పాటు చేసి పర్యాటక, విజ్ఞాన కేంద్రంగా మార్చనున్నారు. ప్రజలు, విద్యార్థులు జైళ్ల గురించి స్వయంగా సందర్శించి తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఇప్పటికే ట్రైబల్ మ్యూజియానికి విశేష ఆదరణ లభిస్తోంది. చట్టప్రకారం జైలు పరిసరాల్లో సాధారణ ప్రజలు వచ్చేందుకు ఎంత వరకు అనుమతి ఉంటుందో అక్కడి వరకు చిన్నపాటి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి సందర్శకులను అనుమతించాలనే అంశాన్ని గతంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. గతంలో పరిశీలించిన ఉద్యానవనం విధానం పునఃపరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. "త్వరలో జైలు మ్యూజియం ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. పెయింటింగ్స్, ఇతర పరికరాల్ని మ్యూజియంలో ఉంచి ప్రజలకు జైళ్ల శాఖ పనితీరును వివరించనున్నాం." అని జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా తెలిపారు.

మ్యూజియంలో ఏముంటాయంటే?

మ్యూజియంలో రాజకీయ ఖైదీల జీవిత చరిత్ర, వారి త్యాగాలు భావితరాలకు తెలియజేసే విధంగా పెయింటింగ్స్ ఇతర వివరాలు పొందుపరుస్తారు. దేశస్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖుల జీవితం, వారు ఉపయోగించిన వస్తువులు ప్రదర్శనలో ఉంటాయి. జైళ్ల శాఖ పనితీరు, ఖైదీలను ఎలా ఉంచుతారు, వారికి విధించే శిక్షలు, జైళ్ల శాఖలో ఉపయోగించే పరికరాలు, పాతకాలంలో జైళ్లలో అమలు చేసిన శిక్షలకు సంబంధించిన పెయింటింగ్స్, పరికరాల్ని మ్యూజియంలో ఉంచుతారు. పురాతన జైళ్లలో ఉపయోగించిన గంటలు, ప్రస్తుతం వాడుకలో లేని ఇతర పరికరాల్ని సందర్శకులు వీక్షించడంతోపాటు వాటి పనితీరును తెలుసుకోవచ్చు. నామమాత్రపు ప్రవేశ రుసుముతో సందర్శకుల్ని అనుమతించనున్నారు.

సంగారెడ్డిలో ఇప్పటికే ప్రయోగం

గతంలో సంగారెడ్డి పాత జైలులో మ్యూజియం ఏర్పాటు చేశారు. మ్యూజియంతోపాటు సందర్శకులు జైలు జీవితాన్ని అనుభూతి చెందేందుకు వీలుగా "ఫీల్ ద జైల్" విధానంతో లాకప్ గదుల్లో ఉంచి ఖైదీల తరహాలో ఆహారం అందించారు. 2016లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన మ్యూజియం, ఫీల్ ద జైల్‌కు మొదట్లో బాగానే ఆదరణ లభించినా ఆ తర్వాత సందర్శకుల తాకిడి తగ్గింది. దీంతో కరోనాకు ముందు నుంచి సంగారెడ్డి పాత జైలు మ్యూజియం మూతపడింది.

దారులన్నీ పల్లెలకే..

సంక్రాంతికి సొంతూళ్లకు పట్నం జనం.. వాహనాలతో కిక్కిరిసిన రోడ్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



సొంతూళ్లకు వెళ్లేందుకు కూకట్‌పల్లిలో బస్సుల కోసం వేచి ఉన్న జనం

సంక్రాంతి వచ్చిందంటే సందడే సందడి. పండుగ సంబురాలను సొంతూరులో జరుపుకోవడానికి పట్నం వాసులు పల్లె బాట పట్టారు. వరుస సెలవులు రావడంతో ఉద్యోగులు, పిల్లలు అందరూ ఊర్లకు పయనమయ్యారు. బారులు తీరిన బస్సులు.. కిక్కిరిసిన ప్రయాణికులతో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు జనంతో నిండిపోయాయి. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్‌స్టేషన్(జేబీఎస్)లలో అడుగు తీస్తే అడుగుపెట్టలేని పరిస్థితి కనిపిస్తోంది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు కూడా జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఇక ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాల్లో పల్లెలకు పోయే ప్రయాణికులతో నగర శివార్లలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. పండుగ పేరిట ఆర్టీసీ బస్సుల్లో 50% చార్జీలు పెంచడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా బస్‌స్టేషన్లకు చేరుకోవడానికి హైదరాబాద్ వాసులు మెట్రో రైళ్లను ఆశ్రయించడంతో.. వాటిల్లోనూ ప్రయాణికుల రద్దీ రోజువారీ కంటే రెట్టింపుగా కనిపిస్తోంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే దారుల్లో వాహనాలు పెద్ద ఎత్తున బారులు తీరడంతో అక్కడక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. శనివారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) కార్లతో కిక్కిరిసింది. నిమిషానికి సగటున 75-80 కార్లు వెళ్లాయి. జాతీయ రహదారిపై ఒక పాయింట్ వద్ద నిల్చొని పరిలించగా.. ఈ కార్ల ప్రవాహం లెక్క తేలింది. హైదరాబాద్-విజయవాడ రహదారిలో ఉన్న పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు, కీసర టోల్ ప్లాజాల వద్ద వేలాది వాహనాలు బారులు తీరాయి. ఒక్కోటోల్ ప్లాజాలో సగటున 16 గేట్లు ఉంటే.. వాటిలో 10కి పైగా విజయవాడ రహదారికి వెళ్లే వాహనాలను అనుమతించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ మీదుగా రెండు రోజుల్లో లక్షా 50 వేల వాహనాలు వెళ్లినట్లు టోల్‌గేట్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఒక్క శనివారం రోజే 90,000 వాహనాల్లో ఏపీవైపు ప్రజలు వెళ్లారు. బీబీనగర్ మండలం గూడూరు, జోగుళాంబ గద్వాల జిల్లాలోని పుల్లూరు, మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌ప్లాజాల వద్దా భారీగా వాహనాల రద్దీ కనిపించింది.

32 కిలోమీటర్ల ప్రయాణానికి 3 గంటలు

పెద్దఅంబర్‌పేట నుంచి చౌటుప్పల్ వరకు 32 కిలోమీటర్ల మార్గంలో ప్రయాణానికి మూడు గంటల సమయం పట్టిందని ఓ ప్రయాణికుడు వాపోయారు. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాలు నెమ్మదించాయి. ట్రాఫిక్ సాఫీగా సాగేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పర్యవేక్షించారు. చౌటుప్పల్, సూర్యాపేట పట్టణంలో ఎన్‌హెచ్-65పై ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నందున ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. గత ఏడాదితో పోల్చితే ఏపీ వైపు వెళ్లే వాహనాల సంఖ్య 30% పెరిగినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. పండుగ సందర్భంగా సికింద్రాబాద్ పరిసరాల నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ 146 సిటీ బస్సులను నడుపుతోంది. ఇక పండుగ కోసం రెండు నెలల ముందుగానే రైళ్లలో వెళ్లడానికి రిజర్వేషన్ కోసం ప్రయత్నిస్తే దొరకకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు.. నిబంధనలు ఉల్లంఘిస్తూ తిరుగు తున్న 250కిపైగా ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తెలిపారు.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే..

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అంతకంతకూ పెరుగుతుండడంతో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలంటూ సూచనలు చేశారు. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్-65పై పెద్ద అంబర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎగ్జిట్-11 నుంచి చౌటుప్పల్, చిట్యాల మీదుగా వెళ్తుంటాయి. రద్దీ నేపథ్యంలో విజయవాడవైపు వెళ్లే వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు ఘట్‌కేసర్ ఎగ్జిట్-9 నుంచి భువనగిరి, వలిగొండ, రామన్నపేట మీదుగా చిట్యాల చేరుకోవాలని, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు బొంగుళూరు ఎగ్జిట్-12 నుంచి ఇబ్రహీంపట్నం, మాల్, దేవరకొండ, నాగార్జున్‌సాగర్ మీదుగా గుంటూరు చేరుకోవాలంటూ ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు.




హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

పర్యాటకంలో సైబర్ దొంగలు

ప్రభుత్వ రిసార్టుల పేరిట నకిలీ వెబ్‌సైట్లు.. ఏకంగా ఏపీటీడీసీ పర్యవేక్షణలోని వాటిపైనే వల

- 2 రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలే లక్ష్యంగా మోసాలు
- సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట సైబర్ మోసం
- మేనేజర్ పేరిట హైదరాబాద్ వాసికి రూ.7,535కు టోపీ
- గుర్తించిన బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు

(బాపట్ల-ఆంధ్రజ్యోతి)



సైబర్ దొంగలు వెబ్‌సైట్‌లో చూపిన నంబరులో సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట వాట్సాప్ ప్రొఫైల్



బాధితుడికి పంపిన అకౌంట్ వివరాలు.. వీటిలో ఖాతా మధ్రప్రదేశ్‌లో ఉండగా ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మాత్రం బాపట్లది

సైబర్ నేరగాళ్లు దేనినీ వదిలి పెట్టడం లేదు. బెదిరింపులు, డిజిటల్ అరెస్టుల నుంచి అనేక రూపాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పుడు పర్యాటక ప్రాంతాలపైనా సైబర్ నేరస్తులు పంజా విసురుతున్నారు. పర్యాటక ప్రాంతాల్లో గదులు బుక్ చేసుకునే విషయంలో సైబర్ మోసాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. తాజాగా హైదరాబాద్ వాసిని సైబర్ నేరస్తులు ఇలాంటి మోసమే చేశారు. వారి బ్యాంక్ అకౌంట్ మధ్యప్రదేశ్‌లో ఉండగా.. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మాత్రం బాపట్లలోనే ఉండడం విశేషం! అచ్చం ప్రభుత్వ వెబ్‌సైట్‌ను తలపించేలా నకిలీ సృష్టించి.. ఫోన్ నంబరుతో సహా వివరాలన్నీ ఆ సైట్‌లోనే పేర్కొని పక్కాగా నమ్మించి మోసం చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధీనంలోని రిసార్టుల్లో గదుల బుకింగే లక్ష్యంగా సాగుతున్న దందా వెలుగులోకి వచ్చింది.

ఏం జరిగింది?

హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ ప్రైవేటు ఉద్యోగి కుటుంబంతో కలిసి సెలవుల్లో బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో గడపడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నెల 12న గదుల బుకింగ్ కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఆశ్రయించారు. హరిత బీచ్ రిసార్టు పేరిట ఉన్న వెబ్‌సైట్‌లో కాంటాక్టు నంబరుకు ఫోన్ చేశారు. దీంతో మేనేజర్ తానేనంటూ సంజయ్ గుప్తా అనే వ్యక్తి పరిచయం చేసుకుని నగదు బదిలీ చేయాల్సిన ఖాతా వివరాలను వాట్సాప్ చేశారు. ఇక్కడే బ్యాకింగ్ సిస్టమ్‌లో ఉండే లొసుగులను ఆసరా చేసుకున్నారు. సహజంగా ప్రైవేటు బ్యాంకు ఖాతాలకు ఏ బ్రాంచ్ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ద్వారా అయినా నగదు బదిలీ చేసే అవకాశం ఉంటుంది. సైబర్ నేరగాడు పంపించిన అకౌంట్ నంబరు మధ్యప్రదేశ్‌దే అయినా ఐఎఫ్ఎస్‌సీ కోడ్ బాపట్లది చూపించడంతో బాధితుడికి అనుమానం రాలేదు. వెంటనే రెండు గదుల బుకింగ్ కోసం పంపించిన అకౌంట్ నంబరుకు రూ.7,535 బదిలీ చేశారు. ఇక అక్కడ నుంచి సైబర్ దొంగలు మరో ఎత్తుగడకు తెరతీశారు. నగదు బదిలీ కాలేదని, ఇంకోసారి పేమెంట్ చేయమని కోరగా, పేమెంట్ సక్సెస్ అయినట్లు తనకు మెసేజ్ రావడంతో ఉద్యోగికి అనుమానం వచ్చింది. పూర్తి వివరాలు అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో సైబర్ మోసానికి గురైనట్లు సదరు ఉద్యోగికి అర్థమైంది. వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు నివాసం ఉంటున్న హైదరాబాద్ పరిధిలోని ఏరియా పోలీస్ స్టేషన్‌కి కేసును బదిలీ చేశారు.


విస్తుపోయే వాస్తవాలు

బాధితుడు నగదు బదిలీ చేసిన రోజే హైదరాబాద్‌లోని ఆ బ్యాంకు శాఖకు వెళ్లి అకౌంట్‌పై ఆరా తీయగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. సైబర్ నేరగాడు పంపించిన ఖాతా నంబరు మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా పరిధిలోని డిరోయ్ ప్రాంతంలో ఉన్నట్లు తెలిసింది. మేనేజర్ పేరిట సంజయ్‌గుప్తా ఖాతా మాత్రం సౌరభ్‌సేన్ అనే వ్యక్తి పేరిట ఉన్నట్లు తేలింది. వేర్వేరు ప్రాంతాల నుంచి ఆ ఖాతాకు రూ.10 వేల లోపు నగదు జమ అవుతుండడం అవన్నీ కూడా ఎక్కువగా రెండు రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాల నుంచే కావడంతో సైబర్ నేరగాళ్ల లక్ష్యంపై స్పష్టత వచ్చింది. నెల క్రితం శ్రీశైలంలో కాటేజీల బుకింగ్‌లో కూడా రూ.28,000 సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్ పేరిట బురిడీ కొట్టించారనే ఫిర్యాదు కూడా హైదరాబాద్‌లోని ఆ బ్యాంకు శాఖ వద్దకే వచ్చినట్లు సమాచారం. కానీ, అప్పుడే ఆ ఖాతాను బ్లాక్ చేయాలంటే సైబర్ క్రైం డిపార్ట్‌మెంట్ నుంచి గాని, పోలీస్ శాఖ వద్ద నుంచి గాని ఆదేశాలు రావాల్సి ఉంటుంది. అయితే, అలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఖాతా కొనసాగుతూనే ఉందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. కాగా, ప్రైవేటు బ్యాంకుల విషయంలో ఎక్కడి ఖాతాకైనా ఏ ప్రాంతం ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ద్వారా అయినా నగదు బదిలీ చేసే వీలుండడం సైబర్ నేరగాళ్లకు కలిసి వచ్చింది.

నిర్లక్ష్యమే కారణం

దాదాపు ఐదు నెలల క్రితం బాపట్ల సూర్యలంక తీరంలోని హరిత బీచ్ రిసార్ట్ విషయంలో 30 మంది వరకు పర్యాటకులు ఈ తరహా సైబర్ మోసాలకు గురయ్యారు. రూ.5 లక్షల వరకు సైబర్ నేరగాళ్లు దోచేశారు. ఖాతాల వివరాలతో సహా రిసార్టు మేనేజర్ బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పుడే ఫిర్యాదు చేశారు. తర్వాత ఆ తరహా మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు విషయంలో పోలీసులు అంతంతమాత్రంగానే స్పందించారు. ఆ సమయంలో జరిగిన మోసాల్లో ఖాతా వివరాలు రాజస్థాన్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కానీ, అక్కడ వరకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకోవడం ఖర్చుతో కూడుకున్నవి కావడంతో పోలీసులు మౌనం వహించారు.

ప్రభుత్వ వెబ్‌సైట్‌నే నమ్మాలి!



ప్రభుత్వ ఆధీనంలో ఉండే అన్ని రిసార్టులకు హరిత అనే పేరుంటుంది. కానీ, ఏపీటీడీసీ పరిధిలోని టూరిజం.ఏపీ.గవ్.ఇన్ అనే వెబ్‌సైట్ మాత్రమే ప్రభుత్వ పర్యవేక్షణలో ఉంటుంది. సైబర్ నేరగాళ్లు హరిత బీచ్ రిసార్టు, సూర్యలంకతోపాటు మరికొన్ని పర్యాటక ప్రాంతాల పేరుతో హరిత రిసార్టును కామన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. గతంలోనూ సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరుతో సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. గదులు బుక్ చేసుకునే పర్యాటకులు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారానే ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టాలి.

జి. అశోక్, ఏపీటీడీసీ హరిత బీచ్ రిసార్ట్ మేనేజర్, సూర్యలంక

ఉపాధికో పందెం కోడి!

ఏపీలో కోడి పందాల కోసం నగరం నుంచి కోళ్లు

- విద్యార్థులు, చిరుద్యోగులు, టెకీల దాకా ఇదే వ్యాపకం
- ఫ్లాట్లు, ఫామ్‌హౌస్‌లలో కంటికి రెప్పలా పోషణ
- కనీస ధర రూ. 40 వేలు.. గరిష్ఠంగా రూ.లక్ష దాకా



హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో తీగ లాగితే డొంక మరెక్కడో కదిలినట్టు.. కోడి పందాలు ఏపీలో జరిగినా పోటీకి సిద్ధం చేసే కోళ్లకు నెలవవుతోంది మన హైదరాబాద్! మనుపు పందాల కోసం పుంజులను సిద్ధం చేయడం ఇక్కడ ఉండేది. గోదావరి జిల్లాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చినవాళ్లు అక్కడక్కడా కోళ్లను పెంచేవారు. ఇప్పుడిది విస్తృతమైంది. అపార్ట్‌మెంట్లలో పని చేసే వాచ్‌మెన్లు, చిరుద్యోగులు విద్యార్థులు, జిమ్ ట్రైనర్లు, చివరికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ పందాలకు కోళ్లను రెడీ చేసే పనిలో ఉన్నారు. సంక్రాంతి పండుగ కోసం ఓ ఏడాది ముందే పందాల కోసం కోళ్ల పోషణ మొదలవుతుంది. కొందరు ఫ్లాట్లలో ఒకట్రెండు కోళ్లను పెంచుతుంటే, ఇంకొందరు నగరశివార్లలో ఫామ్‌హౌస్‌లలో పెద్ద సంఖ్యలో పెంచుతున్నారు. పందాలకు కోళ్లను రెడీ చేయడం అంటే మాటలు కాదు. కోడి ఎప్పుడూ చురుకుగా ఉండాలి. ఇందుకు వాటికి నిత్యం క్రమం తప్పకుండా వాకింగ్, స్విమ్మింగ్ చేయిస్తారు, జీడిపప్పు, బాదాం, పిస్తా పప్పులు, ఉడకబెట్టిన గుడ్లు, మొలకెత్తిన గింజలు పెడతారు. ఫలితంగా ఏడాదంతా ఆ కోళ్లకు రాజభోగమే! పోషణకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది కాబట్టి పందెం కోడి ధర ఎక్కువగానే ఉంటుంది. కోడి ఎత్తు, చురుకుదనాన్ని బట్టి తక్కువకు తక్కువ రూ.40వేల నుంచి రూ.లక్ష దాకా విక్రయిస్తారు. ప్రత్యేకంగా గోదావరి జిల్లాల నుంచి పందెంరాయుళ్లు వచ్చి ఈ కోళ్లను కొంటుంటారు. దీంతో ఈ కోళ్లను పెంచడం చక్కని ఉపాధి మార్గంగా మారింది. ఇప్పటికే చాలా కోళ్లు పందాల కోసం గోదావరి జిల్లాలకు చేరాయి. ఏటా సంక్రాంతికి రెణ్నెల్ల ముందే ఎర్రగడ్డ ఆదివారం మార్కెట్లో తాను పందెం కోళ్లను అమ్మడం ప్రారంభిస్తానని, సంపత్ అనే చేవెళ్లకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి చెప్పాడు. ఇంట్లోనే చిన్న ఫామ్ పెట్టి కోళ్లను పెంచుతున్నానని తెలిపాడు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్‌లీడర్‌గా పని చేస్తున్న క్రిష్, తాను 15 ఏళ్లుగా కోడిపుంజులను పెంచుతున్నట్టు చెప్పాడు. మేడ్చల్ ప్రాం తంలో తనకో ఫామ్‌హౌస్ ఉందని, గోదావరి జిల్లా ల నుంచే ఓ కుటుంబాన్ని తీసుకొచ్చి అక్కడ కోళ్ల పెం చుతున్నట్లు చెప్పాడు. ఈయన దగ్గర వందల సంఖ్యలో పందెం కోళ్లున్నాయి. వాటిని జాతి, పొగరు, వయసు తదితర అంశాల వారీగా విభజించి మరీ ప్రత్యేక ఏర్పాట్ల మధ్య పెంచుతున్నారు. ఇక్కడ కోళ్ల పెంపకం కోసం తొలి 10నెలల పాటు నెలకు కనీసం రూ.40వేలు ఖర్చు చేస్తే.. నవంబరు-జనవరి మధ్య నెలకు రూ.80వేలు ఖర్చు పెడుతున్నారు. కల్యాణ్‌నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వాచ్‌మన్ వెంకన్న మాట్లాడుతూ కోళ్లకు మాంసం, గుడ్లు లాంటివి అందిస్తానని, నానబెట్టిన చోళ్లు, మొలకలు పెడతానని చెప్పాడు. తన రెండు కోళ్లతో భీమవరం వెళుతున్నానని, అక్కడే విక్రయిస్తానని చెప్పాడు.

ఇక్కడా కోడి పందాలు

తెలంగాణలోనూ ఇటీవలి కాలంలో కొంతమంది పందాలు వేస్తున్నారని చెప్పాడు పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ చిరుద్యోగి. నగర శివార్లలోనే వారాంతాల్లో కొన్నిసార్లు పందాలు జరుగుతాయని, సంక్రాంతి సమయంలో మాత్రం తప్పనిసరిగా ఉంటాయని, అపార్ట్‌మెంట్ టెర్రస్‌లపై పోటీలు ఎప్పుడో కానీ ఉండవు కానీ, శివార్లలో మాత్రం జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం తన దగ్గర ఐదు పుంజులున్నాయని అతను చెప్పాడు.

ఆర్ఆర్ఆర్ దక్షిణం నిర్మాణానికి కేంద్రం ఓకే!

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించిన టెండర్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు, అందులో పలు మార్పులను చేసి కొత్త నోటిఫికేషన్ జారీ చేసినట్టు తాజాగా తెలిసింది. ఈ తాజా టెండర్‌ను ఈసారి రాష్ట్ర పరిధిలోని 'ఈ-ప్రొక్యూర్ మెంట్' సైట్‌లో కాకుండా 'గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్- సెంట్రల్ పబ్లిక్ పోర్టల్‌'లో అప్‌లోడ్ చేయటం విశేషం. కాగా గతంలో ఈ రహదారి మంజూరైనప్పుడు ప్రాథమికంగా ఖరారైన అలైన్‌మెంట్ ప్రకారం చౌటుప్పల్- ఆమనగల్- సంగారెడ్డి వరకు 189 కి.మీ.ల రోడ్డు ఉండగా.. ప్రస్తుతం దూరం 11 కి.మీ.లు పెరిగింది. తాజాగా ఆహ్వానించిన టెండరు నోటీసులో 200 కి.మీ.ల రహదారికి డీపీఆర్ ఇవ్వాలని పేర్కొన్నారు.

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం పనులు కేంద్రం చేతికి వెళ్లే అవకాశం ఉందని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. 2024 డిసెంబరు 31న 'ఆర్ఆర్ఆర్ దక్షిణభాగమూ.. కేంద్రం చేతికే!' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. తాజా పరిణామాలు ఇది నిజమని నిరూపిస్తున్నాయి. కాగా, డీపీఆర్‌ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే టెండర్లను ఆహ్వానించినప్పటికీ.. ఆ నివేదిక వచ్చిన తర్వాత ఫైనాన్షియల్ అడ్వైజర్, ట్రాన్సాక్షన్, సూపర్‌విజన్ బాధ్యతలను కేంద్రానికి అప్పగించాలనే యోచనలో ఉన్నట్టు తెలిసింది. కాగా రహదారి మార్గం (అలైన్‌మెంట్) దగ్గరి నుంచి రోడ్డు నిర్మాణ విధానం సహా పలు అంశాలు డీపీఆర్ ద్వారా స్పష్టమవుతాయి. మార్గమధ్యంలో వెహికల్ అండర్ పాస్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, క్రాసింగ్ జంక్షన్‌లను ఎన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది? రహదారి వెళ్లే మార్గంలో గ్రామాలు, ఆవాసాలున్నాయా? చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయి? సాగు చేసుకుంటున్న భూములు.. అటవీభూములు ఎన్ని ఉన్నాయి? వంటి సమగ్ర వివరాలను సేకరిస్తారు. ప్రస్తుతం ఈ మార్గంలో తిరిగే వాహనాల లెక్క తేలితే.. రాబోయే 15-18 ఏళ్లలో వాటి వృద్ధి ఎలా ఉంటుంది, దాని ప్రకారం టోల్ ద్వారా ఎంత ఆదాయం వస్తుందనే దానిపైనా స్పష్టత వస్తుంది. దాని ప్రకారమే రహదారిని ఏ విధానంలో నిర్మించాలనేదానిపై ఒక అంచనా వస్తుంది.



ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో పాల్గొన్న వారితో మంత్రి సీతక్క

మహిళా శిశు సంక్షేమంలో ఆదర్శంగా తెలంగాణ

పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు

ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో మంత్రి సీతక్క

రెండు విభాగాల్లో ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ

న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అధ్యక్షతన శనివారం జరిగిన చింతన్ శిబిర్ కార్యక్రమానికి మంత్రి సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక పథకాలు, సాధించిన పురోగతి, కేంద్రం నుంచి ఆశిస్తున్న సహకారంపై సీతక్క మాట్లాడారు. వితంతువులకు ఇస్తున్న పింఛనులో కేంద్రం తన వాటాగా రూ.200 మాత్రమే ఇస్తోందని, గత పదేళ్లుగా ఈ మొత్తం పెరగలేదని గుర్తు చేశారు. అలాగే దేశంలోనే అత్యధికంగా అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు అందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వమన్నారు. కాగా అనాథ పిల్లలను చేరదీసి, వారికి విద్యాబుద్ధులు నేర్పి, సాంకేతిక శిక్షణతో మెరుగైన ఉపాధి కల్పిస్తున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థను ఉత్తమ ఆచరణ(బెస్ట్ ప్రాక్టీస్)గా కేంద్రం గుర్తించింది. వెంగళరావునగర్‌లోని మహిళా శిశు సంక్షేమ కమిషనరేట్ ప్రాంగణంలో ఆ శాఖ ఆధ్వర్యంలో మూడేళ్ల డిప్లమా కోర్స్ అందిస్తోంది. ప్రతి ఏటా 240 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. మరోవైపు కూకట్‌పల్లిలోని మహిళా ప్రాంగణంలో దేశంలోనే మొట్టమొదటి మహిళా డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇక్కడ మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు లైసెన్స్‌ను ఇప్పిస్తారు. పై రెండు సంస్థలు దేశంలోనే మొట్టమొదటివి. అందుకే ఈ రెండు విభాగాల్లో తెలంగాణను కేంద్రం ఉత్తమ ఆచరణగా గుర్తించి ప్రశంసించింది. ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో ఈ విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారికంగా ప్రకటించింది.

హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలం

- మొత్తం 73ప్లాట్లు.. 4,880 చదరపు గజాలు
- రావిర్యాలలోనూ 42 ప్లాట్ల విక్రయం

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హౌసింగ్ బోర్డు పరిధిలోని చిన్న, చిన్న ప్లాట్లను వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌కు ఉత్తరం, పడమర, దక్షిణ బోర్డు పరిధిలో ఉన్న 72 ప్లాట్లను త్వరలో విక్రయించేందుకు కసరత్తు పూర్తిచేసింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌కు పడమరలో 3,040.18 చదరపు గజాల ప్లాట్లు 24, ఉత్తరాన 566.09 చ.గజాలు ప్లాట్లు 07, దక్షిణాన 1,274.71 చదరపు గజాల్లో 42 ప్లాట్లు కలిపి మొత్తం 4,880.98 చదరపు గజాల్లో 73 ప్లాట్లు ఉన్నాయి. ఇవి ఒక్కోటి 6 నుంచి 220 చ.గజాల వరకు ఉన్నాయి. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని ప్లాట్లకు అక్కడి మార్కెట్ ధరను బట్టి గజం రూ.1.25లక్షలు, గచ్చిబౌలిలో గజం రూ.1.50లక్షలు, రావిర్యాలలో రూ.75వేల చొప్పున నిర్ణయించింది. కాగా, రావిర్యాల దగ్గర తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇళ్ల మధ్య ఉన్న 42 ప్లాట్లకు వేలం నిర్వహిస్తున్నట్టు బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 5న రావిర్యాల తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు తెలిపింది. అయితే వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష, రెండు లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)లను వేలం ప్రారంభమవడానికి 30 నిమిషాల ముందు డిపాజిట్ చేయాలని పేర్కొంది.

ఫార్మాసిటీపై నిరసన తెలిపే హక్కు రైతులకుంది

- వారిని అడ్డుకోకూడదు.. హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీకి వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కు భూములు కోల్పోతున్న రైతులకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. దీనిపై వారు నిర్వహించే పాదయాత్ర, అవగాహన శిబిరాలు, కరపత్రాలు పంపిణీ వంటి కార్యక్రమాలను అడ్డుకోరాదని పేర్కొంది. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సర్వే, ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదంటూ ఇబ్రహీంపట్నం పోలీసు అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. వీటిని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. నిరసన తెలిపే హక్కును నిరాకరించడం అంటే రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అని పేర్కొంది. నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదంటూ పోలీసు అధికారి ఇచ్చిన ఉత్తర్వులను తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొంది. నిరసన కార్యక్రమాల్లో నేరచరిత్ర ఉన్న వారు పాల్గొనకుండా చూసుకోవాలని రైతులకు సూచించింది. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉంటే పోలీసులు తగిన చర్యలు తీసుకోవచ్చని, పేర్కొంది.

సింథటిక్ మాంజాలను నిషేధించండి: హైకోర్టు

సింథటిక్ మాంజా తయారీ, అమ్మకాలు, కొనుగోళ్లు, నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మాంజాపై నిషేధం విధిస్తూ 2017లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన తీర్పును అమలు చేయాలని స్పష్టంచేసింది. మాంజా నిషేధంపై ఎన్జీటీ ఇచ్చిన తీర్పు సరిగ్గా అమలు కావడం లేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను జనవరి 31 వాయిదా వేసింది.

హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్ వ్యవస్థ



'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025'ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి తదితరులు

- ఉత్తమ విధానంపై నివేదిక ఇవ్వండి
- ఆదివాసీ గూడేలకు ఉచితంగా సౌర విద్యుత్ పంపుసెట్లు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భంలో విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేయడంపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అండర్ గ్రౌండ్ విద్యుత్ తీగల ఏర్పాటు, నిర్వహణపై వివిధ దేశాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025'ని శనివారం ఆవిష్కరించిన సీఎం రేవంత్ ఆ తర్వాత విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్యుత్ తీగలతోపాటు అన్ని రకాల కేబుళ్లు భూగర్భంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో అన్నారు. భూగర్భ వ్యవస్థ వల్ల విద్యుత్ చౌర్యం, ప్రకృతి వైపరీత్యాలప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటివి ఉండవని పేర్కొన్నారు. అలాగే, రాబోయే వేసవిలో రాష్ట్రంలో ఏ ప్రాంతంలో కూడా విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా డిస్కమ్‌లు సిద్ధం కావాలని ఆదేశించారు. అలాగే, ఆదివాసీ గూడేల్లో గృహాలకు సౌర విద్యుత్ పంపుసెట్లను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. ఇక, పదేళ్ల క్రితం మంజూరైన పరిగి 400 కేవీ సబ్‌స్టేషన్ పనులపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మించనున్న నేపథ్యంలో స్టేడియం పక్కనే ఉన్న సబ్ స్టేషన్‌ను మరోవైపు తరలించాలని సూచించారు.

కొత్త కంపెనీలు.. కొత్త బీర్లు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. బీర్ల విక్రయాల్లో ఈ కంపెనీ దాదాపు 70శాతం వాటా కలిగి ఉండటంతో రాష్ట్రంలో త్వరలో బీర్ల కొరత ఏర్పడే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఖజానాకు అధిక ఆదాయం కావాల్సినప్పుడల్లా గత ప్రభుత్వం మద్యం ధరలు పెంచి వినియోగదారులపై భారం మోపింది. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ధరలు పెంచలేదు. పెంచాల్సిందే అంటూ మద్యం తయారీదారులు పేర్కొనడం.. ప్రభుత్వాన్ని నియంత్రించాలని చూడటమే అవుతుంది. అలాంటి బ్లాక్‌మెయిలింగ్ బెదిరింపులకు ప్రభుత్వం తలొగ్గదు" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని, దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని, ప్రధానంగా కంపెనీల నాణ్యత ప్రమాణాలనూ పరిగణనలోకి తీసుకోవాలని, ఎలాంటి వివాదాలకు తావివ్వొద్దని అధికారులను సీఎం ఆదేశించారు. కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని, నెల రోజుల గడువు ఇవ్వాలని సూచించారు. కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని చెప్పారు. ఇటీవల యునైటెడ్ బేవరేజెస్ కంపెనీ బీర్ల రేట్లను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని సీఎం దృష్టికి అధికారులు తీసుకువచ్చారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని పరోక్షంగా యూబీ కంపెనీని ఉద్దేశించి పేర్కొన్నట్లు తెలిసింది. ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఏపీ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని త్రిసభ్య ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. గత ఏడాదిగా ఎక్సైజ్ శాఖకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు క్రమంగా క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో 9 మద్యం, 6 బీర్ల తయారీ కంపెనీలున్నాయి. మొత్తం 51 కంపెనీలు 1031 రకాల మద్యాన్ని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ (టీజీబీసీఎల్)కు సరఫరా చేస్తున్నాయి. కొత్త కంపెనీలను ఆహ్వానించడంతో మరిన్ని కంపెనీలు, మరిన్ని కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్

నెలాఖరులోగా 'ఉస్మానియా'కు శంకుస్థాపన

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై సీఎం శనివారం తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి గోషామహల్‌లో ఇవ్వాలని నిర్ణయించిన స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని ఆదేశించారు. నిర్మాణాల నమూనా మ్యాప్‌లను అధికారులు చూపించగా వాటిలో పలు మార్పులు, చేర్పులను సీఎం సూచించారు. మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. రోడ్డు విస్తరించినా, ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా డిజైన్లు రూపొందించాలన్నారు. రోగుల సహాయకులు సేదతీరేందుకు పార్కు ఉండేలా చూడాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వసతులతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

నేడు విద్యాసాగర్‌రావు ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ఆత్మకథ.. ఉనిక పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించనున్నారు. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణాలో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని బీజేపీ నాయకులు శనివారం తెలిపారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ల కోఆర్డినేటర్‌గా టీజీపీఎస్సీ

పీఎస్సీల చైర్మన్ల జాతీయ సదస్సులో నిర్ణయం

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల (పీఎస్‌యూ) కు కో-ఆర్డినేటర్‌గా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఎంపికైంది. ఇకపై అన్ని పీఎస్‌యూలకు సంబంధించి చట్టపరమైన సమస్యలకు టీజీపీఎస్సీ సమన్వయకర్తగా వ్యవహరించనుంది. అలాగే ఇతర రాష్ట్రాల పీఎస్సీలకు కొన్ని సబ్జెక్టులకు అవసరమయ్యే నిపుణులను కూడా ఎంపిక చేయనుంది. శనివారం బెంగళూరులో పీఎస్సీల చైర్మన్ల 25వ జాతీయ సదస్సును ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రారంభించారు. రాష్ట్రం నుంచి టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగం పెరుగుతున్నందున ప్రభుత్వ కొలువులకు తీవ్ర పోటీ నెలకొందని, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి వేగంగా ఫలితాలు ప్రకటించడం అత్యంత కీలకాంశంగా మారిందని చెప్పారు. పీఎస్సీ పరీక్షల్లో పేపర్ లీకేజీ సంఘటనలపై ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణ నిరుద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా ఉండాలన్నారు. అనంతరం పీఎస్‌యూలు అమలు చేస్తున్న అత్యున్నత విధానాలపై చర్చించారు. తదుపరి 26వ జాతీయ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

సంక్రాంతి నుంచి సంక్షేమరాజ్యం

26 నుంచి సంక్షేమ పథకాలకు శ్రీకారం

అర్హులకు ఎన్ని లక్షల తెల్లకార్డులైనా ఇస్తాం

భూభారతితో రైతు భూముల సర్వే యోచన

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



ఖమ్మం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్రాంతి నుంచి సంక్షేమరాజ్యం రాబోతోందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం నుంచి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడతామన్నారు. ఖమ్మంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులకు జనవరి 26నుంచి పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఎన్ని లక్షల తెల్లకార్డులైనా ఇస్తామని తెలిపారు. రైతు భరోసా కింద రూ.12వేలు 26 నుంచే ఇవ్వబోతున్నామని తెలిపారు. గ్రామసభల్లోనే కొండలు, గుట్టలు, సాగుచేయని భూములు, రియల్‌ఎస్టేట్‌గా మారిన భూములను గుర్తించి తొలగిస్తామని స్పష్టం చేశా రు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని కూడా 26 నుంచే అమలు చేయబోతున్నాట్లు తెలిపారు.

భూముల రీసర్వే యోచనలో ప్రభుత్వం

రాష్ట్రంలో భూభారతి చట్టం అమలు కోసం 15వ తేదీ నుంచి 28లోగా విధి, విధానాలను రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. అలాగే భూభారతి కింద రాష్ట్రంలో భూములన్నింటినీ రీసర్వే చేసే ఆలోచనను పరిశీలిస్తున్నామన్నారు. తద్వారా భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌పై కేటీఆర్ "లొట్టపీసు కేసు.. లొట్టపీసు ముఖ్యమంత్రి" అంటూ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి స్పందించారు. ఆయన మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారన్నారు. దీనికి చట్టం, ప్రజలే సమాధానం చెబుతారన్నారు.

తెలంగాణలో వర్గీకరణ జరిగి తీరుతుంది

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- మాదిగ మేధావులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘీభావ సభ
- ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు విద్యావంతులు, మేధావుల మద్దతు
- ప్రొ. హరగోపాల్, లోక్‌సత్తా జేపీ, కె.శ్రీనివాస్ తదితరుల సంఘీభావం
- మందకృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తిని కీర్తించిన వక్తలు



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలుకు సంఘీభావంగా అభివాదం చేస్తున్న లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ, కె. శ్రీనివాస్, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొ. హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, నందిని సిధారెడ్డి, దేశపతి, చిత్రంలో మంద కృష్ణమాదిగ, ఆచార్య కాశీం, సూరేపల్లి సుజాత తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను శాస్త్రీయ పద్ధతిలో అమలుచేయాలని మాదిగ మేధావుల వేదిక సదస్సు ముక్తకంఠంతో నినదించింది. మాదిగ మేధావుల వేదిక, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్తంగా శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలుకై మేధావుల సంఘీభావ సభ నిర్వహించింది. తెలంగాణ శాసనమండలి సభ్యుడు ప్రొ. కోదండరాం మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అతి త్వరలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్ల వర్గీకరణను అమలుచేస్తుందని చెప్పారు. సామాజిక వేత్త హరగోపాల్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ కేవలం మాదిగల పోరాటం మాత్రమే కాదని, న్యాయంకోసం సాగిన మహత్తర ప్రజాస్వామిక ఉద్యమమని కొనియాడారు. మందకృష్ణ మాదిగ దార్శనికత, పోరాట పటిమ ప్రజాస్వామిక పోరాటాలకు ఆదర్శమని ప్రశంసించారు. సీనియర్ పాత్రికేయులు, కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కొందరు మాలనాయకులు చేస్తున్న విమర్శలు వింటుంటే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆధిపత్యకులాలకు చెందిన వ్యక్తులు మాట్లాడిన తీరు గుర్తొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కడగొట్టు బిడ్డకు మొదటిముద్ద దక్కాలి అన్న అంతర్గత న్యాయసూత్రం ఆధారంగా షెడ్యూల్ కులాలన్నింటికి రిజర్వేషన్ ఫలాలు సమంగా అందేలా వర్గీకరణ అమలుకావాలని ఆకాంక్షించారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సంఘీభావం ప్రకటించారు. రాజ్యాంగ విలువలను, బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను గౌరవించేవారెవ్వరూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకించరని జేపీ ఉద్ఘాటించారు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి గురువు ఎమ్మార్పీఎస్ ఉద్యమం


కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ మాదిగలు లేనిదే తెలంగాణ జీవనం లేదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి గురువు ఎమ్మార్పీఎస్ ఉద్యమమని అభివర్ణించారు. షెడ్యూల్ కులాల్లోని డక్కలి, చిందు, రెల్లి తదితర అనుబంధ కులాలన్నింటికి రిజర్వేషన్ ఫలాలు అందేలా ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాగాలని, దానికి జనాభా ప్రాతిపదికన కాకూడదని గజవెల్లి ఈశ్వర్ చిందు డిమాండ్ చేశారు. ఇవాళ్టికీ కొన్నిమాదిగ అనుబంధ కులాల్లో పదోతరగతి వరకు చదువుకోనివారున్నారని ప్రొ. సూరేపల్లి సుజాత తెలిపారు. కులాలు ఏవైనా, వర్గాలు ఏవైనా, న్యాయం పక్షాన నిలిచిన వారే మానవులవుతారని సామాజిక విశ్లేషకుడు ప్రొ. కె. నాగేశ్వర్ పేర్కొన్నారు. మాదిగల పోరాటంలో న్యాయం ఉంది కనుక తాను ఈ వేదిక ద్వారా సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోని బీసీలంతా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతుగా ఉండాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు.

వర్గీకరణకు సంఘీభావం

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతుగా ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కొండా నాగేశ్వర్, ప్రజాగాయని విమలక్క, పృథ్వీరాజ్ యాదవ్, నల్గొండ గద్దర్ నర్సిరెడ్డి, తెలంగాణ విఠల్, ఇస్మాయిల్, కులనిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు అభినవ్ తదితరులు సదస్సులో మాట్లాడారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీం సభాధ్యక్షత సాగిన ఈ కార్యక్రమంలో యువ కవులు, కళాకారులు మిట్టపల్లి సురేందర్, పసునూరి రవీందర్, నలిగంటి శరత్, బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు బాధ్యత నాదే!

- వెనకడుగు వేసేదే లేదు.. అది సర్వరోగ నివారిణి
- అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేస్తాం
- రూ.22,500 కోట్లతో 4.5 లక్షల మందికి ఇళ్లు
- గిరిజన, ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భట్టి
- ఆదివాసీల కోసం కాంగ్రెస్ అనేక చట్టాలు చేసింది: మంత్రి కోమటిరెడ్డి
- రాహుల్ ప్రధాని అవుతారు: మంత్రి ఉత్తమ్



'అఖిల భారత గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం'లో మాట్లాడుతున్న భట్టి, వేదికపై మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నాగార్జునసాగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌ను సంపూర్ణంగా అమలు చేసే బాధ్యత తనదేనని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తాను చీఫ్ విప్‌గా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సమావేశపరిచి అధిష్ఠానానికి ఒక నివేదిక ఇచ్చి తప్పకుండా అమలు చేయాలని కోరానని గుర్తు చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఆమోదం పొందిందన్నారు. ఈ నేపథ్యంలో, సబ్‌ప్లాన్‌పై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించిన 'అఖిల భారత గిరిజన, ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల సాధికారత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం' శనివారం జరిగింది. దీనికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా, ఆర్థిక మంత్రిగా కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం కల్పించిందని.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను తూచా తప్పకుండా అమలు చేసే విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని సర్వరోగ నివారిణిగా భట్టి అభివర్ణించారు. అన్ని శాఖల సెక్రటరీలను సమావేశపరిచి.. సబ్‌ప్లాన్ ప్రకారం నిధులు కేటాయింపు జరుగుతుందా లేదా అనే నివేదికలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే పలు శాఖల నుంచి నివేదికలు వచ్చాయని, త్వరలో వాటిపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తానన్నారు. సబ్ ప్లాన్ కింద ప్రభుత్వం 10 శాతం నిధులు ఇస్తుందని చెప్పారు. అటవీ హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా అమలుచేస్తామని.. దీంతో అటవీ సంపదలో గిరిజన, ఆదివాసీలకు అన్ని హక్కులు లభిస్తాయని భట్టి తెలిపారు. ఐటీడీఏలకు పునరుజ్జీవం కల్పిస్తామని, గిరిజన ఆదివాసీ నిరుద్యోగులకు శిక్షణను ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రూ.22,500 కోట్లు ఖర్చు చేసి మొదటి దశలో 4.5 లక్షల మందికి ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఇందుకోసం రూ.5 లక్షలు ఇస్తున్నామని, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా ఒక లక్ష కలిపి రూ.6 లక్షలు ఇవ్వనున్నట్లు భట్టి తెలిపారు. ఆదివాసీల అభివృద్ధి కోసం అనేక చట్టాలను చేసింది కాంగ్రెస్ పార్టీనేనని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సబ్‌ప్లాన్‌ను నిర్వీర్యం చేసిందని, డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ సంపూర్ణంగా అమలవుతుందని హామీ ఇచ్చారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పాలనలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ఉత్తమ్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి..

- రూ.30 లక్షలు అప్పులు చేస్తే కట్టేసిన తండ్రి
- మళ్లీ అప్పులు చేసి ఉరేసుకున్న యువకుడు
- ట్రేడింగ్ పేరిట రూ.2 లక్షలు పోగొట్టుకొని గృహిణి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

వర్ధన్నపేట రూరల్/మరిపెడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, ట్రేడింగ్.. పేరేదైనా భారీగా డబ్బులొస్తాయని ఆశపడి పెట్టుబడులు పెడితే చివరకు అప్పులే మిగిలి ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో రూ.30 లక్షలకు పైగా నష్టపోయి ప్రాణం తీసుకోగా.. ట్రేడింగ్ పేరిట మరో గృహిణి రూ.2 లక్షలు పోగొట్టుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన లైశెట్టి కుమారస్వామి, సోమలక్ష్మి దంపతుల మూడో కుమారుడైన రాజ్ కుమార్ (28) మూడేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగులు పెడుతూ దాదాపు రూ.30 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఇందుకోసం తెలిసిన వారు, ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా అప్పులు చేశాడు. చివరకు తండ్రికి విషయం చెప్పి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో ఆయన ఉన్న ప్లాటును అమ్మి అప్పులు తీర్చేశాడు. అయితే ఎలాగైనా పోయిన డబ్బులు సంపాదించాలని రాజ్‌కుమార్ మళ్లీ అప్పులు చేసి బెట్టింగ్‌లు పెట్టడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే అప్పుల వాళ్ల వేధింపులు పెరగడంతో ఐదు రోజుల క్రితం తండ్రిని రూ.4 లక్షలు అడిగాడు. తండ్రి లేవని చెప్పడంతో రాజ్‌కుమార్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని గ్యామతండాకు చెందిన గుగులోత్ శైలజకు వారం క్రితం ఓ అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి, ట్రేడింగ్ చేస్తే రూపాయికి రూపాయి లాభం వస్తుందని ఆశచూపాడు. తొలుత రూ.5 వేలు పెట్టుబడి పెట్టగా రూ.10 వేలు ఇచ్చారు. మరోసారి రూ.50 వేలు పెట్టగా రూ.60 వేలు ఇచ్చారు. దీంతో వారిని నమ్మిన ఆమె ఏకంగా రూ.2 లక్షలు చెల్లించింది. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాళ్లు మరో రూ.4 లక్షలు చెల్లిస్తే రూ.20 లక్షలు వస్తాయని నమ్మబలికారు. కానీ అప్పటికే తాను చెల్లించిన రూ.2 లక్షలు రాకపోవడం, ఈలోపు కుటుంబసభ్యులకు విషయం తెలియడంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ఆల్ప్రాజోలం తయారీ..

- 60 కోట్ల ఆస్తుల సీజ్..ఐదుగురు నిందితుల అరెస్టు

సంగారెడ్డి క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రసాయన కంపెనీ మాటున కల్లు కల్తీకి వినియోగించే ఆల్ప్రాజోలం డ్రగ్స్‌ను తయారు చేస్తున్న ముఠా గుట్టును సంగారెడ్డి సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠా హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌ను తయారు చేస్తున్న కంపెనీ, ఇతర ఆస్తులు, 740 గ్రాముల ఆల్ప్రాజోలం, మూడు కార్లు, ఆరు సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.60 కోట్లుగా ఉంటుంది. జిల్లా ఎస్పీ రూపేశ్ వివరాలను వెల్లడించారు. మెదక్ పట్టణంలోని పిట్లంబేస్‌కు చెందిన గిర్మగొని సుధీర్‌గౌడ్ అనే రియల్టర్ పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని తన్మయిహోమ్స్‌లో ఉంటూ.. తన బావమరిది ప్రభుగౌడ్‌తో కలిసి 2014లో కల్లు దుకాణాలకు ఆల్ప్రాజోలం విక్రయాలను ప్రారంభించాడు. గుమ్మడిదలకు చెందిన సాయిగౌడ్, ముత్తంగికి చెందిన బిశ్వేశ్వర్‌సింగ్, రాజేశ్వర్ శర్మ జోషితో కలిసి 2023లో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామ శివారులోని సర్వే నంబరు 39లో సాయిప్రియ కెమికల్స్ కంపెనీని కొనుగోలు చేశాడు. ఆ కంపెనీలో వీరంతా సుధీర్ డ్రైవర్ శశికుమార్ సాయంతో ముడిపదార్థాలు తెప్పిస్తూ.. అక్రమంగా ఆల్ప్రాజోలం తయారు చేసేవారు. క్వింటా ఆల్ప్రాజోలాన్ని వీరు రూ.4 లక్షలకు విక్రయించేవారు. గత నెల 31న కలాలి అశోక్‌గౌడ్, లింగన్నగారి నారాయణమూర్తిగౌడ్, డి.సాయిలు అలియాస్ రాజు ఆల్ప్రాజోలం తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి విచారణలో ఈ ముఠా వివరాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో.. సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు మంబాపూర్ వద్ద సుధీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆయన భార్య శ్రీవాణి, బిశ్వేశ్వర్, రాజేశ్వరశర్మ, శశికుమార్‌ను అరెస్టు చేశారు. వీరి వద్ద రూ.60 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశామని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరో తొమ్మిదిమంది పరారీలో ఉన్నారరని చెప్పారు.

'గేమ్ ఛేంజర్' సినిమా స్పెషల్ షోలు రద్దు

- హైకోర్టు సూచనల మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా స్టార్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కించిన 'గేమ్ చేంజర్' సినిమా స్పెషల్ షోలను రద్దు చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక ప్రదర్శనలపై శనివారం హైకోర్టులో విచారణ జరిగింది. పుష్ప- 2 చిత్రం బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. దీంతో బెనిఫిట్ షోలను ప్రభుత్వం రద్దు చేసింది. అయితే బెనిఫిట్ షో రద్దు చేసి స్పెషల్ షోలకు అనుమతి ఇవ్వడాన్ని న్యాయస్థానం ఆక్షేపించింది. దీంతో ఆ షోలను ప్రభుత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. ఆదివారం నుంచి గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోలు నిలిచిపోనున్నాయి.

ప్రతి వారం స్టేషన్‌కు వెళ్లాల్సిన పనిలేదు

- అల్లు అర్జున్ బెయిల్ షరతుల్లో సడలింపులు
- నాంపల్లి కోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో సినీ హీరో అల్లు అర్జున్‌కు పెద్ద ఊరట లభించింది. ఈ కేసులో ఏ11గా ఉన్న అర్జున్‌కు ఈనెల 3వ తేదీన షరతులతో కూడిన సాధారణ బెయిల్ ఇవ్వగా నాంపల్లి కోర్టు వాటిలో కొన్నింటిని సడలించింది. ఈ షరతుల్లో కొన్నింటిని సడలించాలని శుక్రవారం అర్జున్ తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. శనివారం దీనిపై విచారణ జరిపిన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ నిమిత్తం ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు హాజరయ్యేందుకు భద్రత పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అర్జున్ న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సినిమా షూటింగ్‌ల కోసం విదేశాలు వెళ్లాల్సి ఉన్నందున అనుమతించాలని కోరారు. ఈ అంశాల్లో పోలీసుల నుంచి బలమైన ప్రతివాదనలు లేకపోవడంతో ఇందుకు సంబంధించిన రెండు షరతులను న్యాయస్థానం సడలించింది. పోలీసులు పూర్తి స్థాయి ఎఫ్ఐఆర్ దాఖలు చేసే వరకు నగరం విడిచి వెళ్లే ముందు చిక్కడపల్లి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని అర్జున్‌కు సూచించింది. విదేశాలు వెళ్లే ముందు తాను అక్కడ ఎక్కడ ఉంటున్నారో సహా పర్యటన పూర్తి వివరాలను పోలీసులకు తెలియజేయాలని ఆదేశించింది.

ఈత.. గుండెకోత

(మొదటిపేజీ తరువాయి)



గ్యార ధనుష్ · గ్యార లోహిత్ · చీకట్ల దినేశ్ · సాహెల్ దీపక్ సుతార్ · ఉప్పల జతిన్

తిరిగి వద్దామనుకున్నారు. అయితే.. వారి స్నేహంపై కన్నుకుట్టిన విధి.. ఐదుగురిని కబళించింది. విహారయాత్ర విషాదంగా ముగిసింది. మరణంలోనూ ఐదుగురు మిత్రులు కలిసి ఉండడం వారి కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హైదరాబాద్ భోలక్‌పూర్ సమీపంలోని ఇందిరానగర్‌కు చెందిన గ్యార నర్సింగరావు-జయంతిల ఇద్దరు కుమారులు– ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ గ్యార ధనుశ్(19), టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతూ.. కుటుంబ ఫొటోగ్రఫీ వ్యాపారంలో సాయం చేస్తున్న గ్యార లోహిత్(17), బన్సీలాల్‌పేటకు చెందిన చీకట్ల కిషన్-సుమలతల ఏకైక కుమారుడు చీకట్ల దినేశ్(17), అత్తాపూర్ జనప్రియ కాలనీకి చెందిన అనిత చిన్న కుమారుడు సాహెల్ దీపక్ సుతార్(19), ఖైరతాబాద్ చింతల్‌బస్తీకి చెందిన ఉప్పల కోటేశ్-స్వప్నలకు చిన్న కుమారుడు ఉప్పల జతిన్(17), ముషీరాబాద్ రాంనగర్‌కు చెందిన కొమారి మృగాంక్, ముషీరాబాద్ హ్యారీకాలనీలో నివసించే మహ్మద్ ఇబ్రహీం శనివారం ఉదయం 9 గంటల సమయంలో.. కొండపోచమ్మ దేవాలయానికి వెళ్తున్నట్లు ఇళ్లలో చెప్పి ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి మర్కుక్ మండల కేంద్రంలోని కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుకున్నారు. సేఫ్టీవాల్ దాటి లోనికి వెళ్లిన వీరంతా.. మధ్యాహ్నం 12.30 సమయంలో సరదాగా నీళ్లలో దిగి సెల్ఫీలు దిగాలనుకున్నారు. మృగాంక్, ఇబ్రహీం గట్టునే ఉండగా.. మిగతావారు నీళ్లలోకి దిగారు. కాసేపటికే ఒకరితర్వాత ఒకరు నీటిలో జారిపడి, గల్లంతయ్యారు. గట్టున ఉన్న ఇద్దరూ "హెల్ప్.. హెల్ప్.." అంటూ అరిచారు. డయల్-100కు ఫోన్‌చేసి, పోలీసులకు సమాచారం అందించారు. నీటిలో మునిగిపోతున్న సాహెల్ కూడా 20 నిమిషాల పాటు.. "హెల్ప్.. హెల్ప్" అంటూ అరుస్తూనే ఉన్నా.. రిజర్వాయర్ లోపల ఉండడంతో ఎవరూ వినలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, గాలింపు చేపట్టారు. సమాచారం అందుకున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ, గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చి, 20 మంది గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలను చేపట్టారు. దాదాపు ఏడు గంటల పాటు గాలింపు కొనసాగింది. ఓ దశలో బోట్‌ను తెప్పించి, గాలించారు. సాయంత్రం 5.30 సమయంలో దినేశ్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలో మిగతా నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల రోదనలతో కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్, గజ్వేల్ ఆస్పత్రి మార్మోగిపోయాయి. నూనుగు మీసాల వయసున్న చిన్నారులు తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో.. బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అంతా నిరుపేదలే..

మృతిచెందిన ఐదుగురు యువకులు అంతా నిరుపేదలే. ముగ్గురు మినహా.. మిగతా వారంతా స్విగ్గీ, మెకానిక్ వంటి చిన్నచిన్న పనులు చేస్తూ.. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. ధనుష్, లోహిత్‌ల తండ్రి నర్సింగరావు ఫొటోగ్రాఫర్. లోహిత్ ఇంజనీరింగ్ చేస్తున్నా.. తన అన్న ధనుష్, తండ్రికి ఫొటోగ్రఫీలో సహకరించేవాడు. ఇద్దరు కుమారులు చనిపోవడంతో.. ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. పాలిటెక్నిక్ డిప్లొమా చేస్తున్న ఉప్పల జతిన్ తండ్రి కోటేశ్ ఆటోడ్రైవర్. "ఉదయం 7 గంటలకు నా చేతి పాలు తాగి బయలుదేరిన బిడ్డ" అంటూ జతిన్ తల్లి స్వప్న కన్నీరుమున్నీరవుతున్నారు. సాహెల్‌కు తండ్రి లేకపోవడంతో.. తల్లి వంటపని చేస్తూ, పిల్లలను పోషిస్తున్నారు. సికింద్రాబాద్ చాచా నెహ్రూనగర్‌కు చెందిన కిషన్, సుమలత కుమారుడు దినేశ్ డిప్లొమా చదువుతున్నాడు. కిషన్ డ్రైవర్‌గా.. సుమలత ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలోనే లోహిత్, దినేశ్ మిత్రులయ్యారు.



భోలక్‌పూర్ నుంచి ద్విచక్ర వాహనాలపై కొండపోచమ్మ సాగర్‌కు వెళ్తున్న యువకులు

నాలుగేళ్లలో ముప్పై మంది

నాలుగేళ్లలో కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ 30 మందిని కబళించింది. 2020 మే 29న అప్పటి సీఎం కేసీఆర్ ఈ రిజర్వాయర్‌ను ప్రారంభించగా.. మొదట్లో బండ్‌పైకి సందర్శకులను అనుమతించేవారు. ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడడంతో.. రెండు ర్యాంపులను మూసివేసి, అనుమతిని నిరాకరించారు. దీంతో సందర్శకులు ర్యాంపుల మీదుగా కాకుండా.. కాలినడకన బండ్‌పైకి వెళ్తున్నారు. ఇదే అదనుగా.. రిజర్వాయర్‌లోకి దిగడం, ఈతకొట్టడం, చేపలను పట్టడం, నీళ్లలో కాళ్లుపెట్టి కూర్చుని, ముచ్చట్లు పెట్టడం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదవశాత్తు జారిపడి, ఈత రాక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఆత్మహత్యలకు కూడా ఈ రిజర్వాయర్ అడ్డాగా మారుతోంది. ఇంత జరుగుతున్నా.. అధికారులు భద్రతను గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా ఐదుగురు యువకులు మృతి చెందిన నేపథ్యంలో.. రిజర్వాయర్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ దిగ్ర్భాంతి



కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ ప్రమాదం గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం సమాచారం అందినప్పటి నుంచి ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో ఫోన్‌లో పరిస్థితిని సమీక్షించారు. సీఎం ఆదేశాలతో సిద్దిపేట పోలీసు కమిషనర్‌తో పాటు.. జిల్లా యంత్రాంగం అంతా ఘటనాస్థలికి చేరుకుని, గాలింపు చర్యలను పర్యవేక్షించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి రిజర్వాయర్ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ఆరోగ్యశ్రీ సేవల్లేవ్!

- సర్కారుకు షాకిచ్చిన ప్రైవేటు ఆస్పతులు
- పెండింగ్ బకాయిలపై స్పష్టత రాలేదని ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తున్నట్లు ఫ్లెక్సీలు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సర్కారుకు షాక్ ఇచ్చాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేశాయి. ఎమర్జెన్సీ సేవలను మాత్రం అందిస్తూ మిగిలిన అన్ని రకాల సేవలను అందించలేమని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. తమ ఆస్పత్రుల ప్రాంగణాల్లో రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. గత ఏడాది మార్చి నుంచి ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నుంచి బకాయిలు రావడం లేదని, ఇన్ని రోజులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఆరోగ్య శ్రీ సేవలు అందించినట్లు పేర్కొన్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఉపయోగం లేకుండాపోయిందని, అందుకే ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు యాజమాన్యాలు వెల్లడించాయి. ఈ నెల 10 నుంచి సేవలను నిలిపివేస్తున్నట్లు 4 రోజులు ముందుగానే నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు మెయిల్ పంపాయి. దాంతో 9న నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధుల బృందంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఇవో చర్చలు జరిపారు. అదేరోజు ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులకు సంబంధించి సుమారు రూ.120 కోట్లు బకాయిలను విడుదల చేసింది. చర్చల సందర్భంలో ఈ నెలాఖరు నాటికి మరో రూ.100 కోట్లు చెల్లించాలని ఆస్పత్రులు డిమాండ్ చేశాయి. సర్కారు మాత్రం ఫిబ్రవరి చివరిలోగా చెల్లిస్తామని తెలిపింది. చర్చల సందర్భంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు తొలుత సేవలను కొనసాగిస్తామని పేర్కొన్నాయి. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. కానీ కొద్ది గంటల్లోనే నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. ఆరోగ్య శ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ పథకాలకు 10 నెలల నుంచి నిధులు ఇవ్వడం లేదని ప్రకటన విడుదల చేసింది. సర్కారు చెల్లించిన రూ.120 కోట్లు కేవలం నెలన్నర బిల్లులేనని పేర్కొంది. 10 నెలల పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలిపింది. దీనిపై సరైన హామీ లేకపోవడం వల్లనే సేవలను నిలిపివేస్తున్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు రాకేశ్‌వెల్లడించారు.



ఆరోగ్య శ్రీ సేవలు కొనసాగించలేమని పేర్కొంటూ నెట్‌వర్క్ ఆస్పత్రుల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

బాగానే ఇస్తున్నామంటోన్న వైద్యశాఖ

ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఏటా సగటున వెయ్యి కోట్లకు చొప్పున నిధులు వెచ్చించాల్సి ఉండగా.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు 50% చొప్పున కేటాయించింది. 2015లో రూ.444 కోట్లు, 2016లో రూ.609 కోట్లు, 2017లో రూ.524 కోట్లు, 2018లో రూ.596 కోట్లు, 2020లో రూ.557 కోట్లు, 2021లో రూ.783 కోట్లు, 2022లో రూ.631 కోట్లు, 2023లో రూ.515 కోట్లు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో రూ.1130 కోట్లను విడుదల చేసింది. అయితే గతంలో సగం బిల్లులే ఇచ్చినప్పటికీ.. నాటి సర్కారుపై నెట్‌వర్క్ ఆస్పత్రు లు గట్టిగా ఒత్తిడి తీసుకొచ్చిన సందర్భం లేదని వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు.

కొండపోచమ్మసాగర్ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి: కేసీఆర్

- మృతుల కుటుంబాలకు 15 లక్షల పరిహారం ఇవ్వాలి: హరీశ్
- ప్రభుత్వం తగు ఆర్థికసాయం చేయాలి: కేటీఆర్, కవిత
- ఘటనపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దిగ్ర్భాంతి

హైదరాబాద్, గజ్వేల్, న్యూఢిల్లీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మసాగర్ జలాశయంలో మునిగి ఐదుగురు యువకులు మరణించడం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొండపోచమ్మ సాగర్‌లో యువకుల మృతి పట్ల కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్‌కు సూచించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొండపోచమ్మ సాగర్ జలాశయంలో యువకుల మృతి తన హృదయాన్ని కలచివేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మృతుల కుటుంబాలకు 15 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత యువకుల మృతి ఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. విషాదంలో ఉన్న మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగు ఆర్థిక సాయం చేయాలని వారు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. జలాశయాల పరిసర ప్రాంతాల్లో తగు రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు.

సెలవులకు కొడుకుని ఇంటికి తీసుకొస్తూ..

బైక్ మీద ముగ్గురు.. ఢీకొన్న కారు..

ఇద్దరి మృతి.. బాలుడి పరిస్థితి విషమం.. రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కడ్తాల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న కుమారుడిని సంక్రాంతి సెలవులకు ఇంటికి తీసుకొస్తూ తండ్రి, అతనికి కుమారుడి వరసైన మరో వ్యక్తి రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం మైసిగండి గ్రామ సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం హైవేపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బావాజీ భీమయ్య(46), బావాజీ వెంకటయ్య (45) మరణించగా భీమయ్య కుమారుడు శివ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మాడ్గుల మండలం దిల్‌వార్‌ఖాన్‌పల్లికి చెందిన భీమయ్య కుమారుడు శివ.. మహేశ్వరంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నాడు. పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో శివను ఇంటికి తెచ్చేందుకు భీమయ్య తన అన్న కుమారుడైన వెంకటయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై మహేశ్వరం వెళ్లాడు. ముగ్గురూ కలిసి తిరిగి వస్తుండగా మైసిగండి ఎంఆర్‌జీ గార్డెన్ ఎదుట ఓ స్కార్పియో కారు వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం ముందున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టగా అది అదుపు తప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో వెంకటయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. తీవ్రంగా గాయపడిన భీమయ్య, శివను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే భీమయ్య చనిపోయాడు.

పొగమంచుతో ప్రమాదం.. ఒకరి మృతి

తూప్రాన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పొగమంచు వల్ల రహదారి కనిపించక ఓ ద్విచక్రవాహనదారుడు డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలై ప్రాణాలు కోల్పోయాడు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇమాంపూర్ శివారులో శనివారం ఉదయం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో శివ్వంపేట మండలం భోజ్యాతండాకు చెందిన రత్లా శ్రీను(38) మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేటలో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీను శుక్రవారం విధులకు వెళ్లి శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. ఇమాంపూర్ వద్ద పొగమంచు వల్ల రోడ్డు కనిపించక డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.